

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

ఈ పండుగ వెలుగులు నింపే వేడుక కావాలి

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు

› 2

మన రాష్ట్రం మన పత్రిక

నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA



పరిపూర్ణ నటుడికి ఫాల్కే పురస్కారం

మలయాళ నట దిగ్గజానికి దాదా సాహెబ్ ఫాల్కే

2023 సంవత్సరానికి ఎంపిక

› 12

ఆదివారం SUNDAY 21.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 + 32 పేజీల ఆదివారం అనుబంధం Pages: 12+4 + 32 pages sunday supplement | సంపుటి (Volume): 15 || సంచిక (Issue): 107 || వెల (Price) రూ.6.50

బతుకమ్మ పండుగ ప్రారంభం

ఆదివారం, సూర్యోదయం: 6-05, సూర్యాస్తమయం: 6-13. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం తిథి: అమావాస్య రాత్రి 1-24 వరకు. నక్షత్రం: పూర్వఫల్గుణి ఉదయం 9-32 వరకు, తదుపరి ఉత్తరఫల్గుణి. వర్జ్యం: సాయంత్రం 4-41 నుంచి సాయంత్రం 6-12 వరకు. రాహుకాలం: సాయంత్రం 4-41 నుంచి సాయంత్రం 6-12 వరకు. దుర్ముహూర్తం: సాయంత్రం 4-35 నుంచి సాయంత్రం 5-23 వరకు. అమృతకాలం: రాత్రి 3-38 నుంచి తెల్లవారుజామున 5-21 వరకు. పెత్తర (మహాలయ) అమావాస్య.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

యువతను విస్మరిస్తే ఉద్యమాలే

- జెన్-జీ శక్తిని తక్కువ అంచనా వేయొద్దు
- నేపాల్, శ్రీలంక తరహాలో భారతదేశంలో కూడా ఉద్యమాలు రావని చెప్పలేము
- అభివృద్ధి, ఆవిష్కరణలను గాలికొదిలిన మోదీ
- పాక్‌తో కాదు.. పశ్చిమ దేశాలతో పోటీపడాలి
- చైనా, జపాన్ దేశాలను చూసి నేర్చుకోవాలి
- రాష్ట్రంలో రీకాల్, రిగ్రెట్, రివోల్ట్ నడుస్తున్నది
- ముంబైలో ఎన్డీటీవీ యువ సదస్సులో కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): యువత ఆకాంక్షలను ప్రభుత్వాలు పట్టించుకోవాలని, విస్మరిస్తే ప్రభుత్వాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు వచ్చే ప్రమాదం ఉన్నదని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు హెచ్చరించారు. నేపాల్, శ్రీలంక తరహాలో భారతదేశంలో కూడా ఉద్యమాలు రావని చెప్పలేమని పేర్కొన్నారు. దేశ యువత ఆకాంక్షలు ఆకాశాన్ని తాకుతుంటే, పాలకుల ఆలోచనలు మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్ చుట్టూనే తిరుగుతున్నాయని విమర్శించారు. ప్రజల మౌలిక భావోద్వేగాలను రెచ్చగొడుతూ, మందిర్-మసీద్, ఎవరు ఏం తింటున్నారు? ఎవరేం కట్టుకుంటున్నారన్న అంశాలపై ప్రజల దృష్టిని మళ్లించడంలో ప్రధాని మోదీ విజయం సాధించారని ఎద్దేవా చేశారు. దేశ భవిష్యత్తుకు కీలకమైన అభివృద్ధి, ఆవిష్కరణలను మోదీ గాలికొదిలేశారని › 8వ పేజీలో



ఆ దేవుడే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ తెచ్చాడు

- సిద్దిపేట జిల్లా ఎత్తయిన స్థానంలో ఉన్నది
- అన్ని ప్రాంతాలకు మధ్యలో ఉంటుంది
- రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా ప్రథమ స్థానంలో నిలవాలి
- త్వరలోనే ఫ్యాక్టరీ ప్రారంభం: తుమ్మల నాగేశ్వరరావు
- నర్మెట ఫ్యాక్టరీ డైరన్ పరిశీలన

› 2

డైవర్షన్‌కే 'స్థానిక' పాచిక

- ప్రభుత్వపరంగా 42 శాతం బీసీ కోటా సాధ్యం కాదని తెలిసీ ఎన్నికల ఎత్తుగడ
- ఒక్క రోజులోనే మాట మార్చిన సీఎం.. రైతుల్లో యూరియా నిరసనను డైవర్ట్ చేసే తంత్రం
- జీవో కోర్టులో నిలువదని తెలిసీ ఎన్నికలకు రేవంత్ సర్కార్ ప్రయత్నం
- సద్దుల బతుకమ్మకు ముందు షెడ్యూల్.. దసరా పండుగ సందర్భంగా నోటిఫికేషన్

- ఇంటెలిజెన్స్ చీఫ్‌తో సీఎం మంతనాలు
- సర్కారుపై వ్యతిరేకత బతుకమ్మ పాటల్లో మరింత వ్యక్తమవుతదని సమాచారం
- దాన్ని కప్పిపుచ్చేందుకే తెరపైకి ఎలక్షన్ డ్రామా!
- సర్కారు ఉత్తర్వులు కోర్టులో చెల్లకపోవడాన్ని బీసీ సంఘాలు, ప్రతిపక్షాలే చూసుకుంటాయని ముఖ్యమంత్రి ధీమా?



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : యూరియా కొరతపై రైతుల నిరసనలను డైవర్ట్ చేసేందుకు కాంగ్రెస్ సర్కారు 'స్థానిక' పాచిక వేసింది. ఇప్పట్లో ఎన్నికలు ఉండవని చెప్పిన తర్వాత 24 గంటలు గడవక ముందే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటమార్చారు. ప్రభుత్వ పరంగా 42 శాతం బీసీ కోటాతో స్థానిక ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయం తీసుకున్నారు. ఓవైపు ప్రభుత్వ పరంగా 42 శాతం రిజర్వేషన్లు అసాధ్యమని తెలిసీ ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. సద్దుల బతుకమ్మకు రెండు రోజుల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీ చేయాలని, దసరాకు ఒక రోజు ముందుగానో లేక, మరుసటిరోజునో నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు శనివారం అందుబాటులో ఉన్న మంత్రులతో కలిసి పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం రేవంత్ సమీక్షా సమావేశం నిర్వహించారు. అంతకు ముందు ఇంటెలిజెన్స్ చీఫ్‌తోనూ చాలా సేపు మంతనాలు జరిపినట్టు తెలిసింది. యూరియా కొరతపై రైతుల్లో నెలకొన్న తీవ్ర వ్యతిరేకతను డైవర్ట్ చేసేందుకే సీఎం మరోసారి బీసీ అస్త్రాన్ని ప్రయోగించారని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. న్యాయ సమీక్ష ముందు నిలబడని ఉత్తర్వులిచ్చి › 11వ పేజీలో

ఇండియాపై ట్రంప్ H1-B బాంబ్!

దరఖాస్తు ఫీజును రూ.88 లక్షలకు పెంచిన అమెరికా

గతంలో వీసా ఫీజు
2-5 వేల డాలర్లు


ఇక నుంచి ఫీజు
లక్ష డాలర్లు (రూ.88 లక్షలు)



ఎంతమంది భారతీయులపై ప్రభావం
4 లక్షల మంది

ఎంత ఎక్కువ చెల్లించాలి?
సంవత్సరానికి 3.4 లక్షల కోట్లు

- కార్యనిర్వాహక ఉత్తర్వుపై డొనాల్డ్ ట్రంప్ సంతకాలు
- తమకు గొప్ప ఉద్యోగులు కావాలన్న అమెరికా అధ్యక్షుడు
- విదేశీ ఉద్యోగులను తీసుకోవడం ఇకనైనా ఆపాలంటూ టెక్ కంపెనీలకు సూచించిన యూఎస్ వాణిజ్య మంత్రి
- 4 లక్షల మంది భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఇండియన్ టెకీల డాలర్ డ్రీమ్స్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నీళ్లు చల్లారు. అగ్రరాజ్యంలో ఉద్యోగం చేద్దామని గంపెడాశతో ఉన్న సాంకేతిక నిపుణులపై పిడుగు వేశారు. సుంకాలు, అక్రమ వలసల పేరిట ఇప్పటికే కఠిన నిర్ణయాలను తీసుకొచ్చిన ట్రంప్.. ఇప్పుడు హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు (రూ. 88 లక్షలు) పెంచారు. ఈ మేరకు కార్యనిర్వాహక ఉత్తర్వులపై శుక్రవారం సంతకాలు › 7వ పేజీలో

మోదీ వైఫల్యం!

- తొలుత ట్రంప్‌తో చెట్టపట్టాల్.. ఎన్నికల్లో ప్రచారం
- అలాంటి పనులు తగవంటూ అప్పుడే విపక్షాలు, కేసీఆర్ హెచ్చరిక



- రాజకీయవేత్తలు, నిపుణుల సలహాలనూ పక్కనబెట్టిన మోదీ
- ఆ ఎన్నికల్లో ట్రంప్ ఓటమి.. అమెరికా అధ్యక్షుడైన బైడెన్
- ట్రంప్‌ను కాదని బైడెన్‌తో సాన్నిహిత్యం పెంచుకొన్న మోదీ
- విదేశాలపై ఆధారపడుతూ.. 'మేకిన్ ఇండియా'కు తూట్లు
- ఓటు బ్యాంకు పాలిటిక్స్ కోసం దక్షిణాది రాష్ట్రాలకూ అన్యాయం
- అమెరికాలో మళ్లీ ట్రంప్ అధికారం.. భారత్‌పై ఆంక్షల మోత
- తాజాగా హెచ్-1బీ వీసా రుసుమును పెంచుతూ నిర్ణయం
- భారత్‌పై పెను ప్రభావం.. ఎక్కువ నష్టం తెలుగువారికే › 8

తెలంగాణ అస్తిత్వానికి ప్రతీక బతుకమ్మ

ఈ పండుగ వెలుగులు నింపే వేడుక కావాలి

రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ అస్తిత్వానికి, సాంస్కృతిక జీవనానికి ప్రతీకైన బతుకమ్మ పండుగ రాష్ట్ర ప్రజల బతుకుల్లో వెలుగులు నింపే వేడుక కావాలని బీఆర్ఎస్ అధినేత కే చంద్రశేఖర్‌రావు ఆకాంక్షించారు. ఆదివారం నుంచి ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభమవుతున్న సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కేసీఆర్ శుభాకాంక్షలు తెలియజేశారు. పూలను దేవతగా కొలిచే ఈ పండుగ ప్రపంచ సంస్కృతి, సంప్రదాయాల్లో తెలంగాణ ప్రత్యేకతను చాటుతున్నదని పేర్కొన్నారు. ఎంగిలిపూలతో మొదలై, సద్దులతో ముగిసే తొమ్మిది రోజుల బతుకమ్మ పండుగతో పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా మహిళలు, పిల్లాపాపలతో సాంస్కృతిక సందడి నెలకొంటుందని తెలిపారు. సబ్బండ జనుల భాగస్వామ్యంతో, నాటి తెలంగాణ సాధనోద్యమంలో బతుకమ్మ కీలక భూమిక పోషించిందని గుర్తుచేశారు. తెలంగాణ ప్రత్యేక అస్తిత్వ ఆకాంక్షలకు అద్దంపడుతూ సాంస్కృతిక వేదికగా నిలిచిందని గుర్తుచేసుకున్నారు. నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి సముచిత గౌరవం ఇచ్చిందని చెప్పారు. రాష్ట్ర మహిళల ప్రత్యేక వేడుకగా గుర్తించి బతుకమ్మ చీరల పేరిట కానుకలు అందించి వారి సంతోషంలో పాలుపంచుకున్నదని పేర్కొన్నారు. ఈ ఏడు బతుకమ్మను ఆడబిడ్డలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని, ప్రకృతిమాత ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని అభిలషించారు.

మహిళలకు బతుకమ్మ శుభాకాంక్షలు: కేటీఆర్

బతుకమ్మ పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్ర మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మను ఆనందోత్సాహాల నడుమ జరుపుకోవాలని ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. స్వరాష్ట్రంలో తెలంగాణ తొలి సీఎం బతుకమ్మను రాష్ట్ర పండుగగా గుర్తించి అధికారికంగా నిర్వహించినట్టు గుర్తుచేశారు. దీంతో బతుకమ్మ పండుగకు ప్రపంచవ్యాప్త గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు.

దసరా దగా.. 270 కోట్లు!

పేద, మధ్యతరగతిపై కాంగ్రెస్ సర్కారు 'రోడ్డు భద్రత సెస్'

- జీఎస్టీ తగ్గింపు ఆనందం ఆవిరి
- వాహనాల కొనుగోలుపై మరో ట్యాక్స్
- ఏటా 270 కోట్ల లూటీకి ప్రభుత్వం స్కెచ్
- ఒక్కో వాహనంపై 2-10 వేల వసూలు
- బిల్లుకు రహస్యంగా క్యాబినెట్ ఆమోదం
- అసెంబ్లీ ఆమోదిస్తే అడ్డగోలు దందా షురూ!



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): దసరా వస్తున్నదంటే ప్రజలంతా కొత్తకొత్త ఆఫర్ల కోసం ఎదురుచూస్తుంటారు. ఈ సీజన్‌లో స్పెషల్ ధమాకా పేరిట ధరలు తగ్గుతాయన్న ఆశతో వాహనాల కొనుగోలుకు ఆసక్తి చూపుతారు. ఈ క్రమంలో దసరాకు శుభవార్తలు చెప్పాల్సిన రాష్ట్ర ప్రభుత్వం సామాన్యులను పండుగ పూట దగా చేసే దురాలోచనతో ముందుకొచ్చింది. కొత్త వాహనాల కొనుగోళ్లపై జీఎస్టీ తగ్గిందనే ఆనందాన్ని.. అది అమల్లోకి రాక ముందే ఆవిరి చేసింది. కొత్తగా వాహనాలు కొనుగోలు చేసేవారికి కేంద్రం కొంత రిలీఫ్ ఇచ్చినా.. తెలంగాణలోని కాంగ్రెస్ సర్కారు మాత్రం ఆ అవకాశం ప్రజలకు లేకుండా చేసింది. డబ్బుల కోసం పట్టి పీడించేందుకు అత్యంత రహస్యంగా ప్రణాళికలు సిద్ధం చేసింది. తెలంగాణలో ఇక నుంచి కొత్త వాహనాలు కొనుగోలు చేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన సెస్సును తప్పనిసరిగా చెల్లించాల్సిందే. 'రోడ్డు భద్రతా సెస్సు' పేరిట రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలను జలగల్లా పట్టి పీడించేందుకు సర్కారు సిద్ధమైంది. వారిపై ఆర్థిక యుద్ధం ప్రకటించింది. ఇప్పటికే లైఫ్‌ట్యాక్స్, ఇన్సూరెన్స్ ప్రీమియం పాలసీలతో సామాన్యులు సతమతమవుతుండగా ఫ్యాన్సీ నంబర్ల ధరలనూ అమాంతం పెంచింది. కేంద్రం తెచ్చిన హై సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్‌ఎస్‌ఆర్పీ)ను తెలంగాణలో అమలు చేయిస్తూ బలవంతంగా కోట్ల రూపాయలు దండుకుంటున్నది. ఈ క్రమంలో రోడ్డు భద్రతా సెస్సుతో ఏటా రూ.270 కోట్లు కొల్లగొట్టేందుకు సిద్ధమైంది.

ఏటా ఇదే లూటీ

కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చే ఈ ప్రతిపాదనలు.. బిల్లు రూపం దాల్చి, అసెంబ్లీలోకి తీసుకురావాలని ఇప్పటికే నిర్ణయించారు. ప్రభుత్వం తీసుకుంటున్న విధానాల వల్ల ఆర్టీఏకు భారీగా ఆదాయం తగ్గుతూ వస్తున్నది. ఇటీవల ప్రభుత్వ పెద్దలు సైతం ఆర్టీసీ, ఆర్టీఏ, ఎక్సైజ్ ఆదాయాలు తగ్గడంపై అభ్యంతరాలు వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలో ఆర్టీఏ అధికారులకు రోడ్డు భద్రతపై సుప్రీం కోర్టు నియమించిన కమిటీ ఆదేశాలు గుర్తుకొచ్చాయి. అందులో భాగంగానే 'రోడ్డు భద్రతా సెస్సు'కు ప్రతిపాదనలు సిద్ధం చేసి, మంత్రివర్గం ముందుకు తీసుకెళ్లడంతో వారు కూడా ఓకే చెప్పేశారు. కాగా, కొత్త వాహనాల సమయంలో వసూలు చేసే సెస్సు డబ్బును రవాణాశాఖ కమిషనర్ ఆపరేట్ చేసేలా ప్రత్యేక ఖాతాను తెరుస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఇలా వసూలు చేసే సొమ్ముతో సెమినార్లు, వర్క్‌షాపులు, డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు, ట్రాఫిక్ ఎడ్యుకేషనల్ పార్కులు, భారీ వాహనాల డ్రైవర్లకు కంటి పరీక్షలు, స్పీడ్ లేజర్ గన్‌లు, బ్రీత్ అనలైజర్లు, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ పరికరాలను కొనుగోలు చేస్తామని చెప్తున్నది. కేవలం వీటికే ఏటా రూ.270 కోట్లు ఖర్చు చేస్తారా? అనేది ప్రశ్నగా మారింది. దీనికి మాత్రం ప్రభుత్వం నుంచి, రవాణా శాఖ నుంచి సమాధానం లేదు.

ఒక్కో వాహనంపై 2-10 వేలు

కేంద్రం జీఎస్టీ స్లాబులను సవరించిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఆ సడలింపు ఊరట లేకుండానే రహస్యంగా మంత్రివర్గంతో చర్చించింది. ప్రతిపాదనలు సిద్ధం చేసి వెనువెంటనే ఆమోదించింది. ఆ బిల్లును కూడా అసెంబ్లీలో పాస్ చేయించి రోడ్డు భద్రతా సెస్సును ప్రజలపై మోపనున్నది. ఈ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందితే బైక్ కొనుగోలుదారులకు రూ.2వేలు, కార్లు, తేలికపాటి వాహనాలు కొనుగోలు చేసేవారి నుంచి రూ.5 వేలు, ఇతర భారీ వాహనాలు కొనుగోలు చేసే వారి నుంచి రూ.10 వేల వరకూ వసూలు చేయనున్నారు. ఏటా సగటున 9 లక్షలకు పైగా వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. అత్యధికంగా ద్విచక్ర వాహనాలే 6 లక్షల వరకు ఉంటున్నాయి. ఆ తర్వాత లక్షన్నర వరకూ కార్లు ఇతర వాహనాలు ఉంటున్నాయి. మన దగ్గర రిజిస్టర్ అయ్యే కొత్త వాహనాలను బట్టి ఈ మొత్తం విలువ రూ.270 కోట్ల వరకూ ఉంటుందని అంచనా.


లోకం పోకడ



రానుపోను మీ బస్‌చార్జీలకు రెండు చీరలు కొనుక్కోవచ్చు.. చీరకట్టుకొని ఫ్రీ బస్‌లో నాతో పాటు మీరూ వచ్చేయండి!

కాళోజీ కళాక్షేత్రానికి తాళం

- 4 కోట్ల బిల్లు పెండింగ్.. తాళం వేసిన కాంట్రాక్టర్
- సీఎం ప్రారంభించి ఏడాది.. నేడు భట్టి కార్యక్రమం
- బిల్లు సంగతి తేల్చకుండా కాంట్రాక్టర్‌పై కేసు



హనుమకొండ/సుబేదారి, సెప్టెంబర్ 20 : హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రానికి తాళం పడింది. ఏడాది క్రితం సీఎం రేవంత్ ఆర్భాటంగా ప్రారంభించారు. 'కుడా' ఆధీనంలో ఉన్న కాళోజీ కళాక్షేత్రాన్ని ప్రారంభించి ఏడాదైనా కాంట్రాక్టు పనులు చేపట్టిన మెస్సర్స్ బృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ శ్రీకాంత్‌రెడ్డికి రూ.4 కోట్లకు పైగా బిల్లులు రాకపోవడంతో శనివారం ప్రధాన గేట్లకు తాళం వేశారు. ఆదివారం నుంచి కళాక్షేత్రంలో మొట్టమొదటిసారి జరగనున్న కాకతీయ నృత్య నాటకోత్సవాల ఏర్పాట్ల కోసం అధికారులు చేరుకోగా గేట్లకు తాళాలను గమనించి కంగుతిన్నారు. ఈ విషయాన్ని వారు జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కుడా ఉన్నతాధికారి అజిత్‌రెడ్డి కాంట్రాక్టర్‌తో మాట్లాడగా తాళం వేసింది తానేనని.. తనకు రూ. 4కోట్ల బిల్లు రావాల్సి ఉన్నదని తెలిపారు. బిల్లులు చెల్లించే వరకు తాళం తీసే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారు. విషయాన్ని అజిత్‌రెడ్డి అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చారు. వారి ఆదేశాల మేరకు సుబేదారి పోలీసులు కాంట్రాక్టర్‌తో మాట్లాడి నృత్య నాటకోత్సవాలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు హాజరు కానున్నారని, వేసిన తాళం తీయాలని, బిల్లుల విషయాన్ని అధికారులతో మాట్లాడుకోవాలని హుకుం జారీ చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, కాంట్రాక్టర్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. పెండింగ్ బిల్లుల విషయాన్ని అధికారులతో మాట్లాడుకోవాలి తప్ప ఇలా చేయడం సరికాదని హెచ్చరించి తాళాలు తీశారు. బిల్లుల సంగతి తేల్చకుండా అధికారులు బెదిరింపులకు పాల్పడుతున్నారని కాంట్రాక్టర్ వాపోయారు. కుడా వైస్ చైర్మన్ చాహత్ బాజ్‌పాయ్ ఫిర్యాదు మేరకు మెస్సర్స్ బృందా ఇన్‌ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్ హైదరాబాద్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఇన్‌స్పెక్టర్ రంజిత్ తెలిపారు.

సామాన్యులపై సర్కారు మరో భారం

- వాహన కొనుగోలుపై రోడ్డు భద్రత సెస్
- ఒక్కో వాహనంపై 2-10 వేలు అదనంగా దండుకోనున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ముక్కుపిండి 270 కోట్ల వసూలుకు కుట్ర
- ఈ సర్కార్‌ను తెలంగాణ ప్రజలు క్షమించరు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే వాటిని అమలుచేయాల్సింది పోయి, వాహన కొనుగోలుదారులపై రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు అదనపు భారం మోపుతున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇది సీఎం రేవంత్‌రెడ్డి ప్రజావ్యతిరేక వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించి భద్రతా ప్రమాణాలను పెంచకుండా, ఇలా సామాన్యులపై భారం మోపడం అత్యంత దారుణమని ఫైర్ అయ్యారు. హైడ్రా వంటి దిక్కుమాలిన విధానాలతో ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటును పూడ్చలేక ప్రజలపై అదనపు భారం మోపడం దుర్మార్గమైన చర్య అని శనివారం ఓ ప్రకటనలో అభివర్ణించారు.

గ్యారెంటీలను గాలికొదిలి కోట్ల వసూలుకు కుట్ర

రహదారి భద్రతా సెస్ పేరిట ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకు అదనపు భారం వేయడం పేద, మధ్యతరగతి ప్రజానీకాన్ని దగా చేయడమేనని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలుచేస్తామన్న గ్యారెంటీలను రెండేండ్లయినా పట్టించుకోకుండా గాలికొదిలేసి, చివరికి ప్రజల నుంచే ముక్కుపిండి రూ.270 కోట్లు వసూలు చేసే కుట్రకు కాంగ్రెస్ సర్కారు తెర తీసిందని నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ సర్కారును తెలంగాణ ప్రజలు క్షమించబోరని హెచ్చరించారు. పైసాపైసా కూడబెట్టుకొని, అప్పు చేసి మరీ వాహనం కొనుగోలు చేసేవారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు రేవంత్‌రెడ్డి సర్కారు ఇకనైనా ముగింపు పలకాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హితవుపలికారు.

వానా కాలం


	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	36.8°c	22.3°c
రంగారెడ్డి	35.4°c	20.0°c
మెదక్	34.8°c	25.0°c
నిజామాబాద్	34.4°c	24.2°c
వరంగల్	34.0°c	23.0°c
ఖమ్మం	33.0°c	24.0°c
కరీంనగర్	32.0°c	26.0°c
హైదరాబాద్	32.0°c	22.4°c
నల్లగొండ	30.0°c	23.0°c
మహబూబ్‌నగర్	30.0°c	23.0°c

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కన్నెర్ర!

జీతాలు నిలిపివేసిన దేవాదాయశాఖ?

విధులు సరిగా నిర్వర్తించడం లేదని ఆగ్రహం

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): దేవాదాయశాఖ కార్యాలయంలోని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై ఆ శాఖ ఉన్నతాధికారులు కన్నెర్ర జేశారు. శనివారం బొగ్గులకుంటలోని కార్యాలయంలో ఉద్యోగులతో అధికారులు అత్యవసరంగా సమావేశమయ్యారు. రెండురోజులుగా కార్యాలయంలో పనిచేస్తున్న వారిలో ఎంతమంది సమయానికి వస్తున్నారని, అసలు కొంతకాలంగా వారు సరిగా పనిచేయడం లేదంటూ అధికారులు సీరియస్ అయినట్టు తెలిసింది. జీతాలు ఆపేస్తామంటూ హెచ్చరించడంతో ఉద్యోగులు ఉన్నతాధికారులను బతిమిలాడారని, ఈ క్రమంలో ఇష్టమైతే పనిచేయండి, లేకుంటే మానేయండి అంటూ మండిపడినట్టు సమాచారం. సమయానికి రాకపోతే ఇకనుంచి ఊరుకునే ప్రసక్తే లేదని, వారి హాజరుపై ఒక అధికారి రెగ్యులర్‌గా మానిటరింగ్ చేయాలని సూచించినట్టు తెలిసింది. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మాత్రం.. తాము పదేండ్లకుపైగా ఇక్కడే పనిచేస్తున్నామని, రెగ్యులర్ ఉద్యోగులు సరిగా పనిచేయకపోగా, వారిని అడిగే వారేలేరని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆవేదన వ్యక్తంచేశారు. తాము ఉదయం పది గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పనిచేస్తున్నామని, టపాలు ఇచ్చే సందర్భంలో కొంత ఆలస్యమైతే, అది కూడా కావద్దంటున్నారని, విధి నిర్వహణలోనే జరుగుతున్నదే అయినా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. తమను అకారణంగా వేధిస్తున్నారని, ఈ నెల జీతాలు ఆపేస్తున్నట్టుగా చెప్పారని, తమకు జీతాలు వస్తాయా? రావా? అనేది ప్రశ్నార్థకంగా మారిందని వాపోతున్నారు.



VIVEKANANDA VIDYALAYAM
Recognised by the Govt of T.S.
Gangadhara, Dist: Karimnagar.

విద్యార్థులను పాఠశాలకు పంపవద్దంటూ తల్లిదండ్రులకు కరీంనగర్ జిల్లా గంగాధరలోని వివేకానంద స్కూల్ యాజమాన్యం రాసిన లేఖ

బెస్ట్ అవైలబుల్ స్కూల్ విద్యార్థులకు ప్రవేశం లేదు

అక్టోబర్ 4 నుంచి పంపవద్దని తల్లిదండ్రులకు ఓ ప్రైవేటు స్కూల్ లేఖలు

గంగాధర, సెప్టెంబర్ 20 : బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో భాగంగా ప్రవేశాలు పొందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను అక్టోబర్ 4వ తేదీ నుంచి పాఠశాలలోకి అనుమతించబోమని కరీంనగర్ జిల్లా గంగాధర మండల కేంద్రంలోని వివేకానంద పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు లేఖలు పంపింది. బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద ఉచితంగా అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు సంబంధించిన ఫీజును ప్రభుత్వమే చెల్లిస్తున్నదని, కానీ గత రెండేండ్ల నుంచి ప్రభుత్వం ఒక్క రూపాయి ఇవ్వలేదని యాజమాన్యం లేఖలో పేర్కొన్నది. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రెండేండ్లుగా బ్యాంకుల నుంచి అప్పులు తెచ్చి విద్యాబోధన చేశామని, అప్పులు ఎక్కువ కావడంతో ఇబ్బంది పడుతున్నట్టు తెలిపింది. రాజకీయ నాయకులు, అధికారులు డబ్బులు ఇప్పిస్తామని చెప్పినా ఇప్పటి వరకు ఇవ్వలేదని వివరించింది. దీంతో బెస్ట్ అవైలబుల్ స్కీమ్‌లో భాగంగా ప్రవేశాలు పొందిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులను వచ్చే నెల 4వ తేదీ నుంచి పాఠశాలలోకి అనుమతించడంలేదని లేఖలో పేర్కొన్నది. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



సిద్దిపేట జిల్లా నర్మెట ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తిని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఆ దేవుడే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ తెచ్చాడు

సిద్దిపేట జిల్లా అన్ని ప్రాంతాలకు మధ్యలో ఉంటుంది

త్వరలోనే ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ ప్రారంభిస్తాం: మంత్రి తుమ్మల

నర్మెట ఫ్యాక్టరీ డ్రైరన్ పరిశీలన

నంగునూరు, సెప్టెంబర్ 20 : 'పీఠభూమిలో సిద్దిపేట జిల్లా ఎత్తయిన స్థానంలో ఉన్నది. ఆ దేవుడు ఈ ప్రాంతానికి ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీ తీసుకువచ్చాడు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కేంద్ర స్థానంలో సిద్దిపేట ఉన్నది. ఎక్కడి నుంచైనా సులభంగా ఇక్కడికి ఆయిల్‌పామ్ గెలలను రవాణా చేయవచ్చు. రాబోయే రెండు, మూడేండ్లలో 6 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగుచేసి దేశంలోనే నంబర్ వన్‌గా తెలంగాణను నిలపాలి. రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా మొదటి స్థానంలో నిలవాలనేది మా ఆకాంక్ష' అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం నర్మెట గ్రామంలో నిర్మించిన ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని శనివారం ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డితో కలిసి మంత్రి సందర్శించారు. డ్రైరన్‌ను తిలకించి ముడి పామాయిల్ ఉత్పత్తిని పరిశీలించారు. అనంతరం మంత్రి తుమ్మల మీడియాతో మాట్లాడుతూ...దేశంలో 13 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతున్నట్టు తెలిపారు. ఇందులో పది లక్షల ఎకరాలు తెలంగాణ, ఏపీలోనే సాగవుతుందని చెప్పారు. ప్రతి ఉమ్మడి జిల్లాలో లక్ష ఎకరాల ఆయిల్‌పామ్ సాగు జరగాలన్నదే ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.

దేశంలోనే మొదటి స్థానంలో నిలిచేలా ఫ్యాక్టరీ నిర్మాణం

ప్రపంచస్థాయి టెక్నాలజీని వినియోగించుకొని దేశంలో మొదటి స్థానంలో నిలిచేలా నర్మెట్టలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని నిర్మించామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం నిర్వహించి, ఫ్యాక్టరీ వద్ద రాష్ట్రంలోని లక్షమంది ఆయిల్‌పామ్ రైతులతో సభ నిర్వహిస్తామని చెప్పారు.

యువతను విస్మరిస్తే ఉద్యమాలే

మొదటిపేజీ తరువాయి...

విమర్శించారు. చైనా, జపాన్, అమెరికా వంటి పశ్చిమ దేశాలతో పోటీపడి వారిని అధిగమించే ప్రయత్నం చేయాలే తప్ప, మనకన్నా వెనుకబడిన దేశాలతో పోల్చుకుని సంతృప్తి చెందడం సరికాదని హితవుపలికారు. ముంబైలో శనివారం సాయంత్రం 'ఎన్డీటీవీ యువ- 2025-ది ముంబై చాప్టర్' సదస్సులో కేటీఆర్ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. జెన్-జెడ్ ఆలోచనలు, దేశ యువత ఆకాంక్షలు, ప్రభుత్వాల పాత్ర వంటి అంశాలపై తనదైన శైలిలో అద్భుతంగా ప్రసంగించి సభికులను ఆకట్టుకున్నారు.

అపారమైన బాధ్యతతో పనిచేయాలి

ప్రస్తుత తరం యువత (1997-2012 మధ్య జన్మించినవారు జెన్-జెడ్) కేవలం డిజిటల్ మీడియాకే పరిమితం కావద్దని, సమాజం పట్ల అపారమైన బాధ్యతతో పనిచేయాలని కేటీఆర్ సూచించారు. జెన్-జెడ్ శక్తిని తక్కువ అంచనా వేయవద్దని పాలకులను హెచ్చరించారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం 400 ఎకరాల అటవీభూమిని అమ్మాలని ప్రయత్నిస్తే, సెంట్రల్ వర్సిటీ విద్యార్థులు ప్రభుత్వ మెడలు వంచిన విషయాన్ని గుర్తుచేశారు. సుప్రీం కోర్టు జోక్యం చేసుకొని ఆ భూముల విక్రయాన్ని నిలిపివేసిందని చెప్పారు. ఇదే జెన్-జెడ్ జనరేషన్ పవర్ అని అన్నారు. సోషల్‌మీడియాలో చురుగ్గా ఉండే యువత, రాజకీయాల్లోకి కూడా రావాలని పిలుపునిచ్చారు. 'రాజకీయాలు మీ భవిష్యత్తును నిర్ణయిస్తున్నప్పుడు, మీరే ఎందుకు రాజకీయాలను నిర్ణయించలేరు?' అని యువతను కేటీఆర్ ప్రశ్నించారు.

అత్యుత్తములతో పోల్చుకోవాలి

ప్రపంచం అంతా ముసలితనంలో మూలుగుతుంటే భారతదేశం మాత్రం యువరక్తంతో ఉరకలెత్తుతున్నదని కేటీఆర్ అన్నారు. దేశంలో సగటు వ్యక్తి వయస్సు 27 సంవత్సరాలని, 50% జనాభా 35 ఏండ్లలోనే ఉన్నారని చెప్పారు. ఈ యువశక్తిని దేశ నిర్మాణానికి వాడుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. 1985లో చైనా, భారత ఆర్థిక వ్యవస్థలు దాదాపు సమానంగా ఉండేవని గుర్తుచేశారు. 'అప్పుడు చైనా తలసరి ఆదాయం 300 డాలర్లు అయితే మనది 500 డాలర్లు. కానీ, 40 ఏండ్ల తర్వాత చూస్తే, ఇండియా ఆర్థిక వ్యవస్థ 4 ట్రిలియన్ డాలర్లకే పరిమితమైంది. కానీ, చైనా 20 ట్రిలియన్ డాలర్లకు ఎదిగింది. ఇవాళ చైనా తలసరి ఆదాయం 13,000 డాలర్లు అయితే మనది కేవలం 2,700 డాలర్లే. చైనా మనల్ని ఎలా దాటిపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలి. మనం ఎప్పుడైనా అత్యుత్తములతో పోల్చుకోవాలి. అమెరికా, యూరప్‌లతో చైనా పోటీపడితే, మనం మాత్రం పాకిస్థాన్, బంగ్లాదేశ్‌తో పోల్చుకుని మురిసిపోతున్నాం' అని ఎద్దేవా చేశారు.



ముంబైలో జరిగిన 'ఎన్డీటీవీ యువ- 2025- ది ముంబై చాప్టర్' సదస్సులో మాట్లాడుతున్న కేటీఆర్

విధ్వంసం నుంచి వికసించిన జపాన్

అణుబాంబు దాడితో సర్వనాశనమైన జపాన్.. కేవలం 23 ఏండ్లలోనే విధ్వంసం నుంచి వికాసం వైపు పయనించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ప్రపంచంలో న్యూక్లియర్ దాడి జరిగిన ఏకైక దేశం జపాన్ అని, భూకంపాలు, సునామీలు వచ్చినా తట్టుకొని నిలబడిందని చెప్పారు. 1945లో హిరోషిమా, నాగసాకిపై అణుదాడి జరిగి లక్షలాది మంది చనిపోయినా జపాన్ కుంగిపోలేదని అన్నారు. ఎన్నో భౌగోళిక అనుకూలతలు ఉన్నా, ప్రకృతి వైపరీత్యాలు ముంచెత్తినా వాటన్నింటినీ తట్టుకుని అద్భుత ఆవిష్కరణలు, పారిశ్రామికీకరణతో నేడు మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా జపాన్ ఎదిగిందని పేర్కొన్నారు. జపాన్ సాధించినప్పుడు భారత్ ఎందుకు సాధించలేకపోయిందో ప్రతి ఒక్కరూ ఆలోచించాలని కోరారు. జపాన్ ఆలోచన విధానమే కారణమని, వచ్చే పదేండ్లలో రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదని చెప్పారు.

తెలంగాణ చేసింది.. భారత్ ఎందుకు చేయలేకపోయింది?

పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సాధించిన ప్రగతిని కేటీఆర్ సోదాహరణలతో వివరించారు. 'ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉన్నది. ప్రపంచంలోనే అమెజాన్‌కు అతిపెద్ద క్యాంపస్ తెలంగాణలోని హైదరాబాద్‌లో ఉన్నది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ (టీ-హబ్) హైదరాబాద్‌లో ఉన్నది. కేవలం పదేండ్లలోనే తెలంగాణ ఇన్ని చేయగలిగినప్పుడు, మిగతా భారతదేశం ఎందుకు చేయలేకపోయింది? ఒకసారి ఆలోచించాలి' అని కేటీఆర్ సూచించారు. 'సుందర్ పిచాయ్, సత్య నాదెళ్ల, అరవింద్ నారాయణ్ వంటి వారు అమెరికన్ కంపెనీలకు సీఈవోలు అయితే మనం సంతోషిస్తాం. కానీ, మన దేశం నుంచి ఒక్క ప్రపంచస్థాయి ఆవిష్కరణ కూడా రాలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని కేటీఆర్ చురకలంటించారు. మనకు వెంచర్ క్యాపిటల్ కాదు, అడ్వెంచర్ క్యాపిటల్ కావాలని సూచించారు. మనదేశంలోని 38 కోట్ల జెన్-జెడ్ యువత సరికొత్త ఆలోచనలతో ప్రపంచగతిని మార్చేందుకు ప్రభుత్వాలతో, పరిశ్రమలతో కలిసి పనిచేయాలని కోరారు. 'పెట్టుబడి లేకపోవడం కాదు.. మీ ఊహాశక్తి, ఆశయాలే మిమ్మల్ని ఆపుతున్నాయి' అని యువతలో కేటీఆర్ స్ఫూర్తి నింపారు.

ఆర్టీసీ స్పెషల్ దోపిడీ షురూ!

- రద్దీ దృష్ట్యా 50% రేట్లు పెంచిన ఆర్టీసీ
- రూ. 300 టికెట్ ఇప్పుడు రూ.430
- కంటికి కనిపించని ఉచిత బస్సులు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల నుంచి ప్రత్యేక బస్సుల పేరుతో టీజీఎస్ఆర్టీసీ స్పెషల్ దోపిడీకి తెరతీసింది. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులకు లేకుండా స్పెషల్ బస్సులను అందుబాటులోకి తెచ్చామని ఒకవైపు చెబుతూనే.. మరోవైపు అదనపు చార్జీలతో మోత మోగించింది. దీంతో సాధారణ సమయాల్లో ఉండే రేట్లే అనుకొని బస్సెక్కే ప్రయాణికులు టికెట్ ధరలను చూసి అవాక్కవుతున్నారు. ఎంతో ఆనందంగా పండుగకు సొంతూళ్లకు వెళ్దామనుకుంటే ఇలా అదనపు చార్జీలు పెంచడం ఏంటని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఈసారి దూరంతో సంబంధం లేకుండా ప్రత్యేక బస్సుల్లో ఏకంగా 50% టిక్కెట్ల ధరలను పెంచారు. దీంతో ఉప్పల్ నుంచి తొర్రూర్‌కు సూపర్ లగ్జరీ టికెట్ ధర నిరుడు రూ.300వరకు ఉండగా.. 50% అదనపు పెంపుతో రూ.430కి పెరిగింది. మహబూబ్‌నగర్ నుంచి ఎంజీబీఎస్‌కు సూపర్ లగ్జరీ టికెట్ ధర నిరుడు వరకు రూ.220 ఉండగా.. ఇప్పుడు రూ.290కిపైగా వసూలు చేస్తున్నారు. సాధారణ రోజుల్లో టికెట్ ధర రూ.100 ఉంటే.. స్పెషల్ బస్సుల పేరుతో రూ.150 వరకూ వసూలు చేస్తున్నారు. రూ.200 టికెట్ ధర ఉంటే.. రూ.300, రూ.320, రూ.350వరకు బస్సుల శ్రేణిని బట్టి ధరలను పెంచారు. దీంతో పండుగకు ఇంటికి వెళ్లాలనుకున్న తమను అదునుచూసి ఆర్టీసీ సంస్థ నిలువుదోపిడీ చేస్తుందని పలువురు మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో పెరిగిన ధరలను చూపిస్తూ పలువురు ప్రయాణికులు ఆర్టీసీ నిలువు దోపిడీని సోషల్ మీడియా వేదికగా ఎండగడుతున్నారు. ఇదిలా ఉండగా, శుక్రవారం సాయంత్రం నుంచే అన్ని బస్టాండ్‌ల్లో విపరీతమైన రద్దీ పెరిగింది. కొన్నిచోట్ల సరిపడా బస్సులు లేకపోవడంతో గంటల తరబడి బస్సుల కోసం ఎదురుచూశారు. కాగా, మహిళల కోసం ఏర్పాటు చేసిన ఉచిత బస్సులు మాత్రం దసరా పండుగకు కంటికి కనిపించలేదు. దీంతో చాలా మంది మహిళలు స్పెషల్ బస్సుల్లోనే ప్రయాణాలు సాగించారు. ఇక అరకొరగా కేటాయించిన ఉచిత బస్సుల్లో సీట్ల కోసం ఎప్పటిలాగే ఆడబిడ్డలకు ఎగబడ్డారు. దీంతో పలుచోట్ల తోపులాటలు, గొడవలు జరిగాయి. గత రాఖీ పండగకు ఒక్కరోజే ఆర్టీసీకి రూ.33.40 కోట్ల ఆదాయం సమకూరింది.



దసరా సెలవుల సందర్భంగా శనివారం నిజామాబాద్ బస్టాండ్‌లో కిక్కిరిసిన ప్రయాణికులు

ఇండ్ల మంజూరులో అన్యాయం

- పేదలను నమ్మించి నట్టేట ముంచిన కాంగ్రెస్ సర్కార్
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్



జగిత్యాల, సెప్టెంబర్ 20: ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో పేదలకు అన్యాయం చేశారని, ఆరు గ్యారెంటీల్లో ఒక్కటైన ఈ పథకం ఫెయిల్ అయిందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. శనివారం ఆయన జగిత్యాలలోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఇల్లు మంజూరు కావాలంటే సర్కార్ మరో కొత్త మెలిక పెట్టిందని ధ్వజమెత్తారు. కారు, వ్యాన్, ట్రాక్టర్, తదితర నాలుగు చక్రాల వాహనం ఉంటే అనర్హులుగా తేల్చేస్తున్నారని మండిపడ్డారు. దళిత బంధులో వాహనాలు తీసుకున్న వారికి ఇల్లు రావడం లేదని అన్నారు. జగిత్యాల జిల్లాలో మొత్తం 10,700 ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా, 7,261 మంది ముగ్గు పోశారని, 2,569మంది బేస్మెంట్, 468 మంది గోడల నిర్మాణం పూర్తి కాగా 165 స్లాబ్ దశకు వచ్చాయని తెలిపారు. ఇప్పటివరకు ఒక్కటి కూడా పూర్తయిన దాఖలాలు లేవని అన్నారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రజాపాలనలో 77.18 లక్షల దరఖాస్తులు రాగా, అందులో 36.03 లక్షల మందిని మాత్రమే ప్రభుత్వం అర్హులుగా ప్రకటించిందని, మిగిలిన 41.15 లక్షల మందికి ఇండ్లు పొందే అర్హత లేదా? అని ప్రశ్నించారు. 600 చదరపు అడుగుల స్థలం మించి నిర్మాణం చేపట్టిన వారికి ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తించదని చెల్లింపులను నిలిపివేస్తున్నారని మండిపడ్డారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూంలను కాంగ్రెస్ రంగులు మార్చి పంపిణీ చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ సమావేశంలో జడ్పీ మాజీ చైర్పర్సన్ దావ వసంత, మాజీ వైస్ చైర్మన్ హరిచరణ్రావు పాల్గొన్నారు.



కడియం సంతకం లేని ప్రొసీడింగ్స్‌ను తగులబెడుతున్న మాజీ ఎమ్మెల్యే రాజయ్య

నియోజకవర్గానికి రాకుండానే వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశావా?

- ఎమ్మెల్యే కడియంపై మాజీ ఎమ్మెల్యే రాజయ్య ఫైర్
- కడియం శ్రీహరి సంతకంలేని ప్రొసీడింగ్స్ దహనం

స్టేషన్ ఘన్పూర్, సెప్టెంబర్ 20: 'ఉప ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కడియం శ్రీహరి ఒక్కసారి కూడా నియోజకవర్గానికి రాకుండానే అభివృద్ధి చేశానని చెప్పడం విడ్డూరంగా ఉన్నది. నిజంగా అభివృద్ధి చేస్తే వాటికి సంబంధించిన శిలా ఫలకాలు ఎక్కడున్నాయో చూపించాలి. మనం ఇద్దరం ఎమ్మెల్యేలుగా ఉన్నప్పుడు ఎవరు అభివృద్ధి చేశారో ప్రజల ముందు నిరూపించుకోవడానికి రావాలి' అని స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య సవాల్ విసిరారు. శనివారం ఆయన జనగామ జిల్లా స్టేషన్ ఘన్పూర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో సుమారు వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశానని జీవో పత్రాలను చూపిస్తున్న ఎమ్మెల్యే కడియం సంతకం ఎందుకు లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రొసీడింగ్స్‌పై సంతకం చేసే ధైర్యం కూడా కడియంకు లేదని దుయ్యబట్టారు. కడియం సంతకం లేని ప్రొసీడింగ్స్ చెత్త కాగితాలతో సమానమంటూ తగలబెట్టారు. నేను నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తున్నానని, నేను ఏ పార్టీలో ఉన్నానో స్పీకర్ చెబుతారనడం సిగ్గుచేటు' అని అన్నారు. బీఆర్ఎస్ టికెట్‌తో గెలిచిన కడియం రాజీనామా చేయాలని అన్నారు.

రాష్ట్రంలో విచ్చలవిడిగా ఇసుక దోపిడీ

- ఇందిరమ్మ పేరిట అక్రమ రవాణా
- ఓటమి భయంతో స్థానికం వాయిదా
- నిధుల్లేక పల్లెల్లో కమ్ముకున్న చీకట్లు
- మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి
- ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించాలి
- బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి, బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ ఫైనాన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్ గోసుల శ్రీనివాస్ తదితరులు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తేతెలంగాణ): రాష్ట్రంలోని గోదావరి పరివాహక ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్ల పేరిట విచ్చలవిడిగా ఇసుక దోపిడీ జరుగుతున్నదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ఆరోపించారు. కాంగ్రెస్ నేతల ప్రోద్బలంతోనే అక్రమ దందా సాగుతున్నదని, అధికార యంత్రాంగం చోద్యం చూస్తున్నదని విమర్శించారు. అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉన్నదా? లేదా? అని ప్రశ్నించారు. శనివారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. ఇసుక దందాకు అడ్డుకట్ట వేయకుంటే గోదావరి పరివాహక ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ కండ్లు తెరిచి ఇసుక దందాకు అడ్డుకట్ట వేయాలని డిమాండ్ చేశారు.

ఓటమి భయంతోనే..

సీఎం రేవంత్‌రెడ్డి ఓటమి భయంతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించడంలేదని గండ్ర వెంకటరమణారెడ్డి విమర్శించారు. రెండేండ్లుగా పాలకవర్గాలు లేకపోవడం, నిధులు రాకపోవడంతో పల్లెల్లో చీకట్లు అలుముకున్నాయని చెప్పారు. ఎన్నికల నిర్వహణ చేతగాని ప్రభుత్వం కనీసం బతుకమ్మ, దసరా పండుగల సందర్భాల్లోనైనా సౌకర్యాలపై దృష్టిపెట్టాలని హితవు పలికారు. పెద్ద పంచాయతీలకు రూ.5 లక్షలు, చిన్న పంచాయతీలకు రూ.3 లక్షల చొప్పున నిధులు మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సీఎం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. పండుగలు సమీపిస్తున్నా సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటా ఎందుకివ్వడంలేదని ప్రశ్నించారు.

ఫిరాయింపులపై సీఎం వ్యాఖ్యలు హాస్యాస్పదం

ఢిల్లీకి వెళ్లిన సీఎం రేవంత్‌రెడ్డి చిత్రవిచిత్రంగా ప్రవరిస్తున్నారని గండ్ర వెంకటరమణారెడ్డి ఎద్దేవా చేశారు. కాంగ్రెస్‌లోకి ఫిరాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు కండువా కప్పినంత మాత్రాన పార్టీలో చేరినట్టా? అని సీఎం మాట్లాడటం విడ్డూరంగా ఉన్నదని పేర్కొన్నారు 'వారికి కప్పిన కండువాలు కాకుంటే మరేం ప్రామాణికం? ఫిరాయింపు ఎమ్మెల్యే కాంగ్రెస్ నుంచి ఎంపీగా పోటీ చేయలేదా? కడియం శ్రీహరితో కలిసి సీఎం ఎన్నికల ప్రచారం చేయలేదా? అభివృద్ధి కోసమే కడియం కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు చెప్పలేదా?' అని ప్రశ్నించారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి ఢిల్లీలో చిల్లరగా మాట్లాడటం సిగ్గుచేటని మండిపడ్డారు. స్పీకర్ నిర్ణయం కోసం తెలంగాణ ప్రజలు ఎదురుచూస్తున్నారని చెప్పారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బుద్ధిచెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

ట్రంప్ బాటలో సీఎం రేవంత్‌రెడ్డి: గెల్లు శ్రీనివాస్‌యాదవ్

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరహాలోనే సీఎం రేవంత్‌రెడ్డి కూడా అసంబద్ధ నిర్ణయాలు తీసుకుంటూ ప్రజలను ఇబ్బంది పెడుతున్నారని బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ విమర్శించారు. సుభిక్షమైన పాలనా విధానాలతో తెలంగాణ ప్రజల బతుకుల్లో వెలుగులు నింపిన కేసీఆర్‌ను ట్రంప్‌తో పోల్చడం సిగ్గుచేటని పేర్కొన్నారు. వెంటనే ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. గ్రూప్-1పై కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టు డివిజన్ బెంచ్‌కు వెళ్లడం దుర్మార్గమని మండిపడ్డారు. వెంటనే కోర్టు సూచనల మేరకు పరీక్షలను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. ఫిరాయింపులను ప్రోత్సహించిన సీఎం ఇప్పుడు తప్పించుకొనేందుకు అడ్డదారులు తొక్కుతున్నారని, గుడిలో కప్పే కండువాలకు, కాంగ్రెస్ కండువాలకు తేడా తెలియకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టారు. ఇప్పటికైనా డ్రామాలు ఆపి దమ్ముంటే ఫిరాయింపు ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఫైనాన్స్ కమిషన్ మాజీ డైరెక్టర్ గోసుల శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు పడాల సతీశ్, నర్సింగ్ పాల్గొన్నారు.

న్యాయవాదులకు కాంగ్రెస్ పాలనలో రక్షణ లేదు

బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్ర మండిపడ్డారు. ఇటీవల నాంపల్లి, కూకట్‌పల్లి, మంచాలలో అడ్వకేట్లపై జరిగిన దాడులను ఉదహరించారు. న్యాయవాదులపై దాడిని ఖండిస్తూ శనివారం ఒక ప్రకటన విడుదలచేశారు. కుటుంబాన్ని, ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా సమాజం కోసం పనిచేస్తున్న న్యాయవాదులపై దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని కోరారు. దాడులు పునరావృతం కాకుండా ఉండాలంటే అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ ఏర్పాటుచేసి రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. అందుకోసం న్యాయవాదులంతా సమష్టిగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

ఏడాదిలోనే 20 వేల కోట్ల లావాదేవీలు

- 'క్యాప్స్ గోల్డ్'లో అంతులేని అక్రమాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): పన్ను చెల్లింపుల్లో అవకతవకలు జరిగాయన్న సమాచారం మేరకు గత 5 రోజులుగా హైదరాబాద్, విజయవాడ, నెల్లూరు, ముంబై, బెంగళూరులోని ప్రముఖ బంగారం దుకాణాలు, వాటి యజమానుల ఇండ్లలో సోదాలు నిర్వహిస్తున్న ఆదాయ పన్ను (ఐటీ) అధికారులు 'క్యాప్స్ గోల్డ్' సంస్థలో భారీగా అక్రమాలు జరిగినట్టు గుర్తించారు. కేవలం ఒక్క ఏడాదిలోనే ఆ సంస్థ రూ.20 వేల కోట్లకుపైగా విలువైన లావాదేవీలు నిర్వహించినట్టు తేల్చారు. దేశంలోని టాప్-3 బులియన్ మర్చెంట్లలో ఒకటిగా పేరుగాంచిన ఈ సంస్థ భారీగా పన్ను ఎగవేతలకు పాల్పడటంతోపాటు బ్లాక్ మార్కెట్ నుంచి బంగారం కొనుగోలు చేసి అన్అకౌంటెడ్ సేల్స్ చేయడం, మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి భారీగా బంగారాన్ని కొనుగోలుచేసి దారిమళ్లించడం లాంటి అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించారు. ఆ క్రమంలో పలు కీలక డాక్యుమెంట్లు, ల్యాప్‌టాప్‌లు స్వాధీనం చేసుకున్నారు.

మెగా డీఎస్సీ పేరుతో కాంగ్రెస్ దగా!

- ముఖ్యమంత్రికి ఆయన శాఖలపై కనీస అవగాహన ఉందా?
- నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తారో చెప్పాలి
- కాంగ్రెస్ సర్కారును నిలదీసిన బీఈడీ అభ్యర్థుల సంఘం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న నిరుద్యోగులు

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20 : మెగా డీఎస్సీ పేరుతో బీఈడీ అభ్యర్థులను కాంగ్రెస్ ప్రభుత్వం దగా చేసిందని తెలంగాణ బీఈడీ అభ్యర్థుల సంఘం విమర్శించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీఈడీ అభ్యర్థులతో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అధ్యక్షుడు భూక్యా కుమార్ మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చిన వెంటనే 25వేల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ వేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, తీరా అధికారం చేపట్టాక విస్మరించిందని మండిపడ్డారు. కేరళ ప్రభుత్వం 75% డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కోటాలో భర్తీ చేసిందని, తెలంగాణలో సైతం అదే విధానాన్ని అనుసరించాలని డిమాండ్ చేశారు. జీవో-108ను తక్షణమే రద్దు చేయాలని కోరారు. 26వేలకు పైగా పోస్టులకు పదోన్నతులు ఇచ్చామని చెప్పుకుంటున్న ప్రభుత్వం తద్వారా ఏర్పడిన ఖాళీలను ఎందుకు భర్తీ చేయడం లేదని నిలదీశారు. 9వేల స్కూల్ అసిస్టెంట్, 20 వేల ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉంటే కేవలం 5వేలు, 6వేలు ఇస్తామంటున్నారని మండిపడ్డారు. బీహార్‌లో రూ. వెయ్యి నిరుద్యోగ భృతి ఇస్తున్నారని, కాంగ్రెస్ తమ మ్యానిఫెస్టోలో పెట్టిన భృతి ఏంచేశారని ప్రశ్నించారు. నిరుద్యోగ జేఏసీ నేత జనార్దన్ మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రితోపాటు ఐదు పోస్టులు తన వద్దే పెట్టుకున్నారని, ఆ శాఖలపై కనీసం ఆయనకు అవగాహన ఉందా? అని ప్రశ్నించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల పేరుతో ఉన్న వాటిని నాశనం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.

నేను మళ్లీ పోటీ చేయను : కడియం

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబర్ 20: 'ఇవే నాకు చివరి ఎన్నికలు.. మళ్లీ పోటీ చేయనని గతంలో చెప్పాను.. మళ్లీ చెబుతున్నా' అని జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి స్పష్టంచేశారు. శనివారం ఆయన స్టేషన్‌ఘన్‌పూర్ రైతువేదికలో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కడియం మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అనేకసార్లు చెప్పాను.. మళ్లీ చెబుతున్నా.. ఇవే నా చివరి ఎన్నికలు.. నేను మళ్లీ పోటీ చేయనని పేర్కొన్నారు.

ఉద్యోగం రాలేదని యువతి ఆత్మహత్య

- బీటెక్ చదివినా సరైన ఉద్యోగం రాక మనస్తాపం
- కుటుంబానికి భారం కావొద్దని బలవన్మరణం




ప్రియాంక (ఫైల్)

గంభీరావుపేట, సెప్టెంబర్ 20: ఎంత ప్రయత్నించినా సరైన ఉద్యోగం రావడం లేదని తీవ్ర మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్య చేసుకున్నది. ఈ విషాదకర ఘటన రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం రాజుపేటలో శనివారం చోటుచేసుకున్నది. కుటుంబ సభ్యులు కథనం మేరకు.. రాజుపేటకు చెందిన రమేశ్ – కవిత దంపతులకు ముగ్గురు కూతుళ్లు కాగా, ప్రియాంక (24) మొదటి సంతానం. రమేశ్ తనకున్న మూడెకరాల్లో వ్యవసాయం చేసుకుంటుండగా, కవిత బీడీలు చుడుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. ప్రియాంక మూడేండ్ల కిందట హైదరాబాద్‌లో బీటెక్ పూర్తిచేసింది. ఇంజినీరింగ్ విద్య కోసం తండ్రి సుమారు రూ.6 లక్షల వరకు ఖర్చు చేశాడు. బీటెక్ పూర్తయిన తర్వాత తల్లిదండ్రులపై ఆధారపడొద్దనే ఉద్దేశంతో హైదరాబాద్‌లోనే ఏడాది పాటు చిన్న ఉద్యోగం చేసింది. జీతం సరిపోవడం లేదని మానేసి ఇంటికి వచ్చింది. అప్పటి నుంచి ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రాకపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన ప్రియాంక శనివారం ఇంట్లో ఉరేసుకున్నది. కుటుంబ సభ్యులు వచ్చి చూసే సరికి మృతిచెందింది. తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై అనిల్ తెలిపారు.

'ఫార్మా'పై మాట తప్పిన మంత్రులు

- నిషేధిత జాబితాలో నుంచి మా భూములను తొలగించాలి
- కలెక్టర్‌కు రైతుల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసి బయటకు వచ్చిన ఫార్మా బాధిత గ్రామాల రైతులు

రంగారెడ్డి, సెప్టెంబర్ 20 (నమస్తేతెలంగాణ) : ఫార్మా బాధిత గ్రామాల్లోని పట్టా భూములు కలిగిన రైతుల పేర్లను నిషేధిత జాబితాలో నుంచి తొలగించి ఆ భూములు వారికే ఇప్పిస్తామని మాట ఇచ్చిన మంత్రులు ఇప్పుడు మొహం చాటేస్తున్నారని ఫార్మా బాధిత గ్రామాల రైతులు ఆరోపించారు. ఈ మేరకు ఫార్మా వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ కవుల సరస్వతి, రైతులు శనివారం రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. కోర్టు కూడా నిషేధిత జాబితాలో నుంచి రైతుల పేర్లను తొలగించాలని ఆదేశించినందున, తమ భూములను ఆన్‌లైన్‌లో ఎక్కించి తమకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. యాచారం మండలం మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో సుమారు 900 మంది రైతులకు 2,211 ఎకరాల పట్టా భూములున్నాయి. ఫార్మాసిటీకి సేకరించిన భూములకు ఈ భూములు అనుబంధంగా ఉండటంతో వీటిని కూడా తీసుకుంటామని గతంలో ప్రభుత్వం ప్రకటించింది. కానీ రైతులు అంగీకరించలేదు. దీంతో రైతులకు తెలియకుండానే ఈ భూములకు సంబంధించి పరిహారాన్ని అథారిటీలో జమచేశారని, ఈ విషయం తెలియటంతో తాము కోర్టును ఆశ్రయించినట్టు రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అప్పటి ఆర్డీవో పొరపాటున ఈ భూములను నిషేధిత జాబితాలో చేర్చారని, తిరిగి ఈ భూములను రైతుల పేర్ల మీద ఆన్‌లైన్‌లో ఎక్కిస్తామని హైకోర్టుకు అఫిడవిట్ ఇచ్చారని తెలిపారు. ఆ కాపీని కూడా రైతులు కలెక్టర్‌కు అందజేశారు.

కరెంటు షాక్‌తో రైతు మృతి

మేడిపల్లి, సెప్టెంబర్ 20: కోతుల బెదద నుంచి పంటను కాపాడేందుకు విద్యుత్ తీగలు అమర్చి.. వాటికి తాకి రైతు బలైనట ఘటన జగిత్యాల జిల్లాలో చోటుచేసుకున్నది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి వివరాలిలా ప్రకారం.. భీమారం మండలం పసునూరుకు చెందిన మాలోతు సత్యనాయక్ (51) శనివారం వేకువజామున తన పంట పొలానికి వెళ్లాడు. అంతకు ముందే అక్కడ కోతుల బెదద కోసం తాను అమర్చిన విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య భూమిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

• మంచి నీటికోసం రోడ్డెక్కిన మహిళలు



మంచి నీటి కోసం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలంలోని మహాజన్‌గూడ, సీఆర్ కాలనీ గ్రామాలకు చెందిన మహిళలు శనివారం వంజిరిలోని పోలీస్‌స్టేషన్ ఎదుట ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో ధర్నా చేశారు. - కాగజ్‌నగర్

• పింఛన్ల పెంపు కోసం ఆందోళన



ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు పింఛన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి మండలం భిక్‌నూర్ లబ్ధిదారులు శనివారం గ్రామ పంచాయతీని ముట్టడించారు. - ఎల్లారెడ్డి రూరల్

20మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు

నిమ్స్‌లో విజయవంతంగా పీడియాట్రిక్ గుండె శస్త్రచికిత్సలు



శస్త్రచికిత్సలు జరిగిన పిల్లలతో డైరెక్టర్ డాక్టర్ బీరప్ప, బ్రిటన్ వైద్యుల బృందం

ఖైరతాబాద్, సెప్టెంబర్ 20: నిమ్స్ దవాఖాన 20మంది చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపింది. నిమ్స్ దవాఖాన కార్డియోథోరాసిక్, వ్యాస్కులర్ విభాగం, యూకే వైద్యుల బృందం సంయుక్తాధ్వర్యంలో ఈనెల 15నుంచి 19వరకు చిన్నారులకు ఉచిత గుండె శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. ఈ మేరకు శనివారం బ్రిటన్ వైద్య బృందంతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప వివరాలు వెల్లడించారు. నాలుగేండ్లుగా కార్డియోథోరాసిక్, వ్యాస్కులర్ విభాగాధిపతి డాక్టర్ ఎం అమరేశ్‌రావు, యూకేకు చెందిన ప్రముఖ పీడియాట్రిక్ కార్డియాక్ సర్జన్ డాక్టర్ డీ రమణ నేతృత్వంలో బ్రిటన్‌కు చెందిన వైద్యుల బృందంతో ఈ శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. కార్పొరేట్ దవాఖానల్లో సుమారు రూ.6లక్షల నుంచి రూ.7లక్షల వరకు ఖర్చువుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ వైద్య సేవలు ఆరోగ్యశ్రీ, సీఎంఆర్ఎఫ్‌లతో నిమ్స్‌లో పూర్తిగా ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. డాక్టర్ అమరేశ్‌రావు మాట్లాడుతూ.. కరోనా సమయంలో ఎక్మో చికిత్సకు ప్రైవేట్ దవాఖానలో భారీ డిమాండ్ ఉండేదని, కొందరు ఈ చికిత్స కోసం రూ.7 కోట్ల నుంచి రూ.8కోట్ల వరకు ఖర్చు చేసుకున్నారని, ప్రస్తుతం ఈ చికిత్స నిమ్స్ దవాఖానలో ఆరోగ్యశ్రీతో ఉచితంగా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. డాక్టర్ రమణ మాట్లాడుతూ.. నిమ్స్ దవాఖానలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

7వ రోజుకు చేరిన అశోక్ దీక్ష

వనస్థలిపురం, సెప్టెంబర్ 20 : అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 2లక్షల ఉద్యోగాలు భర్తీచేస్తామని నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించింది. దీంతో తెలంగాణ నిరుద్యోగుల హక్కుల వేదిక అధ్యక్షుడు పాలకూరి అశోక్‌కుమార్.. రేవంత్‌రెడ్డి సర్కార్ నిరుద్యోగులకు ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేస్తూ ఆమరణ దీక్ష చేపట్టాడు. ఈ దీక్ష శనివారం ఏడో రోజుకు చేరింది. చైతన్యపురిలోని తన నివాసంలో చేపట్టిన దీక్షను పోలీసులు అడ్డుకొని అశోక్‌కుమార్‌ను వనస్థలిపురం ఏరియా దవాఖానకు తరలించారు. అయినప్పటికీ ఏ మాత్రం నెరవకుండా అశోక్ దవాఖానలో దీక్షను కొనసాగిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి నిరుద్యోగులను మోసం చేసిందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం దిగివచ్చి తక్షణమే 50వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు దీక్ష విరమించేది లేదని తేల్చిచెప్పారు.

మారిన రక్తం.. పరిస్థితి విషమం

- ఓ పాజిటివ్‌కు బదులు బీ పాజిటివ్ రక్తం ఎక్కించిన సిబ్బంది
- తప్పు తమదికాదంటున్న ఎంజీఎం సూపరింటెండెంట్

వరంగల్ చౌరస్తా, సెప్టెంబర్ 20 : కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడినట్లుంది ఎంజీఎం దవాఖానలో రోగుల పరిస్థితి. రోగికి అవసరమైన రక్తాన్ని కాకుండా ఇతర గ్రూపు రక్తాన్ని ఎక్కించడంతో రోగి ప్రాణాపాయస్థితికి చేరుకున్న ఘటన శనివారం వరంగల్ ఎంజీఎం దవాఖానలో జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం అయోధ్యపురం ప్రాంతానికి చెందిన ఇలా సాగరం జ్యోతి (34) ఈనెల 16న తీవ్ర జ్వరం, శ్వాస సంబంధిత సమస్యలతో ఎంజీఎం దవాఖానలో చేరింది. పరీక్షించిన వైద్యులు రక్తం తక్కువగా ఉందని, నమూనాలు సేకరించి బ్లడ్ బ్యాంకుకు పంపగా బీ పాజిటివ్‌గా నిర్ధారించారు. కేస్ షీట్‌తో పాటు రిక్వేషన్ పత్రంపై ముద్రలు వేసి పంపించారు. నిబంధనల ప్రకారం వైద్యులు వెళ్లి బ్లడ్ బ్యాంకు నుంచి సేకరించిన బ్లడ్ ప్యాకెట్‌ను బాధితురాలికి ఎక్కించారు. అప్పటికే బాధితురాలు తనది ఓ పాజిటివ్ అని తెలియజేసినా సిబ్బంది పట్టించుకోకుండా నమూనాలు సేకరించిన తర్వాత బీ పాజిటివ్‌గా గుర్తించామని బుకాయిస్తూ రక్తం ఎక్కించారు. మరుసటి రోజు (18వతేదీ)న సైతం మరో బీ పాజిటివ్ బ్లడ్ గ్రూపు ప్యాకెట్‌ను ఎక్కించా రు. దీంతో బాధితురాలికి వాంతులు, విరోచనాలు, ఒంటిపై దద్దుర్లు కనిపించడంతో బాధితురాలి కుటుంబసభ్యులు వైద్యులకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే స్పందించిన వైద్యులు తిరిగి నమూనాలు సేకరించి, పరీక్షలు నిర్వహించగా బాధితురాలిది ఓ పాజిటివ్‌గా తేలింది. విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పాటించే యత్నాలు చేస్తూ, అధికారులు వైద్యం ప్రారంభించారు. బాధితురాలు చెబుతున్నా పట్టించుకోకుండా వైద్యసిబ్బంది నిర్లక్ష్యం వహించడం, బ్లడ్‌బ్యాంకులో నమూనాలు పరీక్షించే సమయంలో నిర్లక్ష్యం చేయడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంజీఎం హాస్పిటల్ సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. రోగి శరీరంలో హార్మోన్ ఇన్ బ్యాలెన్స్ మూలంగా రక్తం మార్పు చెందే అవకాశం ఉందని, తమ తప్పేమి లేదని పేర్కొన్నారు. పూర్తిస్థాయి విచారణ జరిపి, వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఉద్యోగులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

హుజూరాబాద్ సర్కారు దవాఖానకు రోగం

- ఫ్రీజర్‌లోనే కుళ్లిన మృతదేహం

హుజూరాబాద్, సెప్టెంబర్ 20: ప్రభుత్వ దవాఖానలకు నిర్లక్ష్యపు రోగం పట్టుకున్నది. ప్రభుత్వ పట్టింపులేమితో సిబ్బంది అలసత్వం పెరిగిపోయింది. ఫ్రీజర్ పనిచేయక మార్చురీలోనే మృతదేహం కుళ్లిపోయిన ఘటన కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ ప్రభుత్వ దవాఖానలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. శుక్రవారం శంకరపట్నం మండలం కొత్తగట్టులో లారీ డ్రైవర్ కుల్దీప్‌సింగ్ గుండెపోటుతో మృతి చెందాడు. మృతదేహాన్ని పోలీసులు ప్రభుత్వ దవాఖానకు తరలించి మార్చురీలోని ఫ్రీజర్‌లో భద్రపరిచారు. శనివారం కుల్దీప్‌సింగ్ బంధువులు రాగా, మృతదేహం కుళ్లిపోయి కంపు కొట్టింది. దీంతో బంధువులు దవాఖాన సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫ్రీజర్ టెంపరేచర్ పని చేస్తున్నట్టు చూపిస్తున్నదని సూపరింటెండెంట్ నారాయణరెడ్డి పేర్కొన్నారు.

ఆర్మూర్ పసుపు భౌగోళిక గుర్తింపునకు దరఖాస్తు

- హార్టికల్చరల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సైదయ్య

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఆర్మూర్ పసుపునకు భౌగోళిక గుర్తింపు కోసం దరఖాస్తు చేసినట్టు తెలంగాణ హార్టికల్చరల్ వర్సిటీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పిడిగెం సైదయ్య తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రత్యేక బృందం ఆర్మూర్‌లో పర్యటించి పసుపు పంటను సందర్శించింది. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. చెన్నైలో ఆర్మూర్ పసుపు జీఐ రిజిస్ట్రీకి దరఖాస్తు చేయగా.. శుక్రవారం సాంకేతికంగా రిజిస్ట్రీకి ఆమోదించినట్టు వెల్లడించారు. ఆవిర్భావ మూలం, రకాల లక్షణాలు, జీవ రసాయన ప్రొఫైలింగ్, రైతుల పద్ధతులు, డీఎన్ఏ ట్యాగింగ్ ఆర్మూర్ పసుపు రకం ప్రత్యేకత అని ఆయన చెప్పారు. యూపీ వారణాసిలో హ్యూమన్ వెల్ఫేర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీగా ఉన్న పద్మశ్రీ డాక్టర్ రజనీకాంత్, రైతుల తరఫున జీఐ టెక్నికల్ ఫెసిలిటేటర్‌గా వ్యవహరించినట్టు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ హార్టికల్చరల్ వర్సిటీ వీసీ డాక్టర్ దండ రాజిరెడ్డి మాట్లాడుతూ.. భౌగోళిక సూచిక(జీఐ) రిజిస్ట్రేషన్ ఆర్మూర్ పసుపును పండించే రైతులకు గేమ్‌చేంజర్ కానున్నట్టు తెలిపారు. ప్రీమియం ధర, మార్కెట్, ఎగుమతి సామర్థ్యం వంటి ఆర్థిక, మార్కెట్ ప్రయోజనాలు జీఐ ట్యాగ్‌తో ముడిపడి ఉన్నట్టు స్పష్టంచేశారు. రాష్ట్రంలో మరో 15 పంటలను పరిశీలించిన తర్వాత.. వాటికి జీఐ ట్యాగ్ కోసం దరఖాస్తు చేస్తామని వెల్లడించారు. జీఐ ట్యాగ్‌తో అంతర్జాతీయ గుర్తింపు, ఎగుమతి అవకాశాలు పెరుగుతాయని అందుకే ఈ ప్రాజెక్టుకు ఆర్థికంగా మద్దతు ఇచ్చినట్టు నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ కే ఉదయభాస్కర్ వెల్లడించారు.

4 | నమస్తే తెలంగాణ
హైదరాబాద్
ఆదివారం 21 సెప్టెంబర్ 2025
www.ntnews.com

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

బాపూ కేసీఆర్.. మళ్లీ నువ్వే రావాలి!

ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలకు ఒకసారి వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, కొన్ని ప్రభుత్వాల పనితీరు ప్రజల గుండెల్లో నిలిచిపోతుంది. దానికి కారణం ఆ ప్రభుత్వాన్ని నడిపే నాయకుని ప్రతిభ. నాయకునికి పేదల మీద ప్రేమ, తన ప్రజలు సంతోషంగా ఉండాలనే తపన ఉండాలి. ఇలాంటి లక్షణాలు కలిగిన వ్యక్తి కేసీఆర్.

సమాజంలో అందరికంటే దీనంగా జీవిస్తున్నవారు దివ్యాంగులు. కన్నపిల్లలు పట్టించుకోక ఆలనాపాలన లేక ఇబ్బందులు పడుతున్నవారు వృద్ధులు. భర్త చనిపోయి ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నవారు ఒంటరి మహిళలు. ఇలాంటి అభాగ్యులు ఆత్మగౌరవంతో జీవించాలనే ఉద్దేశంతో కేసీఆర్ 'ఆసరా' పింఛను పథకాన్ని ప్రారంభించారు.




దుర్గం వెంకన్న

2014కు ముందు కాంగ్రెస్ హయాంలో వృద్ధులకు, దివ్యాంగులకు 200 రూపాయలు పింఛన్ ఇచ్చేవారు. దివ్యాంగులు ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో దాన్ని రూ.500కి పెంచారు. ఈ అరకొర పింఛన్‌తో నానా అవస్థలు పడేవారు. తెలంగాణ ఉద్యమ సమయంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పడుతున్న బాధలు, కష్టాలను కేసీఆర్ స్వయంగా చూశారు. 2014లో కేసీఆర్ ముఖ్యమంత్రి అయ్యాక వెంటనే వీరి బాధలను దూరం చేయడానికి రూ.200 ఉన్న వృద్ధుల పింఛన్‌ను 1000 రూపాయలకు పెంచారు. రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.1500 చేశారు.

తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రం. కేసీఆర్ నూతన ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఆంధ్ర పాలకుల వల్ల సమస్యల నిలయంగా తెలంగాణ మారింది. ఆ సమస్యలను పరిష్కరించి రాష్ర్టాన్ని అభివృద్ధి చేయాల్సిన బాధ్యత కేసీఆర్ మీద పడింది. అలాంటి పరిస్థితుల్లోనూ ఒకవైపు రాష్ర్టాన్ని అభివృద్ధి చేస్తూనే నిర్భాగ్యులకు పింఛన్లు పెంచి ఆదుకున్న మహనీయుడు కేసీఆర్.

2018 ఎన్నికల తర్వాత వృద్ధుల పింఛన్‌ను రూ.1000 నుంచి రూ.2016కు పెంచారు. దివ్యాంగుల పింఛన్‌ను రూ.1500 నుంచి రూ.3015కి పెంచారు. ఇంతటితో ఆగకుండా చదువుకునే దివ్యాంగులకు ఈ పింఛన్ ఎటూ సరిపోదనే ఉద్దేశంతో ఎవ్వరూ అడగకపోయినా, 2023 జూన్ 9న మంచిర్యాలలో జరిగిన సభలో దివ్యాంగుల పింఛన్‌ను రూ.4016కి పెంచుతున్నట్టు ప్రకటించారు. పెరిగిన పింఛన్‌ను 2023 జూలై నుంచే అమలు చేసిన గొప్ప మనసున్న నేత కేసీఆర్. కేసీఆర్ ప్రభుత్వంలో దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎయిడ్స్ బాధితులు, బీడీ కార్మికులు.. ఇలా చెప్పుకొంటూపోతే తెలంగాణలోని నిస్సహాయులందరూ కేసీఆర్ ఉన్నారనే ధైర్యంతో గుండె మీద చెయ్యివేసుకొని సంతోషంగా ఉన్నారు. కానీ, ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కారణం కేసీఆర్ మీద అక్కసుతో ఎలాగైనా ఓడించి అధికారం చేజిక్కించుకోవాలని ఎన్నికల ముందు అసత్య ఆరోపణలు చేస్తూ, అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యి.. ఒకటి, రెండు హామీలను అమలుచేసి వాటిని గొప్పగా చెప్పుకొంటూ ఆసరా పింఛన్‌దారుల సమస్యలను పక్కనపెట్టారు.

రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అయ్యాక 1200 మంది దివ్యాంగులు కొత్తగా పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కొత్త ఫించన్ల సంగతి దేవుడెరుగు.. ఉన్న ఫించన్లను ఊడగొట్టే పనిలో పడ్డారు. చిన్న చిన్న లోపాలున్న పేద వ్యక్తులకు సైతం కేసీఆర్ పింఛన్లు ఇచ్చారు. పారదర్శకంగా పింఛన్లు ఇస్తామనే పేరుతో వాటిని తొలగించే పనిలో రేవంత్‌రెడ్డి నిమగ్నమయ్యారు. నిస్సహాయ నిరుపేదలకు ప్రభుత్వం ఆసరాగా ఉండాలని; సర్కారుకు, పింఛన్‌దారులకు మధ్య దళారులు లేకుండా కొంత పింఛన్లను ఇస్తూనే పింఛన్‌దారుల వయోపరిమితిని కేసీఆర్ 65 నుంచి 57కి తగ్గించారు. దీని వలన ఎంతో మందికి ఆసరా అంది ఆత్మగౌరవంతో జీవించారు. ఇప్పుడు కొత్తగా పింఛన్ రావాలంటే దళారుల చేతులు తడపాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొత్త పింఛన్లు ఇవ్వకుండా, ఉన్న పింఛన్లను తొలగిస్తూ, వచ్చే పింఛన్లను నెల ముగుస్తున్నా ఇవ్వడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రతి నెల ఆలస్యమవుతున్నది. దీంతో ఆసరాపై ఆధారపడే వృద్ధులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులకు ఎదురుచూపులు తప్పటం లేదు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతినెలా మొదటి తారీఖున పింఛన్లు ఇస్తామని, ఆసరా పింఛన్లను రెట్టింపు చేస్తామని 2023 శాసనసభ ఎన్నికల సందర్భంగా పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హామీలు గుప్పించారు. ఇప్పుడు 22 నెలలు కావొస్తున్నా వాటిని అమలు చేయడం లేదు. పింఛన్ పెరుగుతుందని నమ్మిన లబ్ధిదారులు మోసపోయారు.



కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టో–పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి దివ్యాంగులకు ఇచ్చిన హామీలు:

1. **2016 వికలాంగుల హక్కుల చట్టం తెలంగాణలో పూర్తిస్థాయిలో అమలయ్యేలా చూస్తాం.**
2. **దివ్యాంగుల నెలవారీ పింఛన్‌ను రూ.6000కు పెంచుతాం.**
3. **ప్రభుత్వ శాఖల్లో రిజర్వేషన్ పాలసీని పటిష్ఠంగా అమలుపరచడంతో పాటు, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేస్తాం.**
4. **దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం కల్పిస్తాం.**

ఇందులో ఏ ఒక్క హామీని రేవంత్‌రెడ్డి అమలు చేయలేదు. అబద్ధాలతో గద్దెనెక్కి రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న రేవంత్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా కొనసాగే నైతిక హక్కు లేదు. పేదల కన్నీరు, విధివంచితుల అవస్థలు అర్థం కావాలంటే స్పందించే గుణం ఉండాలి. కేసీఆర్‌లో స్పందించే గుణం కొంచెం ఎక్కువే. ఈ రోజు తెలంగాణలోని ప్రతి దివ్యాంగుడు ధైర్యంగా, ఆత్మగౌరవంతో జీవిస్తున్నారంటే కారణం కేసీఆర్. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు త్రీవీలర్ వెహికిల్ రావాలంటే కత్తిమీద సాములాగ ఉండేది. ఒక దివ్యాంగుడు వెహికిల్ కోసం కార్పొరేషన్ చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరిగి తిరిగి నానా అవస్థలు పడేవారు. అయినా జిల్లాకు ఒకటి రెండు ఇచ్చేవారు. ఆ వచ్చిన వాటిని 50 శాతం సబ్సిడీ కింద ఇచ్చేవారు. రుణం కట్టాలని బ్యాంకులు దివ్యాంగులను వేధించేవి. కానీ, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 100 శాతం రాయితీతో ఉచితంగా టీవీఎస్ స్కూటీని దివ్యాంగులకు అనుకూలంగా తయారు చేసి ఇచ్చారు. చదువుకునే దివ్యాంగులు ఒకరి మీద ఆధారపడకుండా కాలేజీకి సొంతంగా వెళ్తున్నారు. బధిర వ్యక్తులకు ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు ఇచ్చారు. దీంతో ఒకరి సహాయం లేకుండా తమ పని తాము చేసుకుంటున్నారు. కేసీఆర్ పాలనలో తెలంగాణలో వెహికిల్ లేని దివ్యాంగుడు, ల్యాప్‌టాప్ లేని బధిరులు లేరంటే అతిశయోక్తి కాదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఏ ఒక్క దివ్యాంగునికి లబ్ధి చేకూరిన దాఖలాలు లేవు.

కేసీఆర్ హయాంలో దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు ఎన్నడూ ధర్నాలు, ఆందోళనలు చేయలేదు. కానీ, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక వీరందరూ రోడ్ల మీదకు వచ్చి ధర్నాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. 65 లక్షల పింఛన్‌దారుల ఓట్లతో గద్దెనెక్కిన రేవంత్ రెడ్డి నమ్మించి మోసం చేశారు. మా నోటికాడ కూడు లాక్కున్నారని పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. అందుకే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తాడోపేడో తేల్చుకుంటామంటున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణలోని ప్రతి దివ్యాంగుని గుండె 'బాపు కేసీఆర్ మళ్లీ నువ్వే రావాలి' అని అంటున్నది.

(వ్యాసకర్త: రీసెర్చ్ స్కాలర్, ఓయూ)

ఆరోగ్య సంక్షోభం

ప్రజా సంక్షేమ రాజ్యానికి ఆరోగ్యం వెన్నెముక వంటిది. తెలంగాణలో ఆరోగ్యశ్రీ పథకం పేదలకు ఉచిత, నాణ్యమైన వైద్యం అందించాలనే గొప్ప ఆశయంతో మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రైవేట్ ఆసుపత్రులు ఈ పథకానికి జీవనాడి లాంటివి. కానీ, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ (ఆర్‌ఏహెచ్‌సీటీ) నుంచి నెలల తరబడి బకాయిలు చెల్లించకపోవడంతో దవాఖానలపై ఆర్థిక భారం విపరీతంగాపెరిగిపోయింది.



డాక్టర్ బీఎన్ రావు

తెలంగాణలోని 360కి పైగా ప్రైవేట్ ఆసుపత్రులకు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ (టీఎన్‌హెచ్‌ఏ) ప్రకారం.. ఆసుపత్రులకు రావాల్సిన బకాయిలు రూ.1,300–1,400 కోట్లు. ఈ బకాయిలు ఆసుపత్రులను ఆర్థికంగా కుంగదీస్తున్నాయి. హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆసుపత్రులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉండవు. ఒకవేళ ఉన్నా అవి తట్టుకోగలవు. కానీ, జిల్లా కేంద్రాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని చిన్న, మధ్యస్థాయి ఆసుపత్రులు (100–200 పడకల సామర్థ్యం) ఇప్పుడు మనుగడ కోసం పోరాడుతున్నాయి. ఇలాంటి చిన్నచిన్న దవాఖానలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాయి. సిబ్బందికి సకాలంలో జీతాలు ఇవ్వలేక, మందులు, వైద్య సామాగ్రి సరఫరాదారులకు చెల్లింపులు చేయలేక సతమతమవుతున్నాయి. ఇంకా చెప్పాలంటే కనీసం అత్యవసర సేవలను కూడా నిర్వహించలేని దుస్థితి నెలకొన్నది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆసుపత్రులు ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయడం లేదా రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగడం ఖాయం. అదే జరిగితే లక్షలాది మంది పేద రోగుల ప్రాణాలు ప్రమాదంలో పడతాయి. ఈ ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ బిల్లుల విషయంలో సమస్య రావడం ఇదే మొదటిసారి కాదు. ఈ ఏడాది జనవరిలో కూడా ప్రైవేట్ ఆసుపత్రులు 10 రోజుల పాటు సమ్మె చేశాయి. నాడు ఆరోగ్యశాఖ ఇచ్చిన హామీలతో సమ్మె విరమణ జరిగింది. అయితే, ఏడు నెలలైనా ఏ ఒక్క హామీ కూడా నెరవేరలేదని టీఏఎన్‌హెచ్‌ఏ నాయకులు చెప్తున్నారు. ఆరోగ్యశ్రీ చికిత్సల్లో 75 శాతం అందించేది జిల్లా ఆసుపత్రులే. అయినా వాటికి పెద్ద పెద్ద ఆసుపత్రుల కంటే తక్కువ నిధులు అందుతున్నాయి. ఈ నేపథ్యంలో నిధుల పంపిణీలో న్యాయం జరగాలని, పెరుగుతున్న లబ్ధిదారుల సంఖ్యకు అనుగుణంగా బడ్జెట్ పెంచాలని, సకాలంలో బకాయిలు చెల్లించాలని ఆసుపత్రులు డిమాండ్ చేస్తున్నాయి. ఇప్పటికైనా సర్కారు తన ప్రాధాన్యాలను గుర్తించాలి. బకాయిలను వెంటనే విడుదల చేయాలి. పెరుగుతున్న ఖర్చులకు అనుగుణంగా చికిత్స ప్యాకేజీలను సవరించాలి.

పరిపాలనాపరమైన ఆలస్యాలకు లేదా రాజకీయ ప్రాధాన్యతలకు ప్రజల ఆరోగ్యాన్ని బలి చేయకూడదు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోకపోతే, ప్రైవేట్ ఆసుపత్రులు కుప్పకూలడమే కాదు, లక్షలాది పేద కుటుంబాల ప్రాణాలను రక్షించే వైద్య సేవలను కోల్పోవాల్సిన దుస్థితి తలెత్తుతుంది. ఆరోగ్యశ్రీ పథకం ఆరోగ్య సంరక్షణలో సమానత్వం కోసం పుట్టింది. ఇప్పుడు ఆ కల ఆర్థిక నిర్లక్ష్యమనే భారం కింద నిర్వీర్యమవుతున్నది. తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కోవాలి. ఎందుకంటే ఆలస్యమయ్యే కొద్దీ మరొక రోగికి చికిత్స అందకుండా పోతుంది. మరో కుటుంబం అప్పుల్లో మునిగిపోతుంది.

(వ్యాసకర్త: మాజీ అధ్యక్షుడు, ఇండియన్ మెడికల్ అసోసియేషన్- తెలంగాణ)



బతుకమ్మ పాటలపై పిచ్చి ప్రేలాపనలు!



మైత్రేయ కొడకండ్ల

కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను, నెరవేర్చని హామీలను, అసమర్థ పాలనను ఎత్తిచూపుతూ బతుకమ్మ పండుగ సందర్భంగా బీఆర్‌ఎస్ పార్టీ కొన్ని పాటలను విడుదల చేసింది. అయితే ఆ పాటలు బతుకమ్మ పండుగనే అవమానపరిచే విధంగా ఉన్నాయని బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కొందరు పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నారు.

ప్రజా పోరాటాలకు, పండుగలకు అవినాభావ సంబంధం ఉంది. భారత స్వాతంత్ర్య ఉద్యమం నుంచి మొదలుకొని తెలంగాణ ఉద్యమం వరకు పండుగలను పోరాట రూపాలుగా మలిచిన చరిత్ర మనకుంది. ప్రపంచవ్యాప్తంగా సామాజికంగా, రాజకీయంగా జనాలను సమీకరించడానికి, తద్వారా ఉద్యమాలను, పోరాటాలను మరింత ఉధృతం చేయడానికి పండుగలను, వేడుకలను ఉపయోగించిన సందర్భాలు కోకొల్లలు. బాల గంగాధర్ తిలక్ మొదలుపెట్టిన సార్వజనిక్ గణేష్ ఉత్సవాలు, తెలంగాణలో బతుకమ్మ పండుగ, ఐర్లాండ్‌లో సెయింట్ ప్యాట్రిక్స్ డే వంటివి కొన్ని ఉదాహరణలు. ముఖ్యంగా ప్రజాకంటక పాలన ఉన్నప్పుడు, అణచివేత అధికమైనప్పుడు ప్రజలు తమ నిరసన తెలియజేయడానికి, పరోక్షంగా రాజకీయ భావవ్యక్తీకరణ కోసం పండుగలను, పాటలను వాడటం సర్వసాధారణంగా జరిగేదే. సాంస్కృతిక పునరుజ్జీవానికి, అసమ్మతిని వ్యక్తపర్చడానికి పండుగలను ఒక ఆయుధంగా మలుచుకోవడం అనాదిగా వస్తున్నది.ఇక బతుకమ్మ పండుగ విషయానికొస్తే.. తెలంగాణ ఉద్యమంలో ధిక్కారానికి ప్రతిరూపంగా బతుకమ్మ నిలిచింది. ట్యాంక్‌బండ్ మీద బతుకమ్మ ఆడటాన్ని సమైక్య పాలకులు అడ్డుకుంటే, హైకోర్టు అనుమతితో వేలమంది తెలంగాణ ఆడపడుచులు బతుకమ్మ ఆడిన సన్నివేశం ఇంకా మన కండ్లముందే ఉంది. పాలక పక్షాన్ని ప్రశ్నించడానికి, ప్రజలు తమ నిరసనను తెలియజేయడానికి బతుకమ్మ పాటల బాణీలో పాటలు అల్లి, ఆడి, పాడటం నిజాం కాలం నుంచి జరుగుతున్నదే.

అంతెందుకు.. బీఆర్‌ఎస్ పార్టీ అధికారంలో ఉన్నపుడు కూడా బీఆర్‌ఎస్ పాలనపై దుష్ప్రచారం చేయడానికి కాంగ్రెస్, బీజేపీలు బతుకమ్మ పాటలను అల్లాయి. కానీ, ఈసారి కాంగ్రెస్ విఫల పాలన మీద బతుకమ్మ పాటల బాణీలో బీఆర్‌ఎస్ పార్టీ కొన్ని పాటలను రూపొందించే సరికి, ముఖ్యంగా బీజేపీ మద్దతుదారులు వితండవాదం చేస్తున్నారు. ఇది కేవలం వారి అవగాహనాలేమికి నిదర్శనం. తమ కష్టనష్టాలను తెలియజెప్పే విధంగా బతుకమ్మ పాటల బాణీలో పాటలు పాడటం తెలంగాణ గ్రామీణ జీవనశైలిలో ఒక భాగం. కేవలం తమ వైఫల్యాల నుంచి జనాల దృష్టిని మరల్చడానికే.. రేవంత్ పాలనలో ప్రజల కష్టాలను ప్రస్తావిస్తూ బీఆర్‌ఎస్ పార్టీ తయారుచేసిన బతుకమ్మ పాటలకు కాంగ్రెస్, బీజేపీలు దురుద్దేశాలు ఆపాదిస్తున్నాయి. అయినా తెలంగాణ తల్లి రూపం నుంచి బతుకమ్మనే మాయం చేసిన కాంగ్రెస్ పార్టీకి గాని, వాళ్లకు వత్తాసు పలుకుతున్న బీజేపీకి గాని బతుకమ్మ గురించి మాట్లాడే నైతిక హక్కు లేనే లేదు.

ఆరనిదీ తీరొక్క పూలతడి

బతుకమ్మలో ఎన్ని రకాల పూవులు పేరుస్తామో అన్ని రకాల అనుభవాలు, ఆనందాలు ఆడవాళ్లకి. మారింది సమాజం, మారింది పరిస్థితులు అని లెక్కలు, కాగితాలు సర్వేలు ఏమేమో చెప్తారు కానీ చుట్టూ చూస్తే పరిస్థితి ఎప్పటిలాగానే ఉంది. అందుకే నేమో తెలంగాణలో బతుకమ్మ తల్లి వెలిసినట్టుగా గట్టిగా అనిపిస్తుంది నాకు.




బి.అనసూయ

ఒక నలభై, యాభై ఏండ్ల కిందటి వరకు బతుకమ్మ పండుగకు తల్లిగారింటికి పోని ఆడవాళ్లు ఉండరు. పెళ్లిదాకా ఎటూ ఉంటారు. పెండ్లి తర్వాత నుంచి మొదలుపెడితే పిల్లలకు పది పన్నెండేండ్లు వచ్చేవరకన్న తల్లిగారింటికే పోవడం, సంతోషంగా పుట్టింట్లో దోస్తులతో ముచ్చట్లు, పిల్లలకి తినిపించడాలు, జడలు వేయడాలు, స్నానాలు, కొత్త బట్టలు... వీలుంటే కొనడాలు లేకుంటే అత్తగారింట్లో కొన్న వాటిని అందరికీ ఎంతో ఆనందంతో చూపడం.. అబ్బో ఒక్క పని కాదు. పిల్లల చదువు కొంచెం పెరుగుతున్న కొద్దీ ఆమె తన ఇల్లు, పిల్లల చదువులు మొదలైన వాటితో ఊపిరి తీయలేనంత బిజీ అయిపోతుంది. ఇంకా అనేక సాదకబాధకాలు కూడా తోడవుతయి. తల్లిగారింటికి వెళ్లడం తగ్గిపోతుంది.

బతుకమ్మ తల్లిగారింట్లో ఐతే ఒకరకంగా అత్త గారింట్లో ఐతే ఇంకోరకంగా తప్పక ఉంటుంది అమ్మాయిలకి. ఎట్లా అంటారా? అత్తింటిలో ఎంత లేదన్న కొంచెం మనసు, ఒళ్ళు దగ్గరపెట్టుకొని చేసుడు, అమ్మ దగ్గర కొంచెం అటు ఇటు అయినా నడుస్తుంది. అమ్మ సర్దుకుపోతది. పైగా కొంచెం దోస్తులదగ్గరికి ఇంకా ఆ ఊళ్ళోనే చుట్టాలు ఉంటే పోయిరావడానికి అమ్మనే చొరవ తీసుకొని పో బిడ్డ పన్లు నేను చేసుకుంటా.. పిల్లల్ని కూడా చూసుకుంటా అంటది. బతుకమ్మ సాంప్రదాయం ప్రకారం కొందరు ఇప్పటికీ బొడ్డెమ్మ నుంచి బతుకమ్మలు మొత్తం జరుపుకునే వాళ్ళున్నారు. బతుకువేటలో తీరిక లేక కేవలం మొదటిది, చివరిది చేస్తున్నారు. సద్దుల బతుకమ్మ తోనే సరిపెట్టేవాళ్లున్నారు. సద్దుల బతుకమ్మ రోజు మాత్రం పల్లె పట్నం అని కాక తెలంగాణా అంతటా ఒక వంద పండుగల వైభోగం, సందడి. ఆ సంబురమే వేరు. గునుగు, తంగేడు, చామంతి, బంతి, కలువ, గన్నేరు, గులాబీ, మల్లెలు ఇట్ల దాదాపు ఎన్ని రకాల పూలు మనకి అందుబాటులో ఉంటాయో అన్నిటిని పేరుస్తూ ఆ మధ్యలో ఖాళీ అంతా గునుగు తంగేడు తరుగుతో నింపుతూ గట్టిగా ఇంకో కంచంతో ఒత్తుతూ చక్కటి అందమైన బతుకమ్మని పేర్చి దేవుడి గది దగ్గరే ఒక పీట వేసి పెడతారు. ఆ తర్వాత ఇంకో తోడు బతుకమ్మని పేరుస్తారు. పూజ చేసేటప్పుడు పసుపుతో గౌరమ్మను చేసి తమలపాకుల్లో చిన్న బతుకమ్మని పళ్లెంలో సర్దిపెడతారు. బతుకమ్మలకి పెట్టే అగరొత్తుల వాసన ఆ రోజంతా అందరి ఇళ్లల్లో ఒక అలౌకిక భావన తెప్పించి తీరుతుంది.

సాయంత్రం కలిగిన తీరుగా కొత్తవి.. లేకుంటే పెళ్లి నాటివి పట్టుచీరలు పెళ్లి అయినవాళ్ళు, పిల్లలు ఉన్న వాటిలో కొత్తవి కట్టుకుంటారు. ఉంటే బంగారు నగలు కూడా తప్పక వేసుకొని ఎవరింటిముందు వాళ్లు అలికి ముగ్గేసి రెండు బతుకమ్మలని పెట్టి ఒకటి రెండు చిన్న పాటలతో లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ ఆడిన తర్వాత దగ్గరలో ఉన్న గుడి లేదా కూడలి లాంటి చోట చీకటి పడేదాక ఆడతారు. అక్కడి నుంచి అందరూ పల్లెల్లో చక్కగా చెరువు లేదా కుంటలు లేదా కాలువల దగ్గరికి పోవడం అక్కడ ఎంపలీ చెట్టు కొమ్మలు బతుకమ్మల మధ్య పెట్టి ఒక రెండు చుట్లు తిరిగి అందరూ ఒకరికొకరు పసుపు కుంకుమలు పెట్టుకొంటరు. తర్వాత పోయిరావమ్మ మల్లొచ్చే ఏడుకు మళ్ళీ రావమ్మా అని నీళ్లల్లో ఆడిస్తూ మెల్లగా వదిలిపెడతారు.

సద్దుల బతుకమ్మ రోజు చేసే చింతపండు పులుసు చద్ది ఒక ప్రత్యేక రుచి అని చెప్పాలి. అదే కాకుండా ఇంకో నాలుగు రకాల చద్దులు, తియ్యటి గరిజెలు, శనగపప్పు బరకగా పట్టిన పిండితో చేసే వడలు అన్నీ బతుకమ్మ నిమజ్జనం చేసిన దగ్గరే ఒకరికొకరు సంతోషంగా పంచుకుని కలిసిమెలిసి తింటరు. ఎంతో సంబురాన్ని నింపుకొని మెల్లగా ముచ్చట్లతో ఇంటికి చేరుకుంటరు. బతుకమ్మ పండగ నిజంగా ఒక సంవత్సరానికి సరిపడా ఉత్సాహాన్ని ఇస్తుందని నా నమ్మకం. నాకు ఇప్పటికీ అదే అనుభూతి. బతుకమ్మ పండుగ సందర్భంగా ఇప్పటికీ తల్లిగారి ఇంటికి పోయే అవకాశమున్న ప్రతివాళ్లు తప్పక వెళ్లాలి. పల్లె అమాయకత్వం మారినా ఆ ప్రేమలు, బంధాలు, ఆప్యాయతలు ఇసుమంత కూడా చెక్కుచెదరలేదు ఇప్పటికీ. ఇండ్లల్లో సౌకర్యాలు కొత్తగా ఎన్నో వచ్చినా కూడా పల్లె సౌకుమార్యం అట్లనే పదిలంగా ఉంది. ఒకరికొకరు సహాయపడే తత్వం ఇంకా తడిగానే ఉంది.



నేపాల్‌లో అరాచక విప్లవంతో పార్లమెంటు, సుప్రీంకోర్టును తగులబెట్టి, పాలకులను సజీవంగా దహనం చేసిన తరువాత చాలామంది చిత్రమైన మేధావులు ఇండియాలో కూడా ఇలాంటి విప్లవం వస్తుందా? అనే చర్చలు సాగిస్తున్నారు. అధికారంలో ఉన్న రాజకీయ పక్షం అందరికీ నచ్చవచ్చు, నచ్చకపోవచ్చు. కానీ ఈ దేశంలో నేపాల్ తరహా విప్లవం ఎప్పటికీ రాదు. నేపాల్ అనేది మన దేశంలోని అనేక రాష్ట్రాల్లో ఒక రాష్ట్రం లాంటిది. ఒక రాష్ట్రంలో నేపాల్‌ను మించిన విధ్వంసం జరగవచ్చు.. కానీ ఇది సువిశాల భారతదేశం. ఇక్కడ ఏదో ఒక రాష్ట్రంలో అల్లర్లు చెలరేగినంత మాత్రాన దేశంలో నేపాల్ లాంటి విప్లవం వస్తుందని కలలు కంటే దేశం గురించి అవగాహన లేనట్టే. ఒకవైపు నేపాల్ తరహా విప్లవం గురించి చర్చలు జరుగుతున్న సమయంలోనే మావోయిస్టుల నుంచి ఆసక్తికరమైన ప్రకటన వచ్చింది.

విప్లవమా.. సాధ్యమా?



బుద్ధ మురళి



రెండుమూడు దశాబ్దాల క్రితం జర్నలిస్టులు నక్సల్ నాయకుడిని ఇంటర్వ్యూ చేసి వస్తే ఆ జర్నలిస్ట్‌కు హీరో ఇమేజ్ వచ్చేది. నక్సల్ నాయకుడి ఇంటర్వ్యూ మీడియాలో హైలైట్ అయ్యేది. అలాంటిది మావోయిజానికి ఆయుధం ఊపిరి లాంటిది. అలాంటి ఊపిరినే వదిలేస్తాం అని మావోయిస్టులు ప్రకటిస్తే మీడియాలో పెద్దచర్చలు లేవు. ఒకరోజు మామూలు వార్త తప్ప అంతకుమించి ప్రచారం లేదు. ఒకవేళ ఈ ప్రకటన మావోయిస్టుల పేరుతో ఎవరో విడుదల చేసిన తప్పుడు ప్రకటనా? అనే అనుమానం రావడం సహజం. అలా తప్పుడు ప్రకటన అయి ఉంటే అదేరోజు లేదా మరుసటి రోజు 'ఆ ప్రకటన మేం విడుదల చేయలేదు, తప్పుడు ప్రకటన' అని మావోయిస్టులు ఖండన విడుదల చేసేవారు.

సెప్టెంబర్ 17న ప్రకటన విడుదలైతే ఐదురోజులు గడిచినా వారి నుంచి ఖండన ప్రకటన రాలేదు. కాబట్టి అది మావోయిస్టుల ప్రకటన అనే నిర్ధారణకు రావచ్చు. ఆయుధ పోరాటాన్ని నిలిపివేసి, శాంతి చర్చలకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు అధికార ప్రతినిధి అభయ్ ప్రకటించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, లేదా వారి ప్రతినిధులతో చర్చలకు సిద్ధంగా ఉన్నట్టు మావోయిస్టులు ప్రకటించారు. దీనిపై కేంద్రం నుంచి ఎలాంటి స్పందన లేదు. ఈ ప్రకటనకు ముందే అమిత్ షా గతంలో దేశంలో నక్సల్స్ ప్రభావిత జిల్లాలు 12 ఉంటే ఇప్పుడు ఆరుకు పడిపోయాయని, 2026 మార్చి 31 నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా నిర్మూలించనున్నట్టు ప్రకటించారు. నక్సలిజం సంపూర్ణ నిర్మూలనకు కేంద్రం దూకుడుగా వ్యవహరిస్తుండటం తో కొంత ఊపిరి పీల్చుకొనే అవకాశం కోసం మావోయిస్టులు ఆయుధాలు వదిలి శాంతి చర్చలకు సిద్ధం అవుతున్నట్టు భావించవచ్చు. అయితే 'పూర్తిగా నిర్మూలించే అవకాశం చేతిలో ఉన్నప్పుడు చర్చలు ఎందుకు? సమస్యను శాశ్వతంగా లేకుండా చేసుకోవాలి' అనేది కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం కావచ్చు. అందుకే స్పందించడం లేదేమో. నేపాల్‌లో కూలిపోయిన ప్రభుత్వం అంతకు ముందు తీవ్రవాదాన్ని నమ్ముకొన్న నక్సలైట్లదే. ఓ రెండు మూడు దశాబ్దాల క్రితం ఆంధ్రప్రదేశ్ నేపాల్ కారిడార్, శ్రీలంక కారిడార్ అంటూ నక్సల్స్‌కు సంబంధించిన వార్తలు తెలుగు మీడియాలో సైతం తెగ కనిపించేవి. ఆంధ్రప్రదేశ్ – నేపాల్ మావోయిస్టుల మధ్య బంధం ఎంత బలంగా ఉండేదో కానీ తెలుగు మీడియాలో మాత్రం వీరి బంధంపై కథలుకథలుగా వార్తలు కనిపించేవి. నక్సల్స్ చేతికి అధికారం వస్తే ఎలా పాలిస్తారో నేపాల్ పాలకులు బాగా అర్థం అయ్యేట్టు చూపించారు.

ప్రజాస్వామ్యంలో ఎన్ని లోపాలు ఉన్నా ప్రజలకు తమ ఓటు ద్వారా పాలకులను శిక్షించే అవకాశం ఉంటుంది. మార్చే అవకాశం ఉంటుంది. ప్రజల అభిమానం పొంది అధికారంలోకి రావడం వేరు, ఆయుధం చేపట్టి భయపెట్టి అధికారం చెలాయించడం వేరు. నేపాల్‌లో నిరుద్యోగం, అవినీతి పెరిగిపోవడం, అదే సమయంలో పాలకుల పిల్లల విచ్చలవిడి జీవన విధానం నేపాల్ నవతరాన్ని విప్లవానికి ప్రేరేపించింది. మన దేశంలో అవినీతి లేదా? నాయకులు, వారి పిల్లలు విలాసవంతమైన జీవితం గడపటం నిజం కాదా? అంటే నేపాల్‌ను మించిన అవినీతి ఉండవచ్చు, నాయకులు, అధికారులు, వారి సంతానం అంతకుమించి అక్రమ సంపాదనతో విలాసవంతమైన జీవితం గడుపుతూ ఉండవచ్చు. అయినా ఇక్కడ విప్లవం రాదు. దేశంలోని మెజారిటీ ప్రజలు సంస్కరణలను స్వాగతిస్తారు. ఈ దేశం జీన్స్‌లోనే మార్పునకు, సంస్కరణలకు స్వాగతం పలికే తత్త్వం ఉంది.మార్పునకు స్వాగతం పలికే తత్త్వం, సంస్కరణలను స్వీకరించే తత్త్వం ఉన్న చోట విప్లవానికి అవకాశం లేదు. అత్యవసర పరిస్థితిని దేశమంతా వ్యతిరేకించి, శక్తివంతమైన నాయకురాలు ఇందిరాగాంధీని సైతం ఓడించారు. రెండేండ్లు గడిచిన తర్వాత అదే ఇందిరాగాంధీని అందల మెక్కించారు. నేపాల్, బంగ్లాదేశ్, పాకిస్థాన్, శ్రీలంక తరహాలో పాలకులను హత్య చేయడం, ఉరి తీయడం, పార్లమెంట్ భవనాన్ని తగులబెట్టడం ఇక్కడ ఊహించలేం. లోపాలుంటే ఉండవచ్చు, నిరక్షరాస్యత ఉండవచ్చు. కానీ మన దేశంలో ప్రజాస్వామ్యం ఎంతో కొంత పరిణతి చెందింది. పార్లమెంటు, సుప్రీంకోర్టు అంటే మనకు దేవాలయాలంత పవిత్రమైనవి.

మరోవైపు ఆర్థిక సంస్కరణల తర్వాత దేశంలోని యువతలో ఎక్కువగా కెరీర్ పట్ల ఆసక్తితో పెరిగింది. తెలంగాణలో ఒకప్పుడు తీవ్రవాద ప్రభావం ఎక్కువగా ఉండేది. ఆర్థిక సంస్కరణల తరువాత పూర్తిగా మారింది. గతంలో తెలంగాణలో ఏ గ్రామానికి వెళ్లినా తీవ్రవాదుల ప్రభావం కనిపించేది. ఇప్పుడు తెలంగాణలో ఏ మారుమూల గ్రామానికి వెళ్లినా అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో మంచి ఉద్యోగాల్లో ఉన్న యువత గురించి వింటున్నాం.

అంతేకాకుండా మన దేశంలోని ఒక రాష్ట్రం అంత ఉండే నేపాల్‌లో విప్లవం పేరుతో అరాచకం సాధ్యమైంది. కానీ, సువిశాల భారతదేశంలో సాధ్యం కాదు. మణిపూర్, పంజాబ్, కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో కొన్ని అరాచక సంఘటనలు జరగకపోలేదు. ఇలాంటి సంఘటనలు ఆ ఒక్క రాష్ట్రమే కాదు మొత్తం దేశం తన శక్తిని ఉపయోగించి అణచివేస్తుంది. అందువల్ల నేపాల్ విప్లవ ప్రభావం మీడియా వార్తల్లో తప్ప ప్రజల్లో పెద్దగా ఉండదు. ఇప్పుడు యువత అడవుల గురించి కాదు కెరీర్ గురించి ఆలోచిస్తోంది.

గట్టి సార్‌కు.. నేనెంత చెప్తే అంత!

ఫలానా అధికారికి పోస్టింగ్ నేనే ఇప్పించా
ఆ సీఎండీ పోస్టింగ్ కూడా మన చలవే
సార్‌తో కేరళకు వెళ్లొచ్చా.. ఇవిగో ఫొటోలు
నేనిప్పుడు.. సార్ వాళ్ల ఇంట్లోనే ఉన్నాను

- పోస్టింగ్ అయితే.. పనిని బట్టి లెక్క చూద్దాం
- విద్యుత్తుశాఖలో బడా బ్రోకర్
- కాంట్రాక్టర్లతో సెటిల్మెంట్‌లు
- తలలు పట్టుకుంటున్న అధికారులు



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : 'మన సార్‌కు నేనేంత చెప్తే అంత. కావాలంటే చూడండి.. నేను ఇవాళ సార్ వాళ్ల ఇంట్లోనే ఉన్నా. ఇదే నేనున్న లోకేషన్.. చూడండి. సార్‌తో ఇప్పుడే కేరళకు వెళ్లొచ్చాను. ఇవిగో ఫొటోలు చూడండి. ఫలానా ఐఏఎస్‌కు పోస్టింగ్ నేనే ఇప్పించా. ఫలానా సీఎండీని నేనే నియమించా' ఇవీ విద్యుత్తుశాఖలో రాచకార్యాలు చక్కబెడుతున్నట్టుగా ఓ బ్రోకర్ చెప్తున్న మాటలు. ఇవన్నీ వట్టి మాటలా.. గట్టి మాటలా.. ఎవరి తరపున మాటలు అనే విషయంపై సచివాలయంలో చర్చనీయాంశంగా మారింది. సదరు ప్రైవేట్ వ్యక్తి వ్యవహారం వివాదాస్పదంగా నిలుస్తున్నది. చూస్తూ ఊరుకుంటే పెద్దల అండతో అతడు రెచ్చిపోతున్నాడని, ఐఏఎస్ అధికారులకు ఫోన్ చేసి మరీ 'ఫలానా వివరాలు పంపించండి.. సార్ అర్జెంట్‌గా పంపమన్నారు' అని అంటున్నాడట. అసలేంటీ ఇతడి ఓవరాక్షన్ అంటూ కొందరు అధికారులు బహిరంగంగానే చర్చించుకుంటూ... తలలు పట్టుకుంటూ... అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు.

ఎవరీ పవర్‌ఫుల్ బ్రోకర్?

విద్యుత్తుశాఖలో తాను ఎంత చెప్తే అంత అనీ.. ఆర్థికశాఖ నుంచి బిల్లులు మంజూరు చేయిస్తాననీ.. సచివాలయంలో మెరుపువేగంతో, ఒక్క ఫోన్‌కాల్‌తో పనులు చక్కబెడుతున్న ఈ మెరుపుతీగ పవర్ చూసి.. ఉన్నతాధికారులు కూడా ఆశ్చర్యపోతున్నారని తెలుస్తున్నది. ఇంతకీ అతడు ఎవరా.. అని బ్యాక్‌గ్రౌండ్ ఆరా తీస్తున్నారని సమాచారం. ఈ నేపథ్యంలో కీలక విషయాలు బయటకు వస్తున్నాయట. సదరు బ్రోకర్ స్వస్థలం ఏపీలోని కడప జిల్లా అనీ.. ఇప్పుడు మంచి పొజిషన్‌లో ఉన్న నాయకుడికి ఏండ్ల నుంచి సన్నిహితుడనీ.. కొందరు చెప్తున్నారు. గతంలో సదరు నాయకుడి వ్యక్తిగత వ్యవహారాలు చూసేవాడట. ఇప్పుడు నాయకుడు మంచి స్థానంలో ఉండటంతో.. అతడి అండదండలతో తన 'పవర్' చూపిస్తున్నాడని సచివాలయవర్గాలు చెప్తున్నాయి. గట్టి నేతతో దిగిన ఫొటోలు చూపిస్తూ కొందరిని బెదిరిస్తున్నాడట. కొందరు అధికారులు, కాంట్రాక్టర్లు కూడా 'యవ్వారాలు' అన్నీ అతడితోనే మాట్లాతున్నారంట. కాంట్రాక్టులు ఇప్పించడం, బిల్లులు మంజూరు చేయించడమూ... గట్రా... అన్నీ పవర్‌ఫుల్ బ్రోకరే చూస్తున్నాడని విశ్వసనీయ సమాచారం.

ఇచ్చట బిల్లులు మంజూరు చేయించబడును!

సచివాలయంలో సదరు బ్రోకర్ ఓ నాయకుడి తరపున అన్ని వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా.. కాంట్రాక్టర్లతో పర్సంటేజీలు మాట్లాడుకుని సెటిల్‌మెంట్లు చేస్తున్నాడట. కాంట్రాక్టర్లకు ఫోన్లు చేసి.. 'ఏదైనా బిల్లు పాస్ కావాలంటే నా దగ్గరకు రండి' అంటున్నాడట. ఎవరైనా కాంట్రాక్టర్లు వస్తే.. రెండు, మూడు సార్లు తిప్పించుకున్న తర్వాత 'పైనోళ్లకు 15శాతం.. నా వాటా వేరే' అంటూ అంటూ బేరం పెడుతున్నాడట. 'మీతో పాటు ఇంకా ఎవరైనా నమ్మదగిన కాంట్రాక్టర్లు ఎవరైనా తీసుకురండి. బిల్లులు పాస్ చేయించేద్దాం.. నాదీ బాధ్యత. అలాగే ఇంజినీర్ల పోస్టింగ్స్ కూడా ఉంటే చెప్పండి. పోస్టులను బట్టి లెక్క చూసుకుందాం' అంటూ దందాకు తెరలేపాడట. కొందరు పెద్దల అండదండలతోనే ఆ వ్యక్తి రెచ్చిపోతున్నాడని తెలుస్తున్నది. అతడి ఆగడాల నుంచి విముక్తి కల్పించాలని ఇంధనశాఖ, విద్యుత్తు సంస్థల ఉద్యోగులు కోరుతున్నారు.

అతడి పేరెత్తితేనే చిరాకు

సదరు నాయకుడు ఇచ్చిన చనువుతో ప్రైవేట్ వ్యక్తి తమ నెత్తిన కూర్చుకుంటున్నాడని కొందరు అధికారులు వాపోతున్నారని తెలుస్తున్నది. ఐఏఎస్ అధికారులకు ధమ్కీలు ఇవ్వడం, కాంట్రాక్టర్లతో సెటిల్మెంట్లు చేయడంలో బ్రోకర్ ఓవర్ చేయడం వివాదాస్పదంగా మారుతున్నదని సమాచారం. బ్రోకర్ పేరును ఎవరైనా ప్రస్తావిస్తే కూడా కొందరు అధికారులు చిరాకు పడుతున్నారట. ఇటీవల బ్రోకర్... ఏదో పైరవీ లేఖ పట్టుకుని ఒక ఐఏఎస్ అధికారి వద్దకు వెళ్లగా.. 'నువ్వు ఇంకోసారి నా దగ్గరకు రావొద్దు.. వెళ్లిపో' అంటూ ఆ అధికారి చీవాట్లు పెట్టారట. మరో ఐఏఎస్ అధికారి... ఆ బ్రోకర్‌కు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదట. సచివాలయంలో పవర్‌ఫుల్ బ్రోకర్ దందాలపై కొందరు అధికారులు ఓ పెద్ద ఐఏఎస్‌కు కూడా ఫిర్యాదు చేశారని తెలుస్తున్నది.

ఐఏఎస్‌ల అవినీతి రాజ్యం!

- సచివాలయం బయట సీనియర్ల సొంత దుకాణాలు
- వికారాబాద్‌లో ఫామ్ హౌజ్‌ల మీద భారీ పెట్టుబడులు
- 45 మందికిపైగా సీనియర్ ఐఏఎస్‌లకు ఫామ్ హౌజ్‌లు
- 'రియల్' వ్యాపారులతో కలెక్టర్లకు సన్నిహిత సంబంధాలు
- ముఖ్యమంత్రి చెప్పినా పట్టించుకోని పలువురు అధికారులు
- సీఎం రేవంత్‌రెడ్డికి సీఎస్ రామకృష్ణారావు కీలక నివేదిక

జాబితాలో ముఖ్యమంత్రి చుట్టూ ఉన్న ఐఏఎస్‌లే ఎక్కువ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 'బ్యూరోక్రాట్' దోపిడీ అంతులేకుండా పెరిగిపోయిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. సచివాలయంలో కీలక స్థానాల్లో పనిచేస్తున్న కొంతమంది సీనియర్ ఐఏఎస్‌లు బయట సొంతంగా దుకాణాలు పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. ప్రధానంగా 11 మంది అగ్రశ్రేణి బ్యూరోక్రాట్ల మీద తీవ్ర అవినీతి ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వాళ్లు కోట్లకు పడగలెత్తారని, వికారాబాద్ జిల్లాలోని మొయినాబాద్, దాని సమీప మండలాల్లో వ్యవసాయ ఫాం హౌజ్‌ల మీద పెట్టుబడులు పెడుతున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇందులో అత్యధిక శాతం మంది ముఖ్య నేతల చుట్టూ, కీలక శాఖల్లో ఉన్న అధికారులే కావడం గమనార్హం. వివిధ పనుల మీద సీఎంవోకు, సచివాలయానికి వచ్చే ఎగువ, మధ్యశ్రేణి వ్యాపార వర్గాలతో సీనియర్ అధికారులు పరిచయాలు పెంచుకొంటున్నారని చెప్తున్నారు. నడిరోడ్లు మొదలు స్టార్ హోటళ్ల వరకు అడ్డాలుగా మార్చుకొని డీల్ మాట్లాడుకుంటున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గుమాస్తాలుగా.. హెడ్ క్లర్క్‌లుగా..

ముఖ్యనేత సోదరుల భూ దందాలో దక్షిణ తెలంగాణకు చెందిన ఒక సీనియర్ అధికారి గుమస్తా తరహా సాయం అందిస్తుండగా, తెలంగాణ ప్రాంతానికే చెందిన మరో మహిళా సీనియర్ అధికారి భవన నిర్మాణ అనుమతులు, అక్రమ భవన నిర్మాణాలు, కమర్షియల్ లావాదేవీల మీద ఆర్‌ఆర్ ట్యాక్స్ వసూళ్లకు హెడ్‌క్లర్క్‌గా పని చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెల్లుతున్నాయి. ఆంధ్ర పాంతానికి చెందిన మరో సీనియర్ అధికారి నంబర్ 2 నేత ఇంటికి పెద్ద గుమస్తాగా పని చేస్తున్నారని, ఆయన కుమారుడు, కూతురు నడిపే రియల్ ఎస్టేట్ వ్యవహారం అంతా ఆయన పర్యవేక్షణలోనే సాగుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీళ్లంతా తమ వాటా తాము తీసుకున్న తర్వాతే మిగిలినవాటిని పంపాల్సిన వాళ్లకు పంపుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సీనియర్ అధికారులు తమ సలహాలు, సూచనలతో ఇప్పటికే ముఖ్యనేతను, నంబర్ 2 నేతను పీకల్లోతు అవినీతి ఊబిలోకి నెట్టేశారనే ప్రచారం జరుగుతున్నది.

రోడ్డు మీదనే మూటలు..

ఇటీవల కార్మిక శాఖలో జరిగిన బీమా స్కాం స్టార్ హోటల్‌లోనే జరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. అనామక కంపెనీలకు కార్మికుల సొమ్ము రూ.349 కోట్లు కట్టబెట్టిన కుంభకోణంలో సీనియర్ ఐఏఎస్ అధికారి రూ.18 కోట్లు తీసుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆయన తర్వాత ఉన్న అధికారికి రూ.1.5 కోట్లు ముట్టినట్టు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. గచ్చిబౌలి ఔటర్ రింగ్ రోడ్డు వద్ద డబ్బు సంచులు మారాయన్న ఆరోపణలు ఉన్నాయి. అదే శాఖకు చెందిన ఓ ఉద్యోగి ఈ తతంగాన్ని వీడియో తీసినట్టు కార్మిక భవన్ ఉద్యోగులు చెప్పుకుంటున్నారు. వీడియోలు తీసినట్టు చెప్తున్న ఉద్యోగి మూడు నెలలుగా విధులు హాజరు కావటం లేదని సమాచారం.

4 శాతం కమీషన్ ఆరోపణలు

నాలుగు నెలల కిందట ఒక కీలక శాఖలో రూ.3 వేల కోట్ల సామాగ్రి కొనుగోలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులకు, పారిశ్రామిక వేత్తలకు విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన మిషనరీ, స్తంభాలు, వైర్లు కొలుగోలు చేసినట్టు నివేదికలు చెప్తున్నాయి. ఈ కొనుగోళ్లలో అత్యున్నత స్థానంలో ఉన్న ఇద్దరు సీనియర్ అధికారులు 4 శాతం కమీషన్ తీసుకున్నట్టు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఆ శాఖ మీద వరుసగా ఏసీబీ దాడులు జరుగుతున్నాయని చర్చ జరుగుతున్నది. ఈ క్రమంలోనే తాజాగా ఒక భారీ తిమింగలాన్ని పట్టుకున్న విషయం తెలిసిందే. ఇదే తరహా దాడి ఉన్నతాధికారుల మీద కూడా జరిగితే రాష్ట్ర ప్రజలకు ఏసీబీ మీద మరింత నమ్మకం కుదిరేదని ఆ శాఖ ఉద్యోగులు చెప్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న అధికారి పార్ట్ టైం కింద ముఖ్యనేత సోదరుల భూం కుంభకోణాల్లో సహకారం అందిస్తున్నారని సచివాలయ వర్గాల్లో ప్రచారం జరుగుతున్నది. ఇటీవల జరిగిన ప్రపంచ స్థాయి ఈవెంట్‌లో ప్రభుత్వ తరపు యాడ్స్ నిధులు అన్ని ఒకే అధికారి చేతుల్లోకి వెళ్లాయనే గుసగుసలు వినిపిస్తున్నాయి. హైదరాబాద్‌లోని ఒక శాఖకు కీలక బాధ్యతలు చూస్తున్న సీనియర్ ఐఏఎస్ ఏకంగా నల్లధనం చేతిలో పట్టుకొని తిరుగుతున్నట్టు ప్రచారం జరుగుతున్నది.

కలెక్టర్లదీ అదే తీరు..


పలువురు కలెక్టర్లు జిల్లాల్లోని రియల్ ఎస్టేట్ వ్యాపారులతో సన్నిహితంగా మెదులుతున్నట్టు ఆరోపణలు ఉన్నాయి. సచివాలయంలో చక్రం తిప్పగలిగే స్థాయిలో ఉన్న కొందరు కలెక్టర్లు ఏకంగా పలు వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. రాజకీయ నేతల తరహాలో తమ ఫ్యామిలీ మెంబర్ల ద్వారా సెటిల్మెంట్లు చేయిస్తున్నట్టు, బినామీ పేర్ల మీద ఆస్తులు కూడబెడుతున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కలెక్టర్ల అక్రమ వ్యవహారం సీఎంవో దృష్టికి రావటంతో కాన్ఫరెన్స్ నిర్వహించి అవినీతి విషయంలో సీఎం సీరియస్‌గా హెచ్చరించినట్టు తెలిసింది. అయినా పెద్దగా మార్పు లేదని సమాచారం.

సీఎస్ రహస్య నివేదిక

అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న కలెక్టర్లపై ప్రభుత్వ పెద్దలు ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్టు సమాచారం. కొత్తగా జిల్లాలకు వెళ్లిన అధికారులు, అంతకు ముందు నుంచే పని చేస్తున్న ఐఏఎస్ కదలికలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది. ఎవరెవరు ఎలాంటి దందాలకు పాల్పడుతున్నారు? అనే సమాచారం సేకరించినట్టు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఐఏఎస్‌ల వ్యవహారాలు, కదలికలు, శాఖల మీద దృష్టి పెట్టిన తీరు, బయటి దందాలు తదితర అంశాల మీద సీఎస్ రామకృష్ణారావు రహస్య సమాచారం సేకరించి సీఎంకు నివేదించినట్టు సమాచారం. నిఘా వర్గాల నుంచి వచ్చిన సమాచారంతో పాటు తనకున్న సొంత నెట్‌వర్క్ ద్వారా ఈ నివేదికలు రూపొందించినట్టు తెలిసింది. రామకృష్ణారావు సీఎస్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఏకకాలంలో దాదాపు 36 మంది ఐఏఎస్‌ల బదిలీలు జరిగాయి. ఆ టైంలోనే అవినీతి ఆరోపణలు ఉన్న పలువురు కార్యదర్శులను, కలెక్టర్లను బదిలీ చేశారు. అయినా ఎటువంటి మార్పు లేకపోవటంతో మరోసారి బదిలీ చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి సూచించినట్టు తెలిసింది. అయితే సీఎస్ ఇచ్చిన నివేదికలో ఎక్కువ మంది ముఖ్యనేతల చుట్టూ ఉండే సీనియర్ అధికారులు ఉన్నారని, వారి పట్ల ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే ఆసక్తి సచివాలయ వర్గాల్లో నెలకొన్నది.

ల్యాండ్ సెటిల్ చేద్దాం!

అన్నతో ఇప్పుడే మాట్లాడిన!.. నా వెనక అన్న, వదిన ఉన్నరు
వారి కుటుంబం చాలా దగ్గర.. త్వరలో కీలకమైన పోస్టు నాకే
రాజధానిలోని మహిళా డీసీపీ తీరుపై పోలీసుశాఖలో తీవ్ర చర్చ



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): 'అన్నతో ఇప్పుడే మాట్లాడిన. వాళ్లకు వీళ్లకు భయపడను. నేను చెప్పిందే ఇక్కడ వేదం. నా వెనుక అన్న, వదిన ఉన్నరు' ఇవీ రాష్ట్ర రాజధానిలోని ట్రై కమిషనరేట్ల పరిధిలో ఓ డీసీపీ తరచుగా చెప్పుకుంటున్న మాటలు. తన వద్దకు ఎవరైనా పనిమీద వెళ్లినప్పుడు.. ఇలాగే మాట్లాడుతూ అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నారని పోలీసు వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. 'అన్న అంటే చోటా మోటా లీడర్ కాదు. అన్ననే నాకు బాస్' అంటూ చెప్పుకుంటారని వినికిడి. ఇప్పుడు వాళ్ల పార్టీ నాయకులు ఎవరైనా ఆయన పేరు పక్కన అన్న అని సంబోధిస్తూ పిలుచుకోవడంలో పెద్ద విశేషమేంటి అని అనుకుంటారు. కానీ అలా ఎవరైనా అంటే ఆమెకు చాలా కోపం వస్తుందట. 'నన్ను సీదాసాదా అనుకుంటున్నవా.. నాకు అన్న కుటుంబం ఎంత దగ్గరో తెలుసా.. నాపై ఎవరెవరో ఎన్నో ఆరోపణలు చేస్తున్నారు.. ఎందో ఎంక్వయిరీలు అని అంటున్నరు. అదంతా ట్రాష్. అంతా అన్న చూసుకుంటడు. రేపోమాపో నాకు వచ్చే పోస్టింగ్ కూడా అప్పుడే కన్‌ఫర్మ్ అయింది. కీలకమైన జోన్‌కు వెళ్తున్నాను' అని చెప్పుకుంటారని తెలిసింది.

'అన్న' ఆశీస్సులతో చెల్లె సెటిల్‌మెంట్లు!

కీలకమైన కమిషనరేట్‌లో డీసీపీగా పని చేస్తున్న ఐపీఎస్ అధికారిపై చాలా ఆరోపణలు ఉన్నాయి. మరో ఇద్దరు డీసీపీలతో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నట్టు తెలిసింది. శివారు ప్రాంతాల్లో భూవివాదాలను పరిష్కరించడమే పనిగా పెట్టుకున్నట్టు సమాచారం. కొందరు సీఐలు, అధికార పార్టీ స్థానికనేతలతో కలిసి ల్యాండ్ సెటిల్మెంట్ దందా చేస్తున్నట్టు తెలుస్తున్నది. మేడమ్ గారి సామాజిక వర్గానికి చెందిన వారికి సెటిల్‌మెంట్లలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు సమాచారం. 'ఏ ల్యాండ్ అయినా తీసుకొని రా.. ఎక్కడైనా సరే సెటిల్ చేద్దాం' అంటూ తన సామాజిక వర్గానికి చెందిన రియల్టర్ల వద్ద చెప్పుకోవడం, పెద్ద ఇష్యూ అయితే నేనే స్వయంగా వెళ్లి అన్నను కలుస్తా' అంటూ హామీ ఇస్తున్నట్టు పోలీసు అధికారులు కొందరు అంటున్నారు. సదరు జోన్‌లో ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన కీలక వ్యక్తులు భారీగా ల్యాండ్ సెటిల్‌మెంట్లు చేస్తున్నారని ప్రజలు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. ఇలాంటి అధికారులు, పెద్ద తలకాయలు కలిసి సెటిల్‌మెంట్లు చేస్తుంటే సామాన్యులు పోలీసుల వద్దకు వెళ్లి, సమస్యలను ఎలా చెప్పుకుంటారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఎన్ని అరోపణలు వచ్చినా.. ఉన్నతాధికారులు కూడా ఆమె విషయంలో నోరు మెదపడం లేదని పోలీస్ సిబ్బంది చెప్తున్నారు.

ఆ డీసీపీ పోస్టు వస్తుందా..!

ఈ నెలఖరులో డీజీపీ రిటైర్మెంట్ ఉండడంతో పోలీస్‌శాఖలో ఐపీఎస్‌ల బదిలీలు ఉండొచ్చనే చర్చ పోలీస్‌శాఖలో జరుగుతున్నది. ఈ నేపథ్యంలో ఎవరికి వారే మంచి పోస్టింగ్‌ల కోసం తమ బాస్‌ల వద్దకు వెళ్లి పైరవీలు మొదలు పెట్టినట్టు తెలుస్తున్నది. ఈ అధికారి చెప్పుకుంటున్నట్టు కీలక పోస్టులోకి వెళ్తారా లేదా అనేది స్పష్టతలేదు. అయితే ప్రస్తుతం ఆమె కోరుకుంటున్న పోస్టులో జాతీయ స్థాయి నాయకుడి అండదండలున్న అధికారే కావడం గమనార్హం. అ అధికారిపై కూడా పలు సెటిల్‌మెంట్ల ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే బదిలీలలో డీసీపీ మేడమ్.. 'అన్న ఆశీస్సులతో' కోరుకున్న చోటకు వెళ్తారా? లేదా? ఇంకెన్ని అరాచకాలు చూడాలో అని పోలీస్ శాఖలోని పలువురు అధికారులు వ్యక్తిగత సంభాషణలలో మాట్లాడుకుంటున్నారు.

పెద్దల అవినీతి పుట్టలో కట్టల పాములు

పురపాలకలో షాడో బాస్ అక్రమ ట్యాక్స్
తొలి ఏడాది అనుమతులు తొక్కిపెట్టిన సర్కార్
చదరపు గజానికి రూ.150 చొప్పున వసూల్
పెద్దల పర్సంటేజీల మాటున అధికారుల ఆర్జన



హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఆవు చేలో మేస్తే దూడ గట్టున మేస్తదా అన్నట్టుగా పురపాలకశాఖ అనుమతుల పర్వంలో ఇదే నడుస్తున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి హైదరాబాద్ మహా నగర పరిధిలో బహుళ అంతస్థుల అనుమతులపై సర్కారు దోబూచులాట అధికారులకు కాసుల పంట పండినట్టుగా తెలుస్తున్నది. ఓవైపు రియల్ ఎస్టేట్ కుదేలవుతున్నా... వచ్చిన దరఖాస్తుల నుంచి కాసులు వసూలు చేయాలని కొందరు పెద్దలు చూపిన ఉత్సాహం.. అవినీతి అధికారులకు మరింత ఊతమిచ్చినట్టయిందని విమర్శలున్నాయి. కాంగ్రెస్ ప్రభుత్వం హెచ్‌ఎండీఏ పరిధిలో ఏడాదిపాటు అనుమతులు ఇవ్వకుండా వందల దస్త్రాలను తొక్కిపెట్టారని అప్పట్లో మార్కెట్‌వర్గాలు పెద్దఎత్తున ఆవేదన వ్యక్తం చేశాయి. ఆ తర్వాత బెంగళూరు తరహా అనధికారిక ట్యాక్స్‌ను అమలు చేశారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. ముఖ్యనేతకు ప్రధాన అనుచరుల్లో ఒకరు షాడో మంత్రిగా వ్యవహరించి, ఆయన టిక్ పెడితేనే అనుమతులిచ్చే పరిస్థితులు ఏర్పడ్డాయని సమాచారం. ఓ ఉన్నతాధికారి.. కూడా అదే బాటలో రెచ్చిపోయాడని తెలుస్తున్నది. వెరసి పెద్దల అవినీతి పుట్టలో కట్టల పాములు తయారయ్యాయి.

పేరుకున్న దస్త్రాలు.. పేరుకే అధికారులు

అసలే అంతంత మాత్రంగా తయారైన హైదరాబాద్ మహానగర రియల్ ఎస్టేట్.. అనధికారిక ట్యాక్స్‌లతోనూ అల్లాడిపోతున్నదని మార్కెట్ వర్గాల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది. ప్రధానంగా నగర శివార్లు బహుళ అంతస్థుల నిర్మాణాలు భారీగా జరుగుతాయి. దీనికి తోడు మాస్టర్‌ప్లాన్–2031లో వివిధ రకాల ఇతర జోన్లలో నిర్ధారించిన భూముల్ని నివాస, వాణిజ్య భూవినియోగానికి మార్చుకునేందుకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వస్తాయి. వందల కోట్ల రూపాయలతో ముడిపడి ఉన్న ఈ దస్త్రాలతోనే ప్రభుత్వానికి భారీ ఎత్తున ఆదాయం వస్తుంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది ఈ దస్త్రాలేవీ ముందుకు కదల్లేదు. దీంతో వందలాది దస్త్రాలు పేరుకుపోయి మార్కెట్‌వర్గాలు ఆందోళనకు గురయ్యాయి. అనంతరం దరఖాస్తుదారులు అనుమతుల కోసం 'ఉదయా'న్నే షాడో బాస్‌ను ప్రసన్నం చేసుకుంటే పనులు అవుతాయంటూ ప్రచారం జరిగింది. అప్పటి నుంచి అనుమతుల ప్రక్రియ ముందుకు కదిలింది. అనధికారిక ట్యాక్స్ వేసి, అనుమతుల ప్రక్రియ కొనసాగించారని మార్కెట్ వర్గాల్లో ఆరోపణలు వచ్చాయి.

చెరువు భూములకూ సీఎల్‌యూలు

బహుళ అంతస్థుల నిర్మాణ అనుమతుల్లో మొదలైన అవినీతిపర్వం భూవినియోగ మార్పిడి (సీఎల్‌యూ) దస్త్రాలతో తారస్థాయికి చేరిందని అధికారులే చెప్తున్నారు. ఇక్కడే షాడో బాస్‌కు సమానంగా ఓ ఉన్నతాధికారి తూకం వేసినట్టుగా తెలుస్తున్నది. ముఖ్యంగా ఇటీవల పలు ప్రాంతాల్లో ఏకంగా చెరువు భూములను కూడా నివాసయోగ్య భూములుగా మారుస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. హైడ్రా పేరుతో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో పేదల ఇండ్లు కూలుస్తున్న ప్రభుత్వం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను సీఎల్‌యూ ఉత్తర్వులు ఇస్తున్నట్టుగా 'నమస్తే తెలంగాణ' కథనాలు ప్రచురించింది. కానీ యథారాజ.. తథాప్రజ! అన్నట్టు పెద్దలు ఆదిలో దండుకుంటే... సదరు ఉన్నతాధికారి దస్త్రాలను ముందుకు కదిపే సమయంలో అందినకాడికి దండుకుంటున్నట్టు తెలిసింది. ఇలా హెచ్‌ఎండీఏ పరిధిలో సీఎల్‌యూ దస్త్రాలకు ఈ మధ్యకాలంలోనే చాలా అనుమతులు ఇచ్చినట్టు సమాచారం.

ఆర్టీఐ చట్టం దరఖాస్తుల బుట్టదాఖలు

పదకొండు జిల్లాలకు విస్తరించిన హెచ్‌ఎండీఏ పరిధిలో ఏడాదిన్నర కాలంగా భూవినియోగ మార్పిడి అంశంలో పలు అనుమానాలు ఉన్నాయి. ప్రధానంగా నాలుగైదు నెలలుగా చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలోనూ అనుమతులు ఇచ్చినట్టు ఆరోపణలున్నాయి.

సీఎల్‌యూ అనుమతుల వివరాలు ఇవ్వాలని సమాచార హక్కు చట్టం–2015 కింద 'నమస్తే తెలంగాణ' ప్రతినిధి దరఖాస్తు చేశారు. కానీ వివరాలు ఇచ్చేందుకు అధికారులు నిరాకరించారు. 'సీఎల్‌యూలకు సంబంధించి.. మీ దగ్గర ఉన్న జీవో నంబర్లను చెప్తే ఆ మేరకు సమాచారం ఇస్తాం' అని బదులివ్వడం గమనార్హం. హెచ్‌ఎండీఏ సీఎల్‌యూలకు సంబంధించి ఎన్ని అనుమతులు ఇచ్చిందనే వివరాలు ఇవ్వాలని కోరడమంటేనే.. ఏ ప్రాంతంలో, ఏ సర్వేనంబర్‌లో ఎంత విస్తీర్ణంలో భూవినియోగ మార్పిడికి ప్రభుత్వ ఉత్తర్వులు ఇచ్చిందనే సమాచారం కావాలని దరఖాస్తు సారాంశం. కానీ జీవో నంబర్లు పేర్కొనాలంటే.. ఆ సమాచారమే ఉంటే ఇక దరఖాస్తు ఎందుకు చేయాల్సి వస్తుందో అధికారులే చెప్పాలి. మొత్తంగా సీఎల్‌యూల గుట్టు రట్టవుతుందనే భయంతోనే చివరకు సమాచార హక్కు చట్టాన్ని కూడా హెచ్‌ఎండీఏ అధికారులు ఖాతరు చేయడం లేదు.

మైనారిటీ సొసైటీలో ముఖ్యనేత అనుచరుడి ఆగడాలు!

గురుకుల అక్రమాల వెనక ఆయనదే హస్తం.. విద్యార్థుల పేరిట కోట్లు స్వాహా.. మాటవినని ప్రిన్సిపాల్స్‌పై వేధింపులు



ప్రైవేట్ విజిలెన్స్ బృందంతో కక్ష సాధింపు

బాధితుల ఫిర్యాదులను తొక్కిపెడుతూ విచారణ లేకుండా పైస్థాయిలో మేనేజ్‌మెంట్
మతపెద్దలతో సమావేశానికీ 40 లక్షలు వెచ్చింపు.. అయినా అడ్మిషన్లు నిండని దుస్థితి
ప్రిన్సిపాల్స్‌ను బలిచేస్తూ 170 మందికి షోకాజ్‌లు.. సొసైటీలో ఇష్టారీతిన నిర్ణయాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మైనారిటీ గురుకుల సొసైటీలో అక్రమాల వెనక ముఖ్యనేత అనుచరుడు చక్రం తిప్పుతున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. లేని ఉద్యోగుల పేరిట నిధుల గోల్‌మాల్ వెనక ఆయనదే కీలకపాత్ర అని తెలుస్తున్నది. అక్రమాలపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులపై విచారణ చేపట్టకుండా, విషయాలేవీ బయటకు పొక్కకుండా పలుకుబడిని ఉపయోగించి తొక్కిపెడుతున్నారని సొసైటీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. అక్రమాలపై నోరు విప్పుతున్న ఉద్యోగులను వదిలిపెట్టేది లేదంటూ తమ అనుకూల ఉద్యోగులతో సొసైటీ గ్రూపులో తాజాగా మెసేజ్‌లు పెట్టించడం సొసైటీలోని దారుణ పరిస్థితులకు అద్దం పడుతున్నది. మైనారిటీ గురుకుల సొసైటీ పరిధిలో 205 గురుకులాలు ఉన్నాయి. ఆయా గురుకులాల్లో సొసైటీ ఇష్టారీతిన నియామకాలు చేపడుతూ, లేని పోస్టులను చూపుతూ నిధుల స్వాహాకు పాల్పడుతున్నదని సొసైటీ వర్గాలే ఆరోపిస్తున్నాయి. ఇతర సొసైటీల్లో కుక్‌లు, వర్కర్లు, స్వీపర్లు, జూనియర్ అసిస్టెంట్ తదితర నాన్ టీచింగ్ పోస్టులను కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా భర్తీ చేస్తున్నారు. గురుకులాల్లో టీచింగ్ స్టాఫ్ అంటే జూనియర్ లెక్చరర్, పోస్టుగ్రాడ్యుయేట్ టీచర్ , ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్, ఫిజికల్ డైరెక్టర్, ప్రిన్సిపాల్ తదితర పోస్టులను జిల్లాలవారీగా కలెక్టర్ల ద్వారా ఆయా సొసైటీలే డెమోలను నిర్వహించి భర్తీ చేసుకుంటున్నాయి. కానీ, ఒక్క మైనారిటీ సొసైటీలో మాత్రం అందుకు పూర్తివిరుద్ధం. కలెక్టర్లతో ప్రమేయం లేకుండానే జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్, సొసైటీ అధికారులే ఏజెన్సీలను ఖరారు చేసి టీచింగ్ సిబ్బందిని ఎంపిక చేస్తారు. ప్రధాన కార్యాలయం సిబ్బంది తుది ఎంపికను పూర్తి చేస్తుంది. హెడ్ ఆఫీస్‌లోని పలువురు ఉద్యోగులు, ఏజెన్సీలు కుమ్మక్కై ఈ నియామకాల్లో భారీ అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి.

పోస్టులు 32.. ఉద్యోగులు 122 మంది!

మైనార్టీ సొసైటీ బైలా ప్రకారం.. ప్రధాన కార్యాలయంలో అన్ని విభాగాల్లో కలిపి మొత్తంగా 35 పోస్టులు మాత్రమే ఉండాలి. కానీ, ప్రస్తుతం ఏకంగా 122 మంది ఉన్నారు. విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్, షూస్, స్టేషనరీ తదితర అన్ని రకాల టెండర్లలోనూ కాంట్రాక్టు సంస్థలతో సొసైటీలోని పలువురు ప్రైవేట్ వ్యక్తులు కుమ్మక్కయ్యారని సొసైటీ వర్గాలే కోడై కూస్తున్నాయి. సొసైటీ ఆర్థిక వ్యవహారాలపై గత మూడేండ్లుగా ఆడిట్ కూడా లేదని తెలుస్తున్నది. సొసైటీలో ఉద్యోగులే కాదు లేని విద్యార్థుల పేరిట కూడా నిధులను స్వాహా చేస్తున్నారని తెలుస్తున్నది. మైనార్టీ గురుకులాల్లో అడ్మిషన్ల ప్రక్రియను సొసైటీనే సొంతంగా నిర్వహిస్తుంది. విద్యార్థుల వివరాల్లో తప్పుడు లెక్కలను చూపుతున్నారని సమాచారం. అందు కోసం సొసైటీలోని ఉన్నతాధికారులు కిందిస్థాయి ప్రిన్సిపాల్స్‌పై ఒత్తిడి చేస్తున్నారని ఉద్యోగవర్గాలు వెల్లడిస్తున్నాయి. ఎలాంటి నోటిఫికేషన్ లేకుండానే, ప్రభుత్వ అనుమతి పొందకుండానే ప్రైవేట్ వ్యక్తులను విజిలెన్స్ విభాగం బృందాలుగా ఏర్పాటు చేసి ప్రిన్సిపాల్స్‌ను లక్ష్యంగా చేసుకుని బెదిరింపులకు దిగుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. మాటవినని ప్రిన్సిపాల్స్ బాధ్యులుగా ఉన్న గురుకులాలను ఈ ప్రైవేట్ విజిలెన్స్ బృందాలు సందర్శించి తప్పుడు రిపోర్టులను సమర్పిస్తామని బెదిరిస్తూ వసూళ్లకు పాల్పడుతున్నారని పలువురు బాధిత ప్రిన్సిపాల్స్ చెప్తున్నారు.

చక్రం తిప్పుతున్న మైనారిటీ నేత

ముఖ్యనేతకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న సదరు మైనారిటీ నాయకుడు.. సొసైటీ సెక్రటరీ, ఉన్నతాధికారులతో సంబంధం లేకుండానే నేరుగా ప్రిన్సిపాల్స్‌కు ఆదేశాలు జారీచేస్తున్నారని బాధిత ప్రిన్సిపాల్స్, సొసైటీ ఉద్యోగులు చెప్తున్నారు. పలువురు ఉన్నతాధికారులు, సదరు నాయకుడు మిలాఖత్ అయ్యి అక్రమాలకు తెరలేపారని ఆరోపిస్తున్నారు.

ఏజెన్సీలతో కుమ్మక్కై, ఇష్టారీతిన నచ్చినవారిని సొసైటీలో నియమిస్తున్నారని, నిధులను పక్కదారి పట్టిస్తున్నారని వివరిస్తున్నారు. సదరు నాయకుడు చేస్తున్న అక్రమాలను పసిగట్టిన ఒక సెక్రటరీ వాటన్నింటినీ చెక్ పెడుతూ వచ్చారు. హెడ్ ఆఫీస్‌లోని ప్రైవేట్ వ్యక్తులను, అదనపు సిబ్బందిని పూర్తిగా తొలగించారు. పలు ఏజెన్సీలను పూర్తిగా రద్దు చేశారు. జిల్లాస్థాయిలోనూ ప్రక్షాళన చేపట్టారు. దీంతో సదరు మైనారిటీ నాయకుడు సీఎంవో స్థాయిలో ఒత్తిడి తీసుకువచ్చి సదరు సెక్రటరీని సొసైటీ బాధ్యతల నుంచి తప్పించారని ఉద్యోగవర్గాలు వివరిస్తున్నాయి. ప్రస్తుత సెక్రటరీ వచ్చిన తర్వాత మళ్లీ గతంలో మాదిరిగానే అన్నింటినీ పునరుద్ధరించడం గమనార్హం. అంతేకాదు, మైనారిటీ గురుకులాల్లో ఏటా అడ్మిషన్ల ప్రచారం కోసం ఎక్కడికక్కడ స్థానికంగా ఆయా ప్రిన్సిపాల్స్‌కే నిధులు ఇచ్చేవారు. ఈ ఏడాది ఆ నిధులను ఇవ్వలేదు. కేవలం హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లోనే ప్రచార స్టాల్‌ను ఏర్పాటుచేసినట్టు తెలుస్తున్నది. దాదాపు రూ.40 లక్షలు ఖర్చు పెట్టి మతపెద్దలతో ప్రముఖ హోటల్‌లో ప్రత్యేక సమావేశం నిర్వహించి, వాటి పేరిట లక్షల రూపాయలు స్వాహా చేసినట్టు తెలుస్తున్నది. తీరా అడ్మిషన్లు కాలేదని చెప్తూ ఏకంగా 170 మంది ప్రిన్సిపాల్స్‌కు షోకాజ్ నోటీసులను ఇవ్వడం గమనార్హం. ఈ మొత్తం వ్యవహారం వెనక కూడా సదరు మైనారిటీ నాయకుడే చక్రం తిప్పినట్టు తెలుస్తున్నది. సొసైటీలో అక్రమాలపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగానికి, ప్రభుత్వ పెద్దలకు ఉద్యోగులు, సమాచార హక్కు కార్యకర్తలు అనేకసార్లు ఫిర్యాదు చేశారు. కానీ, వాటిపై ఇప్పటివరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ చేపట్టలేదు. సదరు మైనారిటీ నాయకుడు సీఎంవో స్థాయిలో ఒత్తిడి తెచ్చి విచారణలు కొనసాగకుండా అడ్డుకుంటున్నారని సొసైటీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

భారతీయులకు తలుపులు మూత

- చిన్న కారణాలతో మన ఐటీ ఉద్యోగుల్ని వెళ్లగొట్టే చర్యలు
- కొత్తవారు రాకుండా వీసా నిబంధనలు కఠినతరం
- అమెరికన్లపై ప్రేమ కన్నా ఇండియన్స్‌పై ద్వేషమే ఎక్కువ
- ట్రంప్ విధానాలపై స్వదేశంలో అమెరికన్ల నుంచి వ్యతిరేకత



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ పాలన డాలర్లు సంపాదించాలనుకున్న భారతీయులకు పీడ కలగా మారింది. ట్రంప్ అధికారం చేపట్టిన నాటి నుంచి అనుసరిస్తున్న విధానాలు ఆసియావాసులకు ముఖ్యంగా భారతీయులకు వ్యతిరేకంగానే ఉన్నాయి. టు మేక్ అమెరికా గ్రేట్ అగైన్ అంటూ అమెరికన్ల పట్ల ప్రేమను నటిస్తున్న ట్రంప్ నిజానికి భారతీయుల పట్ల ద్వేషాన్ని వెళ్లగక్కుతున్నారు. ఇప్పటికే విద్య, ఉద్యోగాల కోసం అమెరికా వెళ్లిన భారతీయులను తిప్పి పంపేందుకు దాదాపు అన్ని ప్రయత్నాలు చేస్తున్న ట్రంప్ కొత్తవారు తమ దేశంలోకి రాకుండా నియంత్రించే చర్యలు సైతం చేపట్టారు. తాజాగా హెచ్-1బీ వీసా ఫీజును ఒక్కసారి లక్ష డాలర్లకు పెంచి ఆ వీసాపై అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న భారతీయులతోపాటు వారిపై ఆధారపడిన కుటుంబసభ్యులను సైతం తిప్పి పంపే ఎత్తు వేశారు. ట్రంప్ విధానాల ఫలితంగా అమెరికాలో పనిచేయాలనుకున్న భారతీయుల సంఖ్య ఇప్పటికే 40 శాతం తగ్గిపోయింది. మరోవైపు టారిఫ్‌ల పేరిట దిగుమతులపై భారీగా సుంకాలు విధిస్తూ భారత మార్కెట్‌ను దెబ్బతీస్తున్నారు. అగ్రరాజ్యాన్ని పునర్నిర్మించే క్రమంలో తనకు ముందున్న పాలకులు ఎవరూ చేయని రీతిలో ట్రంప్ సంచలన నిర్ణయాలు తీసుకుంటున్నారు. మిత్రదేశాలు, ఆర్థిక సహకారం, దౌత్యపరమైన నాయకత్వంతో అమెరికా గత 80 ఏండ్లుగా నిర్మించుకున్న అంతర్జాతీయ క్రమాన్ని ట్రంప్ గందరగోళంలో పడేశారు. తొలుత ప్రతిభ ఆధారిత వలస విధానాన్ని ప్రవేశపెట్టిన ట్రంప్ ఆ పేరిట ఉద్యోగుల జీవితభాగస్వాములు, వారి పిల్లలకు మాత్రమే ప్రవేశం కల్పించి, వయోవృద్ధులైన తల్లిదండ్రులు రాకుండా అడ్డుకున్నారు. భారత్ వంటి పరాయి దేశాల నుంచి ఉద్యోగులను నియమించుకోవడం ఆపాలని, స్వదేశంలోనే మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సాఫ్ట్‌వేర్ కంపెనీలకు సూచించారు. హెచ్1బీ వీసాదారుల జీవితభాగస్వాములకిచ్చే హెచ్-4 వీసాలను రద్దు చేసేందుకు ప్రయత్నించారు. ఒబామా సర్కారు తెచ్చిన హెచ్-4 వీసాల వల్ల లక్ష మందికి పైగా ఉపాధి పొందారని, వీరిలో భారతీయ మహిళలే ఎక్కువగా ఉన్నారని ట్రంప్ ప్రభుత్వం పేర్కొంది. ఇక విద్యార్థులనైతే చిన్నచిన్న కారణాలతో వీసాలు రద్దు చేసి తిప్పి పంపుతున్నారు. ట్రాఫిక్ చలాన్లు పడ్డాయని, మద్యం సేవించి వాహనం నడిపారని, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారన్న నెపంతో, చివరికి క్లాస్‌కు గైర్హాజరైనా విద్యార్థుల వీసాలు రద్దు చేశారు. దీంతో ఎప్పుడు ఏ కారణంతో వీసా రద్దు చేసి ఇంటికి పంపుతారో తెలియక భారతీయ విద్యార్థులు దినదినగండంగా గడుపుతున్నారు. వీసా నిబంధనలు ఉల్లంఘించారన్న నెపంతో ఇటీవలి కాలంలో 4,700 మంది భారతీయ విద్యార్థుల వీసాలను అమెరికన్ ప్రభుత్వం రద్దు చేసిందని టైమ్స్ ఆఫ్ ఇండియా ఓ కథనంలో పేర్కొంది. భారతీయ విద్యార్థులు పనిచేస్తున్న ప్రదేశాలలో తనిఖీలు పెంచడంతో యజమానులు వారిని పనిలో నుంచి తీసేశారు. దీంతో పార్ట్‌టైం పనులు చేస్తూ చదువుకుంటున్న విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. విద్య, ఉపాధి కోసం వచ్చే వారినే కాకుండా పర్యాటకులను సైతం నిరుత్సాహ పరిచే చర్యలకు ట్రంప్ ఒడిగట్టారు. పర్యాటకుల వీసా అపాయింట్‌మెంట్ నిబంధనలను మార్చారు. పిల్లలైనా, వృద్ధులైనా సరే వ్యక్తిగతంగా ఇంటర్వ్యూకు హాజరు కావాల్సిందేనని అన్నారు. తాజాగా ఈ నెలలోనే వ్యాపారులు, పర్యాటకులకు ఇచ్చే బీ1, బీ2 వసాల నిబంధనలను మార్చారు. నాన్ ఇమిగ్రెంట్ వీసాల కోసం ప్రయత్నించేవారు తమ ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్‌లను స్వదేశంలోనే షెడ్యూల్ చేసుకోవాలని స్పష్టం చేశారు. వీరు గతంలో తమ వీసా అపాయింట్‌మెంట్లను విదేశాల్లో బుక్ చేసుకొనే అవకాశం ఉండేది. మొత్తంగా నిబంధనల పేరిట భారతీయుల పట్ల ట్రంప్ ప్రదర్శిస్తున్న విద్వేషాన్ని అమెరికాలోని చట్టసభ సభ్యులే కాకుండా బహుళజాతి కంపెనీల అధిపతులు సైతం వ్యతిరేకిస్తున్నారు.



వెంటనే అమెరికాకు వచ్చేయండి

హెచ్-1బీ కలిగిన ఉద్యోగులకు టెక్ కంపెనీల ఆదేశం

న్యూయార్క్, సెప్టెంబర్ 20: ఉద్యోగ బాధ్యతల పైన, లేక సెలవుల పైన అమెరికా వెలుపల ఉన్న తమ హెచ్-1బీ ఉద్యోగులు లేదా వారి కుటుంబ సభ్యులు 24 గంటల్లో అమెరికాకు తిరిగి రావాలని, లేనిపక్షంలో వారు వెలుపలే నిలిచిపోయే ప్రమాదం ఉందని ప్రధాన టెక్ కంపెనీలు హెచ్చరించాయి. అమెరికాలో ఉన్నవారు దేశాన్ని వదిలి వెళ్లవద్దని తమ హెచ్-1బీ వీసాదారులైన ఉద్యోగులను ఆదేశించాయి. హెచ్-1బీ వీసాదారుల చట్టపరమైన జీవిత భాగస్వాములు, వారి అవివాహిత పిల్లలకు హెచ్-4 వీసాలు లభిస్తాయి. ట్రంప్ ప్రభుత్వం హెచ్-1బీ వీసా ఫీజులు భారీగా పెంచిన నేపథ్యంలో ఆ వీసాలపై ఉన్న తమ ఉద్యోగులు అమెరికాను వదిలి వెళ్లవద్దని మైక్రోసాఫ్ట్, జేపీ మోర్గన్, అమెజాన్ వంటి దిగ్గజ టెక్ కంపెనీలు సూచించాయి. హెచ్-1బీ, హెచ్-4 వీసాలు గల తమ ఉద్యోగులకు వివిధ కంపెనీలు జారీ చేసిన ఆదేశాలు ఇలా ఉన్నాయి. ఇదిలా ఉండగా ట్రంప్ తాజా ప్రకటన గురించి తెలిసిన వెంటనే విమానాశ్రయాలలో ఉన్న పలువురు భారతీయ టెకీలు తమ ప్రయాణాలను మానుకున్నట్లు సోషల్ మీడియాలో కథనాలు వెల్లువెత్తుతున్నాయి.

- **అమెజాన్, మైక్రోసాఫ్ట్:** అధ్యక్షుడు ట్రంప్ జారీ చేసిన ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వు సెప్టెంబర్ 21 నుంచి(ఆదివారం) అమలులోకి వస్తున్న దృష్ట్యా ఆదివారం అర్ధరాత్రి 12 గంటలలోగా(తూర్పు కాలమానం) ఉద్యోగులు అమెరికాకు తిరిగి రావాలి. ఊహించగల భవిష్యత్తు కోసం అమెరికాలోనే ఉండాలి.
- **జేపీ మోర్గాన్:** ప్రస్తుతం అమెరికాలో ఉన్న హెచ్-1బీ వీసాదారులు దేశంలోనే ఉండాలి. ట్రంప్ ప్రభుత్వ స్పష్టమైన ప్రయాణ మార్గదర్శకాలు జారీ చేసేవరకు అంతర్జాతీయ ప్రయాణాలను మానుకోవాలి.

ఏ కంపెనీలో ఎంత మంది ఉద్యోగులున్నారంటే

(2025 జూన్ నాటికి)

అమెజాన్	10,044
టీసీఎస్	5,505
మైక్రోసాఫ్ట్	5,189
మెటా	5,123
యాపిల్	4,202
గూగుల్	4,181
డెలాయిట్	2,353
ఇన్ఫోసిస్	2,004
విప్రో	1,523
టెక్ మహీంద్ర అమెరికాస్	951

ట్రంప్ దెబ్బకు విమాన చార్జీలకు రెక్కలు

- భారత్ నుంచి అమెరికాకు రెట్టింపు ధరలు
- భారత్‌కు రావాలనుకున్నవారి ప్రయాణాల రద్దు



న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా రుసుమును 1 లక్ష డాలర్లు (రూ.88 లక్షలు)కు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంతో అమెరికాలోని విమానాశ్రయాల్లో గందరగోళం నెలకొంది. దీని అమలుకు గడువును ఈ నెల 21 ఉదయం 9.31 గంటలుగా నిర్ణయించడం మరింత ఆందోళనకు గురి చేసింది. దుర్గా పూజల కోసం భారత దేశానికి వచ్చేందుకు విమానాలు ఎక్కినవారు ట్రంప్ ప్రకటన గురించి తెలుసుకుని, హుటాహుటిన దిగిపోయారు. మరోవైపు భారతదేశం నుంచి అమెరికాకు వెళ్లే విమానాల టిక్కెట్ ఛార్జీలు దాదాపు రెట్టింపు అయ్యాయి. న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్‌కు వెళ్లే టిక్కెట్ ధర రూ.37,000 నుంచి రూ.70,000-80,000కు పెరిగింది. ట్రంప్ ప్రకటన వెలువడిన రెండు గంటల్లో ఈ పెరుగుదల కనిపించింది.

జీతం అంతా వీసా రుసుముకే!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును లక్ష డాలర్లకు (రూ. 88 లక్షలు) పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకొన్న నిర్ణయం అక్కడి భారతీయ టెకీల్లో కలవరానికి గురి చేస్తున్నది. కొత్త వీసాలతో పాటు, గడువు తీరే వీసాల పొడిగింపు విషయంలోనూ తాజా నిబంధనలు అమలు చేయడం అక్కడి వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. తాము సంపాదించే జీతమంతా వీసా రుసుముకే చెల్లించాల్సి వస్తుందని మధ్యస్థంగా వేతనాలు తీసుకొనే పలువురు టెకీలు సోషల్ మీడియా వేదికగా కామెంట్లు చేస్తున్నారు.

ఓ టెకీ ఆందోళన ఇలా..

'నేను ఓ టెక్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌ను. మూడేండ్లుగా ఇక్కడ విధులు నిర్వహిస్తున్నా. నా హెచ్-1బీ వీసాను కంపెనీనే స్పాన్సర్ చేసింది. అయితే, ఇప్పుడు దాని కాలపరిమితి తీరనున్నది. ట్రంప్ తాజా నిర్ణయం ప్రకారం వీసాను పొడిగించుకోవాలంటే, లక్ష డాలర్లు అంటే రూ.88 లక్షలు చెల్లించాలి. ఇంత మొత్తంలో కంపెనీ భరిస్తుందన్న ఆశ నాకు లేదు. నాకు ఏడాదికి లక్ష డాలర్ల జీతం. ఇప్పుడు వీసా కావాలంటే నా జీతం మొత్తాన్ని ఫీజుగా చెల్లించాల్సిందే. ఏం చేయాలో అర్థం కావట్లేదు' అంటూ ఓ భారతీయ టెకీ సోషల్ మీడియాలో తన ఆవేదనను వ్యక్తం చేశారు.



ఇక.. రెమిటెన్స్‌కు బ్రేక్!

- భారత్‌కు డాలర్ ఆదాయంపై దెబ్బ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: పెరిగే హెచ్-1బీ వీసాల ఫీజు.. భారత్‌లోకి వచ్చే రెమిటెన్స్(విదేశాల్లోని భారతీయులు స్వదేశానికి పంపే మొత్తం) భారీ ఎత్తున తగ్గించే అవకాశాలే కనిపిస్తున్నాయి. ఆయా దేశాల్లో స్థిరపడ్డ భారతీయులు ఏటా స్వదేశానికి పెద్ద మొత్తాల్లో నగదును పంపిస్తున్న విషయం తెలిసిందే. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) లెక్కల ప్రకారం గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇలా వచ్చిన మొత్తం 135.46 బిలియన్ డాలర్లు. ఇందులో అమెరికా వాటానే 28-30 శాతంగా ఉండటం గమనార్హం. ఇకపై తగ్గుముఖం పట్టవచ్చని భావిస్తున్నారు.

ఇదీ సంగతి..

హెచ్-1బీ వీసా ఫీజును లక్ష డాలర్లకు పెంచుతున్నట్టు అమెరికా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పుడు 5వేల డాలర్ల లోపే ఉన్నది. దీంతో ఇకపై ఆ వీసా ద్వారా ఉద్యోగులను అమెరికాకు పంపాలంటే భారత్‌లోని ఐటీ సహా, ఇతర అన్ని రంగాల సంస్థలకు తలకు మించిన భారమే కానున్నది. అత్యవసరమైతే తప్ప ఉద్యోగులను అమెరికాకు పంపవు. అదికూడా అతికొద్ది మందికే అవకాశం ఉంటుంది. అటు వీసా ఫీజులు, ఇటు అత్యధిక జీతాలు మోయలేని పరిస్థితి. దీంతో అమెరికా అవసరాలకు స్థానిక వనరులను ఉపయోగించుకోవడానికే మెజారిటీ సంస్థలు మొగ్గుచూపుతాయి. దాంతో అమెరికాలో ఇప్పుడున్న ఉద్యోగులంతా కూడా వీసా గడువు ముగియగానే భారత్‌కు అంతా సర్దుకుని రావాల్సిందే. ఈ లెక్కన వారి ద్వారా ఇన్నాళ్లూ వస్తున్న రెమిటెన్స్‌లు ఇక ఆగినట్టేనని చెప్పక తప్పదు. అదే జరిగితే ఇక్కడ రియల్ ఎస్టేట్ రంగం, స్టాక్ మార్కెట్లు. బ్యాంక్ డిపాజిట్లు, ఇతర సెక్యూరిటీలపై కూడా ప్రభావం పడుతుంది.

వీసా రుసుము పెంపు ఎవరికి పోటు?

న్యూఢిల్లీ : హెచ్-1బీ వీసా దరఖాస్తుల వార్షిక రుసుమును 1 లక్ష డాలర్లకు పెంచడం వల్ల డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు; మన దేశం నుంచి అమెరికాకు ఉద్యోగం కోసం వెళ్లాలనుకునేవారు, ప్రస్తుత వీసాను రెన్యువల్ చేసుకోవలసినవారు ఇబ్బందులు ఎదుర్కొంటారు. అమెరికన్ కంపెనీలు హెచ్-1బీ వీసాలపై నియమించుకున్న ఇండియన్ టెక్ ప్రొఫెషనల్స్‌పై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుంది. అమెరికన్ కామర్స్ సెక్రటరీ హోవార్డ్ లుట్నిక్ మాట్లాడుతూ, వీసాల రెన్యువల్ లేదా కొత్తగా నియామకాలు చేపట్టడంపై కంపెనీలే నిర్ణయం తీసుకోవాలన్నారు. ఓ ఉద్యోగి కోసం సంవత్సరానికి 1 లక్ష డాలర్లు ప్రభుత్వానికి చెల్లించడం అవసరమేనా? అమెరికన్ పౌరుడినే నియమించుకోవాలా? అనే అంశంపై కంపెనీలే నిర్ణయించుకోవాలన్నారు. సంవత్సరానికి 1 లక్ష డాలర్లు చొప్పున ఆరేళ్లపాటు చెల్లించవలసి ఉంటుందని చెప్పారు.

ట్రంప్ వైఖరిపై కేంద్రం మౌనమేల?

- వీసా చార్జీల పెంపును రాష్ట్ర ప్రభుత్వం ఖండిస్తోంది
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): హెచ్-1బీ వీసా చార్జీలను పెంచుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయంపై భారత ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉంటున్నదని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ఈ నిర్ణయంతో తెలంగాణ యువతకు తీవ్ర నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా కేంద్రం మౌనం వీడాలని ఒక ప్రకటనలో ఆయన కోరారు. అమెరికాపై ఒత్తిడి తేవాలని కోరారు. కేంద్రం సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకోకపోతే దేశానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆందోళన వ్యక్తంచేశారు. మోదీ-ట్రంప్ మధ్య మంచి స్నేహం ఉన్నదని అందరూ చెప్తారని, మరి ఈ నిర్ణయాల సంగతి ఏమిటో కేంద్రమే వెల్లడించాలని సూచించారు. వీసా చార్జీల పెంపు నిర్ణయాన్ని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు.

ట్రంప్ భయాలేంటి?

వాషింగ్టన్: హెచ్-1బీ వీసా మార్గాన్ని అమెరికన్ కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని ట్రంప్ అడ్మినిస్ట్రేషన్ ఆరోపిస్తున్నది. వేతనాలను కృత్రిమంగా తొక్కిపెట్టి, అమెరికన్ పౌరులకు బదులుగా విదేశీయులను నియమించుకుంటున్నాయని చెప్తున్నది. ఫలితంగా అమెరికన్ పౌరులకు లేబర్ మార్కెట్ ప్రతికూలంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నది.అమెరికన్లకు బదులుగా తక్కువ వేతనంతో, తక్కువ నైపుణ్యం గల కార్మికులను నియమించుకోవడం కోసం ఉద్దేశపూర్వకంగా హెచ్-1బీ వీసాను దోపిడీ చేస్తున్నారని పేర్కొంది.

ట్రంప్ నిర్ణయంతో మానవతా పరమైన ప్రభావం

న్యూఢిల్లీ: హెచ్-1బీపై ట్రంప్ తీసుకున్న నిర్ణయం కుటుంబాలకు అంతరాయం కలిగించడం ద్వారా మానవతాపరమైన ప్రభావాలు చూపవచ్చునని భారత విదేశాంగ శాఖ పేర్కొంది. ఈ పెంపు ప్రభావం వల్ల సంభవించే పరిణామాలను ప్రభుత్వం అధ్యయనం చేస్తుందని, అమెరికా యంత్రాంగం దీనిని పరిష్కరిస్తుందని ఆశిస్తున్నట్టు తెలిపింది. ఆవిష్కరణ, సృజనాత్మకతలో భారత దేశం, అమెరికా రెండూ వాటా కలిగి ఉన్నాయని, రెండు వైపులా ముందుకు సాగడానికి ఉత్తమ మార్గంపై సంప్రదింపులు జరపాలని ఆ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు.

చిన్న సంస్థలపై పెద్ద భారం

- భారత మధ్య, చిన్నశ్రేణి ఐటీ కంపెనీలకు దారుణమైన దెబ్బ
- అమెరికాకు మూసుకుంటున్న ద్వారాలు: నిపుణుల హెచ్చరిక
- పెట్టుబడులు, ఉద్యోగాలకు ఇబ్బందే



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: హెచ్-1బీ వీసా దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్ల (ప్రస్తుతం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ప్రకారం రూ.88 లక్షలపైనే)కు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయం.. భారతీయ మధ్య, చిన్నశ్రేణి ఐటీ కంపెనీలకు శరాఘాతమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అటు అమెరికా, ఇటు భారతీయ నిపుణుల్లోనూ ఇదే అంచనాలుండటం గమనార్హం. ముఖ్యంగా స్టార్టప్‌లు, వాటి ఆవిష్కరణలకు ఇది పెద్ద దెబ్బేనని విశ్లేషిస్తుండటం ఒకింత ప్రమాద ఘంటికల్నే మోగిస్తున్నది.

అమెరికా ప్రాజెక్టులు దూరం

హెచ్-1బీ వీసా మొత్తం ఫీజు ఇప్పుడు 2,000-5,000 డాలర్ల మధ్యే ఉన్నది. అయితే దాన్ని ఒక్కసారిగా లక్ష డాలర్లకు పెంచుతున్నట్టు ప్రకటించింది ట్రంప్ సర్కారు. ఒక్క మాటలో చెప్పాలంటే అమెరికాలో పనిచేసేందుకు ఇతర దేశస్తులకు ఇచ్చే వర్క్ పర్మిటే ఈ వీసా. అగ్రరాజ్యంలో తమకు వచ్చిన ప్రాజెక్టులను పూర్తి చేయడానికి భారతీయ కంపెనీలు దీనిమీదే ఆధారపడుతున్నాయి. తమ దగ్గరున్న నిపుణులను ఈ వీసా ఫీజులు చెల్లించి అక్కడికి పంపిస్తున్నాయి. అయితే ఇకపై ఆ ఫీజు పెను భారంగా పరిణమిస్తున్నది. దీంతో అంత పెద్ద మొత్తంలో చెల్లించడం మధ్య, చిన్న కంపెనీలకు అసాధ్యంగానే తయారవుతున్నది. దీంతో అమెరికా ప్రాజెక్టులు ఆయా సంస్థలకు ఇక దూరమేనంటున్నారు ఇండస్ట్రీ నిపుణులు. కంపెనీలు ఆ స్థాయిలో వీసా ఫీజులు చెల్లిస్తే నష్టాలబారిన పడుతాయని, ఒకవేళ ఆసక్తిగల ఉద్యోగులకు ఆఫర్ ఇచ్చినా.. వారి జీతాల్లో కోతలు తప్పవనీ అంటున్నారు. మొత్తానికి మధ్య తరహా ఐటీ ఇండస్ట్రీకి రిస్కేనని మెజారిటీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జీసీసీల ఏర్పాటూ కల్లే

దుందుడుకు నిర్ణయాలతో ఒంటెద్దు పోకడను అవలంబిస్తున్న ట్రంప్.. భారత్‌ను అన్నిరకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఇక భారత్‌లో గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ (జీసీసీ)ల విస్తరణకూ ట్రంప్ చెక్ పెడుతున్నారు. నిజానికి మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా, ఓపెన్‌ఏఐ, యాపిల్ సంస్థలు భారత్‌లో జీసీసీల అభివృద్ధికి ప్రణాళికలు వేశాయి. కానీ అమెరికాలోనే ఆ ప్రయత్నాలు చేయాలంటూ ఆయా సంస్థల అధిపతులపై ట్రంప్ ఒత్తిళ్లు తెస్తున్నారు. ఫలితంగా ఈ టెక్ దిగ్గజాల నుంచి వచ్చే భారీ పెట్టుబడులు ఆగిపోయినట్టేనన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇవే నిజమైతే దేశంలో పెద్ద ఎత్తున ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరమైనట్టేనని ఇండస్ట్రీ వర్గాలు చెప్తున్నాయి.

టారిఫ్‌లు పడితే సంక్షోభమే

ప్రస్తుతం భారతీయ ఐటీ పరిశ్రమ అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చిత పరిస్థితులతో సతమతమవుతున్నది. ఈ నేపథ్యంలో హెచ్-1బీ వీసాల ఫీజు పెంపు పిడుగు ఇండస్ట్రీపై పడింది. ఒకవేళ టారిఫ్‌లు ఐటీ ఎక్స్‌పోర్ట్స్ పైనా వేస్తే సంక్షోభ పరిస్థితులు ఖాయమన్న అంచనాలున్నాయి.

ఐటీ సంస్థల ఆదాయానికి గండి

వీసా విధానంలో భారీ మార్పులు చిన్న వ్యాపారాలు, స్టార్టప్‌లపై పెను ప్రభావాన్నే చూపగలవు. అంతంత ఫీజులు చెల్లించి అమెరికాకు ఇతర దేశాల కంపెనీలు తమ ప్రతిభావంతులైన ఉద్యోగులను పంపించలేని పరిస్థితి వస్తుంది. తద్వారా విదేశీ కంపెనీలకు ముఖ్యంగా భారతీయ మధ్య తరహా సంస్థలకు అమెరికా ప్రాజెక్టులు ఇక దూరమేనని చెప్పవచ్చు.

-అజయ్ భుటోరియా,
అమెరికా మాజీ అధ్యక్షుడు జో బైడెన్‌కు అప్పట్లో సలహాదారు

ఇతర సంస్థలకూ దెబ్బే

హెచ్-1బీ వీసాలు కేవలం టెక్నాలజీ రంగ ఉద్యోగులకే గాక.. హెల్త్‌కేర్, ఇతర రంగాల్లోని ప్రతిభావంతులకూ అవసరమే. కాబట్టి ఫీజు పెంపు నిర్ణయం ఆయా రంగాలనూ ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా అమెరికా దవాఖానల్లో పనిచేస్తున్న భారతీయ వైద్యులు తిరిగి స్వదేశానికి వచ్చే వీలున్నది. భారతీయ వైద్య రంగంలోనూ ప్రతికూల ప్రభావం కనిపిస్తుందని అనుకుంటున్నాను.

-కందేరావు కంద్, ఎఫ్ఐఐడీఎస్-పాలసీ చీఫ్



అమెరికా నష్టపోతే, భారత్ లాభపడుతుంది

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై అమితాబ్ కాంత్

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా దరఖాస్తులపై వార్షిక రుసుమును రూ.88 లక్షలు (ఒక లక్ష డాలర్లు)కు పెంచుతూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న నిర్ణయాన్ని నీతీ ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ తీవ్రంగా విమర్శించారు. ఈ నిర్ణయం వల్ల అమెరికన్ ఇన్నోవేషన్ ఉక్కిరి బిక్కిరి అవుతుందని, భారత దేశంలో సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి వేగవంతమవుతుందనిచెప్పారు. ప్రపంచంలోని ప్రతిభావంతులు సిలికాన్ వ్యాలీ నుంచి భారత దేశంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఇన్నోవేషన్ హబ్స్‌పై దృష్టి పెట్టడానికి వీలవుతుందని చెప్పారు. ''డొనాల్డ్ ట్రంప్ పెట్టిన 1,00,000 డాలర్ల హెచ్-1బీ ఫీజు, అంతర్జాతీయ ప్రతిభపై తలుపులు మూసేయడం ద్వారా ప్రయోగశాలలు, పేటెంట్లు, నవ కల్పన, స్టార్టప్‌ల తదుపరి ప్రభంజనాన్ని బెంగళూరు, హైదరాబాద్, పుణే, గురుగ్రామ్‌ల వైపు అమెరికా నెట్టుతున్నది'' అని చెప్పారు. మన నిపుణులకు స్వదేశ అభివృద్ధికి తమ పాత్ర పోషించే అవకాశం వచ్చిందని తెలిపారు.

భారతీయ కంపెనీలపై తీవ్ర ప్రభావం

ట్రంప్ ఉత్తర్వుపై నాస్కామ్ ఆందోళన



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20: హెచ్-1బీ వీసా దరఖాస్తు ఫీజును 1 లక్ష డాలర్లకు(రూ.88 లక్షలు) పెంచుతూ అమెరికా ప్రభుత్వం తీసుకున్న చర్య భారత దేశ టెక్నాలజీ సర్వీసు కంపెనీలపై తీవ్ర ప్రభావం చూపుతుందని భారతీయ టెక్ పరిశ్రమల జాతీయ సంఘం నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్(నాస్కామ్) తెలిపింది. ట్రంప్ నిర్ణయం వల్ల దేశీయంగా జరిగే ప్రాజెక్టులకు వ్యాపార కొనసాగింపునకు అవరోధాలు ఏర్పడగలవని నాస్కామ్ ఆందోళన వ్యక్తం చేసింది. ట్రంప్ ప్రభుత్వం కొత్త నిర్ణయం అమలుకు విధించిన సెప్టెంబర్ 21వ తేదీ గడువుపై సంఘం ఆందోళన వ్యక్తం చేస్తూ వ్యాపారాలు, వృత్తి నిపుణులు, విద్యార్థులకు ఒకరోజు గడువు అస్థిరతను సృష్టించగలదని నాస్కామ్ పేర్కొంది. ట్రంప్ ప్రభుత్వ ఉత్తర్వుల్లోని అంశాలను తాము లోతుగా పరిశీలిస్తున్నామని, ఏదేమైనా ఈ చర్య అమెరికా ఆవిష్కరణల వాతావరణం, ఉద్యోగ వ్యవస్థపై దుష్ప్రభావం చూపగలదని అభిప్రాయపడింది.

ఇతర దేశాలపై ఆధారపడటం అతి పెద్ద శత్రువు: మోదీ

భావ్‌నగర్, సెప్టెంబర్ 20: అమెరికా టారిఫ్‌ల పెంపు, హెచ్-1బీ వీసా విధానంలో అనూహ్య మార్పుల నేపథ్యంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతర దేశాలపై ఆధారపడటం భారత్‌కు అతిపెద్ద శత్రువుగా మారుతున్నదని అన్నారు. భారతదేశ భవిష్యత్తును ఇతర దేశాలపై వదిలేసి భవిష్యత్తు తరాలను ఫణంగా పెట్టలేమని ప్రధాని అన్నారు. 'విశ్వబంధు స్ఫూర్తితో భారత్ నేడు ముందుకు సాగుతున్నది. ప్రపంచంలో మన దేశానికి పెద్దగా శత్రువులు లేరు. కానీ..ఇతర దేశాలపై ఆధారపడటమే..మనకు అతిపెద్ద శత్రువు పరిణమిస్తుంది. మనమంతా కలిసి దీనిని ఎదుర్కొని ఓడించాలి' అని అన్నారు

మోదీ ఓ బలహీన నేత

హెచ్-1బీ వీసా ఫీజు పెంపుపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: హెచ్-1బీ వీసా దరఖాస్తు వార్షిక ఫీజును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ నిర్ణయం తీసుకోవడంతో ప్రధాని మోదీపై కాంగ్రెస్ పార్టీ తీవ్రమైన దాడిని ప్రారంభించింది. ప్రధాని నరేంద్ర మోదీ ఒక బలహీనమైన నేత అని లోక్‌సభ విపక్ష నేత, కాంగ్రెస్ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ విమర్శించారు. 'నేను మళ్లీ చెబుతున్నాను. భారత దేశానికి బలహీనమైన ప్రధాని ఉన్నారు' అని ఎక్స్‌లో ఆయన పేర్కొన్నారు. మోదీ విదేశాంగ విధానాన్ని ఆలింగనాలు, శుష్క నినాదాలు, బిగ్గరగా మాట్లాడే స్థాయికి తగ్గించారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే ఆరోపించారు.

కొత్తవారికే 1 లక్ష డాలర్ల పోటు!

- ప్రస్తుత వీసాదారులకు భారీ ఉపశమనం



వాషింగ్టన్: అమెరికా హెచ్-1బీ వీసా దరఖాస్తు వార్షిక రుసుము 1 లక్ష డాలర్లకు పెరగడంతో తీవ్ర ఆందోళనకు గురవుతున్న ఇండియన్ ప్రొఫెషనల్స్‌కు గొప్ప శుభవార్త! సీనియర్ అమెరికన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి ఒకరు ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడుతూ, ట్రంప్ ప్రకటించిన కొత్త రుసుము కేవలం కొత్త దరఖాస్తులకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. ప్రస్తుత హెచ్-1బీ వీసాదారులకు లేదా రెన్యువల్స్‌కు వర్తించదని స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్-1బీ వీసా కలిగినవారు ఎటువంటి ఆందోళనకు గురి కావలసిన అవసరం లేదన్నారు. వీరు ప్రస్తుతం విదేశాల్లో లేదా భారత దేశంలో ఉన్నప్పటికీ ఆందోళన అవసరం లేదని వివరించారు. కొత్త నిబంధన అమల్లోకి రావడానికి ముందే అమెరికాకు తిరిగి చేరుకోవాలనే ఆందోళన అక్కర్లేదని చెప్పారు. దీంతో ఇండియన్ ప్రొఫెషనల్స్ ఊపిరి పీల్చుకోవచ్చు. అయితే హెచ్-1బీ వీసా దరఖాస్తుల వార్షిక రుసుమును 1 లక్ష డాలర్లకు పెంచడం వల్ల డిగ్రీ, పీజీ చదివిన విద్యార్థులు; మన దేశం నుంచి అమెరికాకు ఉద్యోగం కోసం వెళ్లాలనుకునే వారిపైనా ప్రభావం పడనుంది.

ఇండియాపై ట్రంప్.. హెచ్-1బీ బాంబ్!

మొదటిపేజీ తరువాయి...

చేశారు. తాజా నిర్ణయం ఆదివారం అర్ధరాత్రి 12.01 గంటల నుంచి (భారత కాలమానం ప్రకారం.. ఆదివారం ఉదయం 9.30 గంటలు) అమల్లోకి వస్తుందని తెలిపారు. తాను తీసుకొన్న నిర్ణయానికి సాంకేతిక రంగం మద్దతు ఇస్తుందని ట్రంప్ ఆశాభావం వ్యక్తం చేశారు. అత్యంత నైపుణ్యం కలిగిన వ్యక్తులే తమ దేశానికి రావాలని, గొప్ప ఉద్యోగులనే తాము కోరుకొంటున్నామని తెలిపారు. దేశ భద్రతను దృష్టిలో పెట్టుకొనే ఈ నిర్ణయం తీసుకొన్నట్టు వెల్లడించారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ దుర్వినియోగం కాకుండా ఉండేందుకే తాను ఇలా చేసినట్టు తెలిపారు.

విదేశీ ఉద్యోగులను తీసుకోవద్దు

హెచ్-1బీ వీసా రుసుము పెంపునకు సంబంధించి ఇప్పటికే అన్ని పెద్ద కంపెనీలతో చర్చలు జరిపినట్టు అమెరికా వాణిజ్య మంత్రి హోవార్డ్ లుట్నిక్ తెలిపారు. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతున్న విదేశీయులను ఉద్యోగాల్లోకి తీసుకోవడాన్ని నిలిపేయాలని ఈ సందర్భంగా ఆయన టెక్ కంపెనీలను కోరారు. "మీరు (కంపెనీలు) ఎవరికైనా ట్రైనింగ్ ఇవ్వాలని అనుకొంటే అమెరికాలోని గొప్ప యూనివర్సిటీల్లో డిగ్రీ సాధించిన వారికే ఆ శిక్షణను ఇవ్వండి. మన ఉద్యోగాలను కొల్లగొడుతున్న ఇతర దేశీయులకు కొలువులు ఇవ్వడం ఇకనైనా ఆపండి" అని ఆయన కోరారు.

భారతీయులపై పెను ప్రభావం

అమెరికా హెచ్-1బీ వీసాదారుల్లో భారతీయుల వాటా 72 శాతంగా ఉన్నది. ట్రంప్ తాజా నిర్ణయం నేపథ్యంలో 2023 నాటి లెక్కల ప్రకారం.. దాదాపు 4 లక్షల మంది భారతీయులపై హెచ్-1బీ వీసా పెంపు ప్రభావం పడవచ్చు. ఇక మీదట అమెరికా కేంద్రంగా పనిచేస్తున్న కంపెనీలు విదేశీ నిపుణులను నియమించుకొనేందుకు ఒక్కొక్క వీసాపై ఏడాదికి లక్ష డాలర్లు చెల్లించాల్సి వస్తుంది. హెచ్-1బీ వీసాను సాధారణంగా మూడు నుంచి ఆరేండ్ల మధ్య కాలానికి మంజూరు చేస్తారు. దీంతో వీసా గడువు పొడిగింపునకు కూడా ఏడాదికి లక్ష డాలర్ల రుసుమును చెల్లించాల్సి వస్తుంది. ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికాలో కొలువు చేయాలనుకొనే భారతీయ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం పడనున్నట్టు నిపుణులు చెప్తున్నారు.



ఏమిటీ హెచ్-1బీ వీసా?

అమెరికాలోని టెక్ కంపెనీల్లో నైపుణ్యం కలిగిన విదేశీ నిపుణులు పనిచేయడానికి ఉద్దేశించినవే హెచ్-1బీ వీసాలు. 1990లో ఇమిగ్రేషన్ యాక్ట్, 1990 ద్వారా అప్పటి అధ్యక్షుడు జార్జ్ బుష్ దీన్ని తీసుకొచ్చారు. .

టాప్‌లో ఇండియన్స్

హెచ్-1బీ వీసాదారుల్లో భారతీయ ఉద్యోగుల వాటా 72 శాతంగా ఉన్నది. ఏటా అమెరికా జారీ చేసే ప్రతీ పది హెచ్-1బీ వీసాల్లో ఏడుకు పైగా వీసాలు భారతీయ ఉద్యోగులకే దక్కుతున్నాయి. భారత్ తర్వాత చైనా 11.7 శాతంతో రెండో స్థానంలో ఉన్నది.

హెచ్-1బీ అడ్మినిస్ట్రేషన్ ఫీజు కింద ఇప్పటివరకూ 2వేల నుంచి 5 వేల డాలర్ల వరకు వసూలు చేసేవారు. అది ఇప్పుడు లక్ష డాలర్లకు (రూ.88 లక్షలు) చేరింది. దీంతో దరఖాస్తుదారులపై విపరీత భారం పడింది. హెచ్-1బీ వీసా రుసుము నాన్-రీఫండబుల్(వాపసు రాదు) అన్న విషయం తెలిసిందే.

మోదీ వైరం.. ట్రంప్ గరం.. వీసా పిరం

ప్రపంచంలో ఏ అధినేత చేయని విధంగా మోదీ ప్రవర్తించారు. తన తెలివి తక్కువ తనంతో అమెరికా ఎన్నికల్లో తలదూర్చారు. 'అబ్ కీ బార్.. ట్రంప్ సర్కార్' అంటూ ట్రంప్‌నకు మద్దతిస్తూ ప్రచారాన్ని ఊదరగొట్టారు. చివరకు ఏమైంది? 2019 ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయారు. అవేమైనా అహ్మదాబాద్ కార్పొరేషన్ ఎన్నికలు అనుకొన్నారా? మోదీ చేసిన పనికి ఇప్పుడు భారత్ ఎటు పోవాలి? మోదీ చేష్టలతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ దిగజారింది. దీనికి దేశ ప్రజలకు మోదీ క్షమాపణలు చెప్పాల్సిందే.

- 02.07.2022 నాడు అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ హైదరాబాద్ గడ్డ సాక్షిగా చేసిన వ్యాఖ్యలివి

విదేశీ దౌత్యం విషయంలో ఆచితూచి ఎలా వ్యవహరించాలో.. అందునా అమెరికా వంటి అగ్రరాజ్యంతో ఎలా మసులుకోవాలో మాజీ సీఎం కేసీఆర్ అప్పుడే విడమరిచి చెప్పారు. విదేశీ దౌత్య విధానంలో ప్రధానమంత్రి మోదీ చేస్తున్న పొరపాట్లను పూసగుచ్చినట్టు ఎత్తిచూపారు. అయినప్పటికీ, ప్రధాని మారలేదు. ఫలితం ఇప్పుడు మనమందరం కండ్లతో చూస్తూనే ఉన్నాం. 'హౌడీ మోదీ', 'నమస్తే ట్రంప్' అంటూ 2019కి ముందు ట్రంప్‌తో చెట్టాపట్టాలు వేసుకొని తిరిగిన ప్రధానమంత్రి మోదీ.. కాలుకి బలపం కట్టుకొని తిరిగిమరీ ట్రంప్‌నకు మద్దతుగా ప్రచారం చేశారు. అయితే, అప్పటి అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమిపాలై బైడెన్ గద్దెనెక్కారు. దీంతో ట్రంప్‌ను పక్కనబెట్టిన మోదీ బైడెన్‌కు దగ్గరయ్యారు. 2024 అధ్యక్ష ఎన్నికల్లో అనూహ్యంగా ట్రంప్ గెలిచి మళ్లీ పదవి చేపట్టారు. మోదీ ద్వంద్వ వ్యవహారశైలిపై గుర్రుగా ఉన్న ట్రంప్.. అధ్యక్షుడిగా పగ్గాలు చేపట్టిన తర్వాత అక్రమ వలసలు, సుంకాల పేరిట భారత్‌పై ఆంక్షల కొరడా ఝుళిపించారు. అయితే, దౌత్యంతో ఈ సమస్యను పరిష్కరించాల్సిన కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం.. అలా చేయలేదు. అమెరికాకు వైరి పక్షాలుగా ఉన్న రష్యా, చైనాతో సాన్నిహిత్యాన్ని పెంచుకొని అగ్రరాజ్యాన్ని మరింత రెచ్చగొట్టింది. దీంతో అప్పటికే ఇండియా-యూఎస్ మధ్య సున్నితంగా ఉన్న రాజకీయ, ఆర్థిక, రక్షణపరమైన దౌత్య సంబంధాలు మరింత దిగజారాయి. ఈ క్రమంలోనే భారత ఉద్యోగులే లక్ష్యంగా హెచ్-1బీ వీసా రుసుమును లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ పిడుగు వేశారు. అమెరికా తాజా నిర్ణయంతో భారతీయులు అందునా, తెలుగు రాష్ట్రాల్లోని వారిపైనే ఎక్కువ ప్రభావం పడనున్నది.

అమెరికాతో విదేశీ దౌత్యంలోనే కాదు.. స్వదేశీ పరిశ్రమలు కుంటుపడటానికి కూడా మోదీనే ప్రధాన కారణంగా నిలిచారు. దాదాపు 12 ఏండ్ల కిందట ప్రధానిగా పగ్గాలు చేపట్టిన మోదీకి.. ట్రంప్ సుంకాలతో హఠాత్తుగా 'స్వదేశీ' నినాదం గుర్తొచ్చింది. నిజానికి మేకిన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ పథకాలకు తూట్లు పొడిచింది కూడా మోదీ ప్రభుత్వమే. అందుకే, మోదీ ప్రభుత్వ హయాంలో 7 లక్షల కంపెనీలు మూతబడ్డాయి. మోదీ ఓటు బ్యాంకు రాజకీయాలు కూడా స్వదేశీ పరిశ్రమలను, ఇక్కడి యువతకు ఉపాధి అవకాశాలు రాకుండా చేశాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కక్షపూరిత నిర్ణయాలతో అన్నిరకాల మౌలిక వసతులు కలిగిన తెలంగాణకు ఐటీఐఆర్ దూరమైంది. హైదరాబాద్-బెంగళూరు మార్గంలో రక్షణ కారిడార్ ప్రతిపాదనకూ మోకాలడ్డిన మోదీ ప్రభుత్వం.. బీజేపీపాలిత యూపీలోని బుందేల్‌ఖండ్‌కు దాన్ని తరలించింది. ఎకో సిస్టమ్ సరిగ్గాలేని అక్కడ కారిడార్‌ను ఏర్పాటు చేయడంపై పారిశ్రామిక నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇక, బీజేపీపాలిత రాష్ట్రాలపై మోదీ చూపిన పక్షపాతంతో శాంసంగ్ వంటి కంపెనీలు ఇండియాలో సెంటర్లను తెరువడానికే వెనుకాముందు ఆలోచించాయి. చైనా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్ దేశాల్లాగా సాంకేతికతలో స్వావలంబన సాధించడంలో వెనుకబడ్డారు. అగ్రరాజ్యంపైనే పూర్తిగా ఆధారపడే విధానాలను అవలంబించారు. అలా మొత్తంగా మోదీ ప్రభుత్వ విధానాలతో అటు విదేశాల్లోనూ.. ఇటూ స్వదేశంలోనూ భారతీయులకు ఉద్యోగాలు మృగ్యమయ్యే దుస్థితి దాపురించింది.

- అమెరికా దౌత్య విధానంలో మోదీ సర్కారు ఫెయిల్
- తొలుత ట్రంప్‌తో చెట్టాపట్టాల్.. ఎన్నికల్లో ప్రచారం
- అలాంటి పనులు తగవంటూ అప్పుడే కేసీఆర్ హెచ్చరిక
- రాజకీయవేత్తలు, నిపుణుల సలహాలనూ పక్కనబెట్టిన మోదీ
- ఆ ఎన్నికల్లో ట్రంప్ ఓటమి.. అమెరికా అధ్యక్షుడైన బైడెన్
- ట్రంప్‌ను కాదని బైడెన్‌తో సాన్నిహిత్యం పెంచుకొన్న మోదీ
- విదేశాలపై ఆధారపడుతూ.. 'మేకిన్ ఇండియా'కు తూట్లు
- ఓటు బ్యాంకు పాలిటిక్స్ కోసం దక్షిణాది రాష్ట్రాలకూ అన్యాయం
- ఐటీఐఆర్, డిఫెన్స్ కారిడార్ విషయంలో తెలంగాణకు ద్రోహం
- అమెరికాలో మళ్లీ అధికారంలోకి ట్రంప్.. భారత్‌పై ఆంక్షల మోత
- తాజాగా హెచ్-1బీ వీసా రుసుమును పెంచుతూ నిర్ణయం
- భారత ఉద్యోగులపై పెను ప్రభావం.. ఎక్కువ నష్టం తెలుగువారికే
- విదేశాల్లో, స్వదేశంలో ఉద్యోగాలు లేక ఇండియన్స్ ఇబ్బంది
- మోదీ విధానాల్లో వైఫల్యమేనంటూ నెటిజన్ల పోస్టులు, కామెంట్లు



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): సుంకాలు, అక్రమ వలసల పేరిట ఇప్పటికే భారత్‌పై కఠిన ఆంక్షలను తెచ్చిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇప్పుడు హెచ్-1బీ వీసాల దరఖాస్తు రుసుమును ఏకంగా లక్ష డాలర్లకు పెంచారు. తాజా నిర్ణయం భారతీయ టెకీలపై పెను ప్రభావం చూపుతుందని పారిశ్రామిక రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా హెచ్-1బీ వీసాతో అమెరికాలో ఉద్యోగం చేస్తున్న తెలుగు రాష్ట్రాలకు చెందిన వారికి గడ్డు పరిస్థితులేనని చెప్తున్నారు. మోదీ ప్రభుత్వ దౌత్య వైఫల్యమే దీనికి కారణంగా రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ట్రంప్, బైడెన్ విషయంలో మోదీ ద్వంద్వ వైఖరి, చైనా, రష్యాతో మరింత సాన్నిహిత్యమే కొంపముంచిందని విశ్లేషిస్తున్నారు.

ట్రంప్‌కు ప్రచార కార్యకర్తగా..

అమెరికా దౌత్యంలో తొలి నుంచీ ప్రధాని మోదీ వ్యవహరిస్తున్న తీరు సరైనది కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఓ దేశానికి ప్రధాని అన్న విషయాన్ని మరిచిపోయి.. 2019లో అధ్యక్ష ఎన్నికల సమయంలో ట్రంప్‌నకు మోదీ ప్రచారం చేశారు. దీనిపై అప్పటి తెలంగాణ సీఎం కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. అమెరికా వంటి అగ్రరాజ్యం ఎన్నికల విషయంలో జోక్యం మంచిది కాదని, అవేమైనా మోదీ స్వరాష్ట్రం గుజరాత్‌లోని అహ్మదాబాద్ కార్పొరేషన్ ఎన్నికలా? అంటూ గట్టిగానే చురకలు అంటించారు. 'ప్రపంచంలో ఏ అధినేత చేయని విధంగా మోదీ తన తెలివి తక్కువ తనంతో అమెరికా ఎన్నికల్లో తలదూర్చారు. 'అబ్ కీ బార్.. ట్రంప్ సర్కార్' అంటూ ట్రంప్‌నకు మద్దతిస్తూ ప్రచారాన్ని ఊదరగొట్టారు. చివరకు ఏమైంది? 2019 ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయారు. అవేమైనా అహ్మదాబాద్ కార్పొరేషన్ ఎన్నికలు అనుకొన్నారా? మోదీ చేసిన పనికి ఇప్పుడు భారత్ ఎటు పోవాలి? మోదీ చేష్టలతో అంతర్జాతీయ స్థాయిలో భారత్ ప్రతిష్ఠ దిగజారింది. దీనికి దేశ ప్రజలకు మోదీ క్షమాపణలు చెప్పాల్సిందే' అని 2022లో నవంబర్ 2న జలవిహార్‌లో జరిగిన సభలో విమర్శించారు. అయినప్పటికీ, మోదీ వైఖరి మారలేదు.

ట్రంప్ ఓడిపోగానే.. బైడెన్‌తో

2019 అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓటమి పాలయ్యారు. దీంతో అప్పటివరకూ ఆప్త మిత్రుడిగా ప్రచారం చేసుకొన్న ట్రంప్‌ను పక్కనబెట్టిన మోదీ.. బైడెన్‌కు దగ్గరయ్యారు. ఇది ట్రంప్ పరివారానికి రుచించలేదు. ఇదే సమయంలో స్వదేశీ పరిశ్రమలకు ఊతమిచ్చేలా అప్పటికే తీసుకొచ్చిన 'మేకిన్ ఇండియా', 'ఆత్మనిర్భర్ భారత్' వంటి పథకాలను మోదీ సర్కారు గాలికొదిలేసింది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు లేకపోవడంతో మోదీహయాంలో గడిచిన 11 ఏండ్లలో 7 లక్షల కంపెనీలు మూతబడ్డాయి. స్వదేశంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో అమెరికా వంటి విదేశాలకు యువత క్యూకట్టింది. మోదీ వైఖరి విషయంలో అప్పటికే గుర్రుగా ఉన్న ట్రంప్.. రెండోసారి అధికారంలోకి రాగానే 'అమెరికా ఫస్ట్', 'మేక్ అమెరికా గ్రేట్ అగైన్' నినాదాల పేరిట భారత్ సహా విదేశాలపై సుంకాల పేరిట వాతను పెట్టారు. అక్రమ వలసల కట్టడి పేరిట వేలాదిమంది భారతీయులను గొలుసులతో కట్టి మరీ స్వదేశానికి పంపించి వేశారు. ఉక్రెయిన్‌తో ఏండ్లుగా యుద్ధం చేస్తున్న రష్యా చమురును కొనుగోలు చేస్తున్నారన్న సాకుతో భారత్‌పై సుంకాలను 50 శాతానికి పెంచారు. అయితే, ట్రంప్ సర్కారు ఆంక్షలను దౌత్య పరమైన విధానాలతో తగ్గించాల్సిన మోదీ ప్రభుత్వం.. గల్వాన్ ఘటనను మరిచిపోయి చైనాతో జట్టుకట్టింది. రష్యాతో మరింత సాన్నిహిత్యాన్ని పెంచుకొన్నది. బ్రిక్స్ సదస్సు అగ్గికి ఆజ్యంపోసినట్టు మారింది. ఈ క్రమంలోనే ట్రంప్ భారతీయ టెక్ నిపుణులకు కీలకమైన హెచ్-1బీ వీసాల రుసుమును ఏకంగా లక్షకు పెంచినట్టు విశ్లేషకులు చెప్తున్నారు.

జీడీపీపైనే ప్రభావం

దేశ జీడీపీలో సర్వీస్ సెక్టార్‌దే కీలకపాత్ర. ఇందులో ఐటీ, ఐటీఈఎస్, బీపీవో వంటి టెక్ సేవలదే అగ్రస్థానం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో భారత ఐటీ ఎగుమతుల విలువ 200 బిలియన్ డాలర్లను దాటింది. రెమిటెన్స్ (విదేశాల్లోని భారతీయులు స్వదేశానికి పంపే మొత్తం) రూపంలో ఎక్కువ ద్రవ్యాన్ని అందుకొంటున్న దేశం కూడా భారతే. 2024లో రికార్డు స్థాయిలో 135.4 బిలియన్ డాలర్ల రెమిటెన్స్ వచ్చింది. ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకంగా మారింది. దేశంలోని రియల్ ఎస్టేట్, స్టార్టప్‌లలో పెట్టుబడులు, వ్యాపార కార్యకలాపాలకు దీన్నే చోదకశక్తిగా చెప్తారు. ఇప్పుడు ట్రంప్ తీసుకొన్న వీసా ఫీజు పెంపు నిర్ణయంతో దేశీయ టెక్ రంగంపై, ఉద్యోగులపై నీలినీడలు కమ్మాయి. ఇది అంతిమంగా జీడీపీ మీదనే ప్రభావం చూపే పరిస్థితులు దాపురించాయి.

ఓటు బ్యాంకు రాజకీయాలు

మౌలిక వసతులు సరిగ్గా లేనప్పటికీ బీజేపీ పాలిత రాష్ట్రాలకు కంపెనీలను కట్టబెట్టి, తెలంగాణ వంటి దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రం మొండి చెయ్యి చూయించింది. 2013లో మంజూరు చేసిన ఐటీఐఆర్‌ను రద్దు చేసింది. దీంతో తెలంగాణకు రూ.2 లక్షల కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. అంతేకాదు.. ప్రత్యక్షంగా, పరోక్షంగా 70 లక్షల మంది ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోయారు. ఇక, హైదరాబాద్-బెంగళూరు మార్గంలో రక్షణ కారిడార్ ఏర్పాటు చేయాలని గతంలో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రులు ఢిల్లీకి వెళ్లి అనేకమార్లు వినతులు చేసినా పక్కన పడేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ రంగాల్లో తెలంగాణకు ఉన్న అనుకూలతలను వివరించినా పెడచెవిన పెట్టారు. చివరికి మోదీ ప్రభుత్వం తాజాగా బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌కు డిఫెన్స్ కారిడార్‌ను మంజూరు చేసింది. ఇదే కారిడార్‌ను తెలంగాణకు మంజూరు చేస్తే ఇక్కడి ఎకోసిస్టమ్ ఆధారంగా అంతకన్నా రెట్టింపు ఫలితం కనిపించేదని పారిశ్రామిక నిపుణులు చెప్తున్నారు. యూపీఏ ప్రభుత్వం హయాంలో హైదరాబాద్‌కు నేషనల్ డిజైన్ సెంటర్ (ఎన్‌డీసీ) మంజూరయ్యింది. అయితే రాష్ట్ర విభజన నేపథ్యంలో ఎన్‌డీసీని ఏపీకి తరలించారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు కూడా నేషనల్ డిజైన్ సెంటర్‌ను (ఎన్‌డీసీ) మంజూరు చేయాలని 11 ఏండ్లుగా కోరుతున్నా బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. వస్త్ర పరిశ్రమకు సంబంధించి రాష్ట్రంలో ఉన్న వనరులు, ఎన్‌డీసీ ఏర్పాటు ఆవశ్యకతను కేసీఆర్ ప్రభుత్వం అనేకసార్లు కేంద్ర ప్రభుత్వానికి విన్నవించినా పెడచెవిన పెట్టింది. మోదీ ప్రభుత్వ ఓటు బ్యాంకు రాజకీయాలతో స్వదేశీ పరిశ్రమలు, వనరులు, ఉపాధి అవకాశాలు పనికిరాకుండా మారాయి.

అగ్రరాజ్యం ఏటా జారీ చేసే హెచ్-1బీ వీసాల్లో 72 శాతం వాటా భారతీయులదే. ఇందులో జారీ అయ్యే ప్రతీ మూడు వీసాల్లో ఒక వీసా తెలుగు రాష్ట్రాలకు చెందిన టెక్ నిపుణులకే లభిస్తున్నదని గణాంకాలు చెప్తున్నాయి. ట్రంప్ తాజా వీసా నిర్ణయంతో భారతీయులను అక్కడి కంపెనీలు రిక్రూట్ చేసుకోవడం తగ్గిస్తాయని నిపుణులు అంటున్నారు. దీంతో ఆఫ్‌షోర్ ప్రాజెక్టులకు గండిపడొచ్చని చెప్తున్నారు.

టెక్నాలజీ అక్కడ.. టాలెంట్ ఇక్కడ

నైపుణ్యం గల విదేశీ నిపుణులను నియమించుకోవడం కోసం తీసుకొచ్చిన నాన్-ఇమ్మిగ్రెండ్ వీసానే హెచ్-1బీ. ఈ రకం వీసాదారుల్లో ఇండియన్ ఉద్యోగులదే 72 శాతం వాటాగా ఉన్నది. అంటే, నైపుణ్యం కలిగిన ఇండియన్స్‌ను టెక్నాలజీ హబ్‌లుగా పిలిచే అమెరికన్ కంపెనీలు నియమించుకోవడానికి ఈ వీసాలు సాయపడేవి. ట్రంప్ తాజా నిర్ణయంతో ఈ టెక్నాలజీ-టాలెంట్ లింక్ తెగిపోయే ప్రమాదం ఏర్పడిందని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

లోతులను అర్థం చేసుకోలేకనే..

హెచ్1-బీ వీసా నాన్-ఇమ్మిగ్రేంట్ వీసా. అంటే పరిమిత కాలంపాటు అమెరికాలో పనిచేసిన తర్వాత ఆ దేశాన్ని విడిచిపెట్టాల్సిందే. అయితే, ఈ విషయాన్ని లోతుగా అర్థంచేసుకోవడంలో అటు ప్రభుత్వాలు, ఇటు పౌరులు వెనుకబడటంతోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయని విశ్లేషకులు అంటున్నారు. అమెరికాలో శాశ్వత నివాసాన్ని కల్పించే గ్రీన్‌కార్డు కోసం ఈ వీసాను కొందరు వాడుకొంటున్నారని చెప్తున్నారు. దీన్ని అడ్డుకొనేందుకే ట్రంప్ తాజాగా ఫీజు పెంచారని వారంటున్నారు.

కాలంతో మారలేకనే..

స్వావలంబన పేరిట 'ఆత్మనిర్భర్ భారత్', 'మేకిన్ ఇండియా' వంటి పథకాలను తీసుకొచ్చిన మోదీ ప్రభుత్వం చేతల్లో మాత్రం అదేమీ చేయలేదు. అందుకే, సాంకేతిక, ఐటీ రంగంలో ఇప్పటికీ భారత్.. అమెరికా వంటి పాశ్చాత్య దేశాలమీదనే ఆధారపడాల్సి వస్తున్నది. అయితే, ప్రపంచీకరణ, మారుతున్న టెక్నాలజీ, అంతర్జాతీయ పరిణామాలను బేరీజు వేసుకొన్న చైనా, దక్షిణ కొరియా, ఫిలిప్పీన్స్ తదితర దేశాలు కాలంతో మారుతూ సొంత సాంకేతికతను, వ్యవస్థలను ఏర్పాటు చేసుకొన్నాయి.

పోఖ్రాన్-2 అప్పుడు అలా..

1998లో పోఖ్రాన్‌లో అణు పరీక్షలపై ఆగ్రహించిన అమెరికా భారత్‌పై కఠిన ఆంక్షలు విధించింది. ఈ క్రమంలో అప్పటి విదేశాంగ శాఖ మంత్రి జశ్వంత్ సింగ్.. అమెరికాకు డిప్యూటీ సెక్రటరీ ఆఫ్ స్టేట్‌గా వ్యవహరిస్తున్న స్ట్రోబ్ టాల్‌బోట్‌తో 11 దఫాల్లో చర్చలు జరిపారు. సున్నితంగా పరిస్థితులను వివరించారు. దీంతో ఈ అంశం కొంతకాలానికి సద్దుమణిగింది. అయితే, ట్రంప్ నిర్ణయాలపై మోదీ ప్రభుత్వం అలా వ్యవహరించలేదని నెటిజన్లు విమర్శిస్తున్నారు.

డెంగీతో చిన్నారి మృతి!

- పారిశుధ్య లోపమే కారణమంటున్న గ్రామస్థులు
- రంగారెడ్డి జిల్లా ఎస్బీ పల్లిలో ఘటన

కొత్తూరు, సెప్టెంబర్ 20: డెంగీతో చిన్నారి మృతి చెందిన ఘటన రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలంలోని ఎస్బీపల్లిలో చోటుచేసుకున్నది. తల్లిదండ్రులు, గ్రామస్థుల వివరాల ప్రకారం.. పర్తపు రమేశ్‌కు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. రెండో కూతురు వాసుప్రియ(8)కు జ్వరం రావడంతో ఎస్‌బీపల్లికి పక్కనే ఉన్న కోళ్లపడకల్‌లో ఆర్‌ఎంపీ డాక్టర్ వద్దకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. వాసుప్రియ ఇంటి పరిసర ప్రాంతాల్లో చెట్లు, చెదారం ఉండటం, గ్రామంలో పారిశుధ్యం లోపించడం వల్లే డెంగీ వచ్చిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.



వాసుప్రియ (ఫైల్)

ఏదో శక్తి పిలుస్తున్నదంటూ..
చెరువులో దూకి ఆత్మహత్య

యాదాద్రి జిల్లా బీబీనగర్‌లో విషాదం

బీబీనగర్, సెప్టెంబర్ 20 : తనను పది రోజులుగా ఏదో శక్తి రావాలని పిలుస్తున్నదంటూ ఓ వ్యక్తి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌లో శనివారం చోటుచేసుకున్నది. స్థానికుల వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా రాంనగర్‌కు చెందిన బర్ల సురేందర్ (36) హైటెక్ సిటీలోని ఓ ప్రైవేట్ బ్యాంకులో పనిచేస్తున్నాడు. రామంతాపూర్‌లోని డీమార్ట్ వెనుక ప్రాంతంలో భార్యాపిల్లలతో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం ఉదయం డ్యూటీకని చెప్పి బయలుదేరి క్యాబ్ బుక్ చేసుకుని బీబీనగర్ పెద్ద చెరువు ఆవరణలోకి చేరుకున్నాడు. చెరువు వద్దకు రాగానే తన భార్యకు, కుటుంబ సభ్యుల ఫోన్లకు మెసేజ్ పెట్టాడు. 'నాకు నిత్యం కలలో చావు రమ్మంటున్నది. ఏదో శక్తి పిలుస్తున్నది. పీడ కలలు వస్తున్నాయి. ఎవరో పిలుస్తున్నట్టు అనేక రకాలుగా కలలు వస్తున్నాయి. నేను చెరువులో దూకి చనిపోతున్నా. నాకు పాత ఇంట్లో చావు కార్యక్రమాలు చేయాలి. నా చావుకు ఎవరూ కారణం కాదు అని వాయిస్ రికార్డు చేసి పంపించాడు. ఆ తరువాత చెరువు గట్టుపై షూ విప్పి, సెల్ ఫోన్ పక్కనపెట్టి చెరువులో దూకాడు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ టీం గాలింపు చర్యలు చేపట్టారు. సురేందర్‌కు భార్య, ఐదేండ్ల కుమారుడు ఉన్నాడు.



సురేందర్ (ఫైల్)

మానసిక స్థితి సరిగా లేక..

సురేందర్ మానసిక స్థితి సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఇటీవల పలు దేవాలయాలకు తీసుకెళ్లినట్టు చెప్పారు. మానసికస్థితి మెరుగు కావడంతో ఇక నుంచి ఉద్యోగానికి వెళ్తానని చెప్పడంతో అనుమతిచ్చినట్టు పేర్కొన్నారు. నాలుగు రోజులుగా డ్యూటీకి సక్రమంగా వెళ్తున్న సురేందర్ శుక్రవారం ఉదయం కూడా డ్యూటీకి వెళ్తున్నట్టు చెప్పి క్యాబ్ బుక్ చేసుకున్నట్టు వారు తెలిపారు.

భర్త చెరువులో దూకాడని..

ఘటనా స్థలానికి చేరుకున్న సురేందర్ భార్య సంధ్యారాణి కూడా చెరువులో దూకింది. అప్రమత్తమైన పోలీసులు, రెస్క్యూ టీం సభ్యులు ఆమెను వెంటనే కాపాడారు. చెరువులో దూకిన సంధ్యారాణి వద్దకు వెళ్లిన కుమారుడు.. 'అమ్మా నువ్వు చనిపోవద్దు' అనడంతో ఒక్కసారిగా కుటుంబ సభ్యులంతా రోదించారు. కాగా ముమ్మరంగా గాలించి శనివారం ఉదయం సురేందర్ మృతదేహాన్ని బయటకు తీశారు.

కేఎల్ యూనివర్సిటీకి ఎడ్యుస్కిల్ అవార్డు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : కేఎల్ డీమ్డ్ టూ బీ యూనివర్సిటీ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఎడ్యుస్కిల్ అవార్డును కైవసం చేసుకుంది. తెలంగాణ, ఏపీ క్యాంపస్‌లు సౌత్ సెంట్రల్‌జోన్‌లో బెస్ట్ ఫర్ఫార్మింగ్ క్యాంపస్‌లుగా ఎంపికయ్యాయి. ఇటీవల సిమ్లాలో జరిగిన కార్యక్రమంలో యూనివర్సిటీ ప్రతినిధులు రామకృష్ణ, వరప్రసాద్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా చాన్స్‌లర్ కోనేరు సత్యనారాయణ హర్షం వ్యక్తంచేశారు.

కొత్త జిల్లాల్లో కోర్టు భవనాలు నిర్మించాలి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శనివారం భేటీ అయ్యారు. జూబ్లీహిల్స్‌లోని ఎంసీఆర్‌హెచ్చార్డీలో జరిగిన ఈ భేటీలో.. కొత్త జిల్లాలో కోర్టుభవనాలు, మౌలిక వసతుల కల్పన, సిబ్బంది నియామకాలు చేపట్టాలని ఈ సందర్భంగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సూచించారు. ఈ అంశాలకు సంబంధించిన పలు ప్రతిపాదనలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించారు. భేటీలో జస్టిస్ సామ్‌కోసి, జస్టిస్ అభినంద్‌కుమార్‌శావిలి, సీఎస్ రామకృష్ణారావు, అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



ఎంసీఆర్‌హెచ్చార్డీలో చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం రేవంత్

సమన్వయంతో ముందుకుసాగండి

గురుకుల సిబ్బందికి మంత్రి అడ్లూరి ఆదేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): అన్ని గురుకుల సొసైటీల అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని, లోపాలకు తావివ్వకూడదని ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ మైనార్టీ గురుకులాలు, ఆశ్రమ పాఠశాలలపై సంబంధిత సొసైటీల అధికారులతో సచివాలయంలో శనివారం ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. అన్ని వెల్ఫేర్ సొసైటీలు, శాఖలు కలిసి సమగ్రమైన నివేదికను సిద్ధం చేసి సమర్పించాలని ఆదేశించారు. మైనార్టీ గురుకులాల్లో ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల వేతనాల కోత కేవలం సాంకేతిక సమస్య మాత్రమేనని, దానిని పరిష్కరించి సవరించామని వెల్లడించారు. సంక్షేమానికి, విద్యకు సంబంధించి బిల్లులను గ్రీన్ చానల్‌లో విడుదల చేస్తామని తెలిపారు. పెండింగ్ సమస్యల పరిష్కార బాధ్యత తనదేనని మంత్రి స్పష్టంచేశారు.

పాత పింఛన్‌ను అమలుచేయండి: స్థితప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ) : జార్ఖండ్ తరహాలో తెలంగాణలోను సీపీఎస్ రద్దుచేసి, పాత పింఛన్ అమలుచేయాలని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్‌ఎంవోపీఎస్) సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. శనివారం జార్ఖండ్ రాజధాని రాంచీలో ఉద్యోగ, ఉపాధ్యాయ కర్మచారి సంపర్క్ మహా సమ్మేళన్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థితప్రజ్ఞ మాట్లాడుతూ.. జార్ఖండ్‌లో సీపీఎస్‌ను రద్దు చేయడంపై హర్షం వ్యక్తంచేశారు. రిటైర్ అయిన సీపీఎస్ ఉద్యోగులకు పెన్షన్ పేమెంట్ ఉత్తర్వులు ఇవ్వడం చారిత్రాత్మకమని తెలిపారు.

సరస్ ఫెయిర్ నుంచి ఎస్‌హెచ్‌జీ స్టాళ్లు ఔట్!

- ఇందిరా మహిళా శక్తి బజార్‌లో 12 స్టాళ్లను బలవంతంగా ఖాళీచేయించిన అధికారులు
- 'మహిళా శక్తి' పథకాన్ని ప్రారంభించి ఏడాది తిరక్కుండానే సెర్ప్, మెప్మా స్టాళ్లు ఖాళీ
- కోటి మందిని కోటీశ్వరులుగా చేస్తామంటూనే మహిళలను బజారున పడేస్తున్న రేవంత్ సర్కారు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. నోటితో నవ్వుతూ నొసటితో వెక్కిరించేలా వ్యవహరిస్తున్నది. స్వయం సహాయక బృందాల (ఎస్‌ఎహెచ్‌జీ) మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని గొప్పలు చెప్తూనే, మరోవైపు వారిని బజారున పడేస్తున్నది. అందులో భాగంగా హైదరాబాద్ హైటెక్ సిటీ సమీపంలోని శిల్పారామం పక్కన ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఏర్పాటు చేసుకున్న స్టాళ్లను అధికారులు ఖాళీ చేయించారు. బాధితులు సమయం కావాలని వేడుకున్నా వినకుండా బలవంతంగా బయటకు పంపించేశారు. శిల్పారామంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో మొత్తం 106 స్టాళ్లు ఉన్నాయి. సీఎం రేవంత్‌రెడ్డి అక్కడ నిరుడు డిసెంబర్ 5న 'మహిళా శక్తి' పథకాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. రాష్ట్రంలోని ఎస్‌హెచ్‌జీ మహిళల ఆర్థికాభ్యున్నతికి సంపూర్ణ తోడ్పాటు అందిస్తామని, తద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని గొప్పగా చెప్పారు. అందులో భాగంగా ఎస్‌ఎహెచ్‌జీ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను విక్రయించుకునేందుకు ఇందిరా మహిళా శక్తి బజార్‌లో స్టాళ్లు కేటాయించారు. అంతేకాకుండా హైదరాబాద్‌తోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ ఎస్‌హెచ్‌జీ మహిళలు స్టాళ్లను ఏర్పాటుచేసుకొని తమ ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ఎస్‌హెచ్‌జీ మహిళలు తయారు చేసిన చేనేత, హస్తకళలు, ఇతర ఉత్పత్తుల ప్రదర్శన, అమ్మకాల కోసం స్టాళ్లను ఏర్పాటు చేయించారు. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ శుక్రవారం అకస్మాత్తుగా పరిస్థితి మారిపోయింది. ఇందిరా మహిళా శక్తి బజార్‌లో ఎస్‌హెచ్‌జీ మహిళలు ఏర్పాటు చేసుకున్న సుమారు పదికిపైగా స్టాళ్లను అధికారులు శుక్రవారం బలవంతంగా ఖాళీచేయించారు. ఇతర రాష్ట్రాలవారి ఉత్పత్తుల ప్రదర్శన కోసం తెలంగాణ మహిళల స్టాళ్లను తొలగించారు. అక్కడ ఇతర రాష్ట్రాలవారి స్టాళ్లతో ఏర్పాటు చేసిన 'సరస్ మేళా-2025'ను పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క శుక్రవారం అట్టహాసంగా ప్రారంభించారు.



మరిన్ని స్టాళ్లు ఏర్పాటు చేయకుండా..

ఇతర రాష్ట్రాలు, జిల్లాల మహిళలకు సహాయం చేయడానికి తాము వ్యతిరేకం కాదని, అందుకోసం ప్రభుత్వం మరిన్ని స్టాళ్లను ఏర్పాటు చేయకుడా తమ స్టాళ్లను ఖాళీ చేయించడం ఏమిటని ఎస్‌హెచ్‌జీకి చెందిన ఓ మహిళ ప్రశ్నించారు. సెర్ప్ అధికారులు అకస్మాత్తుగా తమ స్టాళ్లను ఖాళీ చేయాలని ఆదేశించారని, లేకుంటే వాటిలోని స్టాక్‌ను రోడ్డు పక్కన పడేస్తామని బెదిరించారని, సమయం కావాలని వేడుకున్నప్పటికీ వారు వినలేదని మరో మహిళ వాపోయారు. గతంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన ఎస్‌హెచ్‌జీ మహిళలకు వసతి, రవాణా, ఆహార సదుపాయాలు కల్పించేవారని, ఇప్పుడు అధికారులు వాటిని అందించడం లేదని మరో మహిళ చెప్పగా.. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మార్చాలన్న చిత్తశుద్ధి రేవంత్‌రెడ్డి సర్కారుకు ఉన్నదా అని మరో మహిళ ప్రశ్నించారు.

పరిపూర్ణ నటుడికి ఫాల్కే పురస్కారం

మలయాళ నట దిగ్గజానికి దాదా సాహెబ్ ఫాల్కే • 2023 సంవత్సరానికి ఎంపిక

మోహన్‌లాల్ అనగానే ఎన్నో అద్భుతమైన పాత్రలు కళ్లముందు కదలాడుతాయి. విలక్షణ పాత్రల ద్వారా నటనకు పర్యాయపదంగా నిలిచిన ఆయన కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వచ్చి చేరింది. భారతీయ సినిమాలో అత్యంత ప్రతిష్టాత్మక దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు మోహన్‌లాల్‌ను వరించింది. 2023వ సంవత్సరానికి గాను ఆయన ఈ అవార్డును అందుకోనున్నారు. భారతీయ సినీ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ చరిత్ర మోహన్‌లాల్‌ది అని కేంద్ర సమాచార, ప్రసారశాఖ ఓ ప్రకటనలో కొనియాడింది. ఈ నెల 23న జరిగే 71వ జాతీయ ఫిల్మ్ అవార్డుల వేడుకలో మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే పురస్కారాన్ని స్వీకరించబోతున్నారు.

మోహన్‌లాల్ అసలు పేరు మోహన్‌లాల్ విశ్వనాథన్ నాయర్. 1960 మే 21న కేరళలోని పతనంతిట్టలో ఆయన జన్మించారు. ఆరో తరగతిలోనే నటనకు శ్రీకారం చుట్టిన లాల్.. ఓ నాటకంలో 90ఏండ్ల వృద్ధుడిగా నటించి వీక్షకుల ప్రశంసలందుకున్నారు. 1978లో స్నేహితులు నిర్మించిన 'తిరణోత్తం' మోహన్‌లాల్ తొలి సినిమా. కానీ ఆ సినిమా విడుదల కాలేదు. 'మంజిల్ విరింజ పూక్కల్'(1980) చిత్రంతో విలన్‌గా ప్రేక్షకులకు పరిచయమయ్యారు మోహన్‌లాల్. ఆ సినిమా గుర్తింపు తెచ్చిపెట్టడంతో.. ప్రారంభంలో ప్రతినాయకునిగా పలు చిత్రాల్లో నటించారు. 1986లో వచ్చిన 'రాజవింటే మకన్' హీరోగా మోహన్‌లాల్‌కు తొలి బ్రేక్. ఆ చిత్రంలో ఆయన పోషించిన అండర్‌వరల్డ్ డాన్ పాత్ర మోహన్‌లాల్‌కు స్టార్ ఇమేజ్‌ని తెచ్చిపెట్టింది. అదే ఏడాది విడుదలైన 'టి.పి.బాలగోపాలన్ ఎం.ఎ' చిత్రంతో ఉత్తమనటుడిగా కేరళ రాష్ట్ర చలనచిత్ర అవార్డును అందుకున్నారు మోహన్‌లాల్. అక్కడ్నుంచి హీరోగా ఆయన ప్రయాణం అప్రతిహతంగా సాగింది. చిత్రం, కిరీడం, కిలుక్కుం, చంద్రలేఖ, నరసింహం, భరతం, దేవాసురం, మణిచిత్రతాళు, కాలాపానీ, యోధ, అభిమన్యు, తన్మాంత్ర, దృశ్యం, పులిమురగన్, లూసిఫర్.. ఎలా చెప్పుకుంటూ పోతే ఎన్నో అద్భుతమైన చిత్రాలు, అత్యద్భుతమైన పాత్రలు మోహన్‌లాల్ కెరీర్‌లో సాక్షాత్కరిస్తాయి.

ఇతర భాషల్లో

మలయాళంలో సూపర్‌స్టార్‌గా ఎదిగిన మోహన్‌లాల్.. ఇతర భాషా చిత్రాల్లోనూ నటుడిగా తనదైన ముద్ర వేశారు. తమిళ రాజకీయ చరిత్ర ఆధారంగా మణిరత్నం తెరకెక్కించిన 'ఇరువర్' చిత్రంలో ఎమ్జీఆర్‌ను పోలిన పాత్ర పోషించారు మోహన్‌లాల్. ఆ సినిమా ఫలితం ఎలావున్నా.. నటుడిగా మాత్రం మోహన్‌లాల్‌ని మరో స్థాయిలో నిలబెట్టింది. ఇక మోహన్‌లాల్ తెలుగులో నటించిన తొలి చిత్రం నందమూరి బాలకృష్ణ 'గాండీవం'(1994). ఆ సినిమాలోని 'గోరువంక వాలగానె గోపురానికి..' పాటలో తళుక్కున మెరిశారు లాల్. ఆ సినిమా వచ్చిన 22ఏండ్ల తర్వాత యేలేటి చంద్రశేఖర్ దర్శకత్వం వహించిన 'మనమంతా'(2016) సినిమాలో తొలిసారి తెలుగులో హీరోగా నటించారాయన. అదే ఏడాది ఎన్టీఆర్ 'జనతా గ్యారేజ్' సినిమాలో అద్భుతమైన పాత్ర పోషించి తెలుగులోనూ అఖండ విజయాన్ని అందుకున్నారు. బాలీవుడ్‌లో మోహన్‌లాల్ తొలి సినిమా రామ్‌గోపాల్‌వర్మ 'కంపెనీ'. ఆ తర్వాత ఆగ్, తేజ్ చిత్రాల్లో నటించారు. కన్నడంలో 'లవ్' సినిమాలో ప్రత్యేక పాత్ర పోషించారు.

రికార్డుల వేటగాడు

దాదాపు నాలుగు దశాబ్దాల నట ప్రస్థానంలో 400పై చిలుకు చిత్రాల్లో నటించారు మోహన్‌లాల్. ఎన్నో శతదినోత్సవాలు, రజతోత్సవాలు, వజ్రోత్సవాలు ఆయన కెరీర్‌లో ఉన్నాయి . కేరళ సినిమా రికార్డుల పరంగా కనీవినీ ఎరుగని చరిత్రను సృష్టించిన కథానాయకుడు మోహన్‌లాల్. మలయాళంలో తొలి వందకోట్ల సినిమా 'పులిమురుగన్'(2016). ఆ సినిమా తెలుగులో 'మన్నెంపులి'గా విడుదలై ఘన విజయాన్ని అందుకుంది. మలయాళంలో తొలి 200కోట్ల సినిమా 'లూసిఫర్'(2019). చిరంజీవి నటించిన 'గాడ్ ఫాదర్' ఈ సినిమా రీమేకే.

జనం మెచ్చిన మహానటుడు

మోహన్‌లాల్‌ను 'ది కంప్లీట్ యాక్టర్' అని ప్రేమతో పిలుస్తుంటారు అభిమానులు. ఆయన కెరీర్‌లో మెమొరబుల్ పాత్రలు ఎన్నో ఉన్నాయి. వాటిలో 'తన్మాత్ర' ఒకటి. అందులో అల్జీమర్ వ్యాధిగ్రస్తుడిగా నటించారాయన. నటుడిగా ఆయన కెరీర్‌లో చెప్పుకోదగ్గ పాత్రల్లో ఇదొకటి. ఇక 'కాలాపానీ'లో అయితే.. లాల్ నటన అనితరసాధ్యం. ఆయన చేసిన తమిళ్ సినిమా 'ఇరువర్' షూటింగ్‌లో, మోహన్‌లాల్ నటిస్తూవుంటే కట్ చెప్పడం మరిచిపోయారట దర్శకుడు మణిరత్నం. ఈ విషయాన్ని ఆయనే స్వయంగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. ఇలా చెప్పుకుంటే ఎన్నో విభిన్నమైన చిత్రాలు. వైవిధ్యమైన పాత్రలు

బహుముఖ ప్రజ్ఞాశాలి

మోహన్‌లాల్ అద్భుతమైన ప్రతిభాశాలి.. బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆయన మహానటుడు మాత్రమే కాదు. నిర్మాత, దర్శకుడు, గాయకుడు కూడా. 'బరోజ్' అనే వైవిధ్యమైన సినిమాకు దర్శకత్వం కూడా వహించారాయన. ప్రణవం ఆర్ట్స్ ఇంటర్నేషనల్ సంస్థ స్థాపించి ఎన్నో చిత్రాలను నిర్మించారు. మోహన్‌లాల్ గొప్ప గాయకుడు. సినిమాల్లోనే కాదు, వేదికలపై కూడా ఆయన పాటలు పాడిన సందర్భాలున్నాయి. ఆయన కుమారుడు ప్రణవ్ మోహన్‌లాల్ ప్రస్తుతం హీరోగా కొనసాగుతున్నారు.



అవార్డుల రారాజు

కెరీర్‌లో అయిదుసార్లు జాతీయ అవార్డులను అందుకున్నారు మోహన్‌లాల్. అందులో ఉత్తమ నటుడిగా రెండు సార్లు, నిర్మాతగా ఒకసారి('వానప్రస్థం' చిత్రానికి), జ్యూరీ విభాగాల్లో రెండు సార్లు అవార్డులను గెలుచుకున్నారు. అలాగే 17 పర్యాయాలు కేరళ రాష్ట్ర అవార్డులు, 11 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు ఆయన కైవసం చేసుకున్నారు. భారతీయ సినిమాకు చేసిన సేవలకు గాను కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మశ్రీ, పద్మభూషణ్ అవార్డులతో సత్కరించింది. ఇవిగాక మరెన్నో అవార్డులు ఆయన కీర్తికిరీటంలో ఉన్నాయి.

600 మంది డ్యాన్సర్లతో మాస్ గీతం



బాలకృష్ణ-బోయపాటి శ్రీను కాంబో అంటే బ్లాక్‌బస్టర్ గ్యారంటీ అన్నది అభిమానుల మాట. ఇప్పటికే హ్యాట్రిక్ హిట్‌ను సొంతం చేసుకున్న ఈ ద్వయం 'అఖండ-2'తో డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురాబోతున్నారు. ఈ డివోషనల్ యాక్షన్ డ్రామా శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. ఈ చిత్రం డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. 'అఖండ' అపూర్వ విజయాన్ని దృష్టిలో పెట్టుకొని ఈ సినిమాపై దర్శకుడు బోయపాటి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, విజువల్స్ మొదలుకొని యాక్షన్ ఘట్టాల వరకు అన్‌కాంప్రమైజ్డ్‌గా తెరకెక్కిస్తున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో 600 డ్యాన్సర్ల బృందంతో మాస్ పాటను తెరకెక్కిస్తున్నారు. భాను మాస్టర్ కొరియోగ్రఫీ అందిస్తున్న ఈ పాట అదిరిపోయే ట్యూన్‌తో ఉర్రూతలూగిస్తుందని చెబుతున్నారు. ఈ గీతానికి తమన్ స్వరకర్త. 'అఖండ'ను మించిన భావోద్వేగాలు, యాక్షన్ హంగులతో అభిమానులకు ఓ పండగలా ఈ సినిమా ఉంటుందని మేకర్స్ తెలిపారు. సంయుక్తమీనన్, ఆది పినిశెట్టి, హర్షాలి మల్హోత్రా తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, రచన-దర్శకత్వం: బోయపాటి శ్రీను.



శివ మళ్లీ వస్తున్నాడు

తెలుగు సినిమా దిశను సమూలంగా మార్చిన సినిమా 'శివ'. తెలుగు సినిమా అంటే 'శివ'కు ముందు 'శివ' తర్వాత.. అని నిస్సంకోచంగా చెప్పొచ్చు. 1989లో విడుదలైన ఈ సినిమా సృష్టించిన చరిత్ర అలాంటిది. దర్శకునిగా రామ్‌గోపాల్‌వర్మ తొలి సినిమా ఇది. తొలి సినిమాతోనే డైరెక్షన్‌కి కొత్త నిర్వచనం చెప్పారు వర్మ. కథానాయకుడిగా అక్కినేని నాగార్జునకు దశాబ్దాలపాటు గుర్తుండిపోయే విజయాన్ని ఇచ్చారు. ప్రస్తుతం రీరిలీజుల ట్రెండ్ నడుస్తున్న నేపథ్యంలో 'శివ' మళ్లీ విడుదల కానుంది. మహానటుడు అక్కినేని నాగేశ్వరరావు 101వ జయంతిని పురస్కరించుకొని నవంబర్ 14న మరోసారి బిగ్ స్క్రీన్‌పైకి ఈ సినిమాను తీసుకురానున్నారు. అత్యాధునిక ఏఐ టెక్నాలజీతో రీ మాస్టర్ చేసి, అడ్వాన్స్ 4K డాల్బీ అట్మాస్‌లోకి మార్చి 'శివ'ను విడుదల చేస్తున్నామని, కథలను ఎప్పటికీ సజీవంగా ఉంచడమే నాన్నగారికి సరైన నివాళి అని అక్కినేని నాగార్జున చెప్పారు.

'కల్కి-2' చిత్రంలో దీపికా పడుకోన్ నటించడం లేదని ఇటీవల నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పుడీ విషయం దేశవ్యాప్తంగా సినీ ప్రేమికులతో పాటు ఫిల్మ్ సర్కిల్స్‌లో హాట్‌టాపిక్‌గా మారింది. 'స్పిరిట్' 'కల్కి-2' వంటి ప్రతిష్టాత్మక చిత్రాల నుంచి దీపికా పడుకోన్‌ను తప్పించడంతో అమె అభిమానులు అసంతృప్తిగా ఉన్నారు. పారితోషికం, పనిగంటల విషయంలో దీపికా పెట్టిన షరతులతో విసుగెత్తిన మేకర్స్ ఆమెను సినిమా నుంచి తప్పించారని ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్నది. ఈ నేపథ్యంలో దీపికా పడుకోన్ తాజా ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ ఆసక్తికరంగా మారింది. ఆమె పరోక్షంగా 'కల్కి-2' గురించి ప్రస్తావించారని నెటిజన్లు భావిస్తున్నారు. షారుఖ్ ఖాన్ నటిస్తున్న 'కింగ్' చిత్రంలో దీపికాను కథానాయికగా ఖరారు చేశారు. వీరిద్దరి కాంబోలో రాబోతున్న ఆరో చిత్రమిది కావడం విశేషం. ఈ నేపథ్యంలోనే దీపికా పడుకోన్ ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. '18 ఏళ్ల క్రితం నా తొలి చిత్రం 'ఓం శాంతి ఓం'లో నటిస్తున్నప్పుడే షారుఖ్‌ఖాన్ నాకు కొన్ని జీవిత పాఠాలు నేర్పించారు. ఒక సినిమా ద్వారా మనం ఏం నేర్చుకున్నాం. ఎవరితో పనిచేశాం అనే విషయాలు సినిమా విజయం కంటే ప్రాధాన్యమైన అంశాలని ఆయన చెప్పారు. ఇప్పటికీ నా ప్రతి నిర్ణయం వెనక ఆ సూత్రాన్నే ఫాలో అవుతున్నా' అని దీపికా చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్ సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. 'కల్కి-2' చిత్ర బృందాన్ని ఉద్దేశించే ఆమె ఈ పోస్ట్ పెట్టిందని వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. 'కల్కి-2' నుంచి దీపికా నిష్క్రమణం తర్వాత దర్శకుడు నాగ్‌అశ్విన్ తన ఎక్స్ ఖాతాలో 'కర్మను ఎవరూ తప్పించుకోలేరు. నీ కర్మను నువ్వు అనుభవించాల్సిందే' అంటూ పోస్ట్ చేశారు. పరోక్షంగా దీపికాను టార్గెట్ చేస్తూ ఆయన ఈ పోస్ట్‌ను పెట్టారని నెటిజన్లు కామెంట్లు చేశారు. ఈ నేపథ్యంలో ఈ వివాదం ఇప్పట్లో సమసిపోయేలా లేదని అభిమానులు చర్చించుకుంటున్నారు.

ఎవరితో పనిచేస్తున్నామనేది చాలా ముఖ్యం!

'కల్కి-2' వివాదంపై దీపికా పరోక్ష వ్యాఖ్యలు



సుకుమార్ కొత్త సినిమా అంటే టెక్నికల్ టీమ్‌ను ఎంచుకోవడం పెద్ద పనేం కాదు. వారెప్పుడూ ఆయనకు సిద్ధంగానే ఉంటారు. ఆర్టిస్టుల ఎంపికే సుకుమార్‌కి పెద్ద పని. 'పుష్ప 2' తర్వాత ఆయన రామ్‌చరణ్‌తో సినిమా చేయనున్నారు. కథను కూడా లాక్ చేసేశారు. ఈ కథలో హీరోయిన్ పాత్ర కీలకమని సమాచారం. ఆ పాత్ర కోసం కృతీ సనన్‌ను తీసుకోవాలనుకుంటున్నారట సుకుమార్. తన కథలో నాయిక పాత్రకు కృతి సనన్ సరిగ్గా సరిపోతుందని సుకుమార్ భావించారట. సాధారణంగా కథానాయికను ఆడిషన్, ఫొటో షూట్ చేసి తీసుకోవడం సుకుమార్ ఆనవాయితీ. కృతీ సనన్ అయితే అలాంటి అవసరం లేకుండానే, నిస్సంకోచంగా తీసుకోవచ్చని సుకుమార్ భావిస్తున్నారట. ఇప్పటికే సుకుమార్‌తో పనిచేసిన అనుభవం కృతి సనన్‌కి ఉంది. మహేశ్ 'వన్' సినిమాలో ఆమే కథానాయిక. ఈ సినిమా ఖరారైతే సుకుమార్ డైరెక్షన్‌లో రెండోసారి నటించినట్టవుతుంది.

సుకుమార్ దర్శకత్వంలో రెండోసారి?



ఫిలిం ఛాంబర్ ఎన్నికలు నిర్వహించాలి



తెలుగు ఫిలిం ఛాంబర్ ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ప్రతాని రామకృష్ణ గౌడ్ ఆధ్వర్యంలో పలువురు నిర్మాతలు శనివారం ఫిలిం ఛాంబర్ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ప్రస్తుతం ఉన్న ఛాంబర్ పాలక మండలి గడువు పూర్తయినప్పటికీ ఇంకా ఎన్నికలు నిర్వహించడం లేదని నిర్మాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ఎఫ్‌డీసీ ఛైర్మన్‌తో పాటు సంబంధిత అధికారులకు అనేకసార్లు వినతి పత్రం ఇచ్చినా ఫలితం లేదని అన్నారు. సినీ రంగంలో అనేక సమస్యలు ఉన్నాయని, అవన్నీ పరిష్కారం కావాలంటే రెగ్యులర్ కమిటీ ఉండాలని చెప్పారు. ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నదని, ఎన్నికలు నిర్వహించే వరకు ఈ పోరాటం ఆగదని దర్శకనిర్మాత ఆర్.కె.గౌడ్ హెచ్చరించారు. ఇదే ధర్నాలో చిత్రపురి కాలనీలో జరిగిన అవకతవకలపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మోహన్‌గౌడ్, గురురాజ్, మద్దినేని రమేష్, వింజమూరి మధు, కస్తూరి శ్రీను, ఫైట్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రవి, శంకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



జీవితం తాలూకు అనిశ్చితిని ఊహించలేమని, అందుకే స్నేహంలో పట్టువిడుపులతో వ్యవహరించాలని, విభేదాలను మనసులో పెట్టుకుంటే చివరకు అంతులేని ఆవేదన మిగులుతుందని తాత్విక ధోరణిలో మాట్లాడింది అగ్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్. అనూహ్యంగా ఈ లోకాన్ని వీడిన తన మిత్రుడి గురించి తలుచుకొని ఆమె ఈ వ్యాఖ్యలు చేసింది. 'నాకో క్లోజ్‌ఫ్రెండ్ ఉండేవాడు. అతనితో ఏవో మనస్పర్థల కారణంగా మాట్లాడటం మానేశాను. అనవసరమైన గొడవలు ఎందుకని అతని మెసేజ్‌లకు కూడా స్పందించేదాన్ని కాదు. ఓసారి అలాగే తను మెసేజ్ చేశాడు. నేను పట్టించుకోలేదు. అయితే రెండు రోజుల తర్వాత అతను చనిపోయాడనే విషయం తెలిసి షాక్‌కి గురయ్యా. మనల్ని ప్రేమించే వాళ్లతో వచ్చే అభిప్రాయభేదాలు ఒక్కోసారి జీవితకాల విషాదాన్ని మిగుల్చుతాయని ఆ సంఘటనతో అర్థమైంది' అంటూ ఉద్వేగానికి గురైంది అనుపమ పరమేశ్వరన్. హారర్ థ్రిల్లర్‌గా రూపొందిన 'కిష్కింధ కాండ' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతున్నది.

జీవితకాలం వెంటాడే విషాదం



ఇట్లు మీ ఎదవ

త్రినాథ్ కఠారి హీరోగా నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'ఇట్లు మీ ఎదవ'. 'వెయ్యేళ్లు ధర్మంగా వర్ధిల్లు' అనేది ఉపశీర్షిక. సాహితీ అవాంచ కథానాయిక. బళ్లారి శంకర్ నిర్మాత. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. ఉప్పెన, పెద్ది చిత్రాల దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమా టైటిల్ గ్లింప్స్‌ని లాంచ్ చేసి చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు అందించారు. తనికెళ్ల భరణి, గోపరాజు రమణ, దేవి ప్రసాద్, మధుమణి, సురభి ప్రభావతి, తాగుబోతు రమేశ్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ చీకటి, సంగీతం: ఆర్.పి.పట్నాయక్, నిర్మాణం: సంజీవని ప్రొడక్షన్స్.

'కింగ్ బుద్ధ' చిత్రంతో హాలీవుడ్‌లోకి..



దర్శకనిర్మాత సత్యారెడ్డి ఓ భారీ బడ్జెట్ చిత్రంతో హాలీవుడ్‌లోకి ప్రవేశించేందుకు సిద్ధమవుతున్నారు. ఇందుకోసం ఆయన పాన్ వరల్డ్ సినిమాస్ పేరుతో ఓ బ్యానర్‌ను స్థాపించారు. హాలీవుడ్ స్థాయిలో నిర్మించే ఈ చిత్రానికి 'కింగ్ బుద్ధ' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. 'సర్దార్ చిన్నపరెడ్డి' చిత్రంతో సినీ జీవితాన్ని ప్రారంభించిన సత్యారెడ్డి దాదాపు 55 చిత్రాలకు దర్శకనిర్మాతగా బాధ్యతలు నిర్వహించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'ఉక్కు సత్యాగ్రహం' అనే చిత్రాన్ని కూడా తెరకెక్కించారు. 'కింగ్ బుద్ధ' సినిమా లొకేషన్ల కోసం ఇప్పటికే అమెరికా, చైనా, టిబెట్, నేపాల్, థాయ్‌లాండ్, సింగపూర్, మలేషియా తదితర దేశాలు పర్యటించానని, ప్రస్తుతం ఈ చిత్రానికి సంబంధించిన నటీనటుల ఎంపిక జరుగుతున్నదని సత్యారెడ్డి తెలిపారు.




బంగ్లా గెలుపు

సూపర్-4లో లంకకు షాక్

దుబాయ్: ఆసియా కప్‌లో సూపర్-4 దశను బంగ్లాదేశ్ విజయంతో ఆరంభించింది. శనివారం శ్రీలంకతో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు.. 4 వికెట్ల తేడాతో విజయం సాధించి గ్రూప్ దశలో లంకేయుల చేతిలో తమకు ఎదురైన పరాభావానికి ప్రతీకారం తీర్చుకుంది. లంక నిర్దేశించిన 169 పరుగుల మోస్తరు లక్ష్యాన్ని బంగ్లా.. 19.5 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. ఓపెనర్ సైఫ్ హసన్ (45 బంతుల్లో 61, 2 ఫోర్లు, 4 సిక్సర్లు)కు తోడు తౌవిద్ హృదయ్ (37 బంతుల్లో 58, 4 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ శతకాలతో విజృంభించి ఆ జట్టుకు విజయాన్ని అందించారు. లంక బౌలర్లలో హసరంగ (2/22) మినహా మిగిలినవారంతా తేలిపోయారు. మొదట బ్యాటింగ్ చేసిన లంక.. నిర్ణీత ఓవర్లలో 168/7 స్కోరు చేసింది. దసున్ శనక (37 బంతుల్లో 64 నాటౌట్, 3 ఫోర్లు, 6 సిక్సులు), కుశాల్ మెండిస్ (34) ధాటిగా ఆడి ఆ జట్టుకు పోరాడే స్కోరును అందించారు. ముస్తాఫిజుర్ (3/20) లంక బ్యాటర్లను కట్టడి చేశాడు.

ఫైనల్స్‌కు సాత్విక్ జోడీ



షెన్‌జెన్ (చైనా): ఇటీవల ముగిసిన బ్యాడ్మింటన్ వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో కాంస్యం సాధించిన ఊపులో ఉన్న భారత డబుల్స్ ద్వయం సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి జోరు కొనసాగుతున్నది. ఈ సీజన్‌లో తొలి టైటిల్ కోసం వేట సాగిస్తున్న ఈ జోడీ.. వరుసగా రెండో ఫైనల్స్‌కు అర్హత సాధించింది. గత వారం హాంకాంగ్ ఓపెన్‌లో ఫైనల్స్ చేరిన ఈ ద్వయం.. తాజాగా చైనా మాస్టర్స్ సూపర్ 750 టోర్నీలోనూ టైటిల్ పోరుకు సిద్ధమైంది. శనివారం జరిగిన పురుషుల డబుల్స్ సెమీస్ పోరులో సాత్విక్-చిరాగ్.. 21-17, 21-14తో మలేషియా జంట ఆరోన్ చియా-సో వుయ్ యిక్‌పై గెలిచింది. 41 నిమిషాల పాటు సాగిన పోరులో భాగంగా సాత్విక్ ద్వయం తొలి గేమ్‌లో 10-7తో వెనుకబడ్డా మలేషియా జోడీ చేసిన తప్పిదాలను తమకు అనుకూలంగా మలుచుకుని 18-14తో ఆధిక్యంలోకి వెళ్లింది. వరుసగా 4 పాయింట్లు సాధించడంతో ఆ గేమ్‌ను గెలుచుకుంది. రెండో గేమ్‌లో దూకుడు పెంచిన ఈ జోడీ.. ఆరంభం నుంచే వేగంగా ఆడుతూ 8-2 ఆధిక్యాన్ని సాధించింది. స్కోరు 15-9తో ఉండగా మలేషియా ఆటగాళ్లు పుంజుకునే యత్నం చేసి 16-12కు వచ్చినా సాత్విక్ తనదైన స్మాష్‌లతో వారికి అడ్డుకట్ట వేసి మ్యాచ్‌ను ముగించాడు.


హర్యానాకు ఆరో విజయం

జైపూర్: ప్రో కబడ్డీ లీగ్ (పీకేఎల్)లో డిఫెండింగ్ చాంపియన్స్ హర్యానా స్టీలర్స్ జోరు కొనసాగుతున్నది. శనివారం ఇక్కడ జరిగిన పోరులో ఆ జట్టు.. 38-36తో తమిళ్ తలైవాస్‌పై ఉత్కంఠ విజయాన్ని అందుకుంది. హర్యానా తరఫున రైడర్లు శివమ్ (9 పాయింట్లు), వినయ్ (7) రాణించారు. తలైవాస్ సారథి అర్జున్ దేశ్వాల్ (13 పాయింట్లు) ఒంటరిపోరాటం వృథా అయింది. ఈ టోర్నీలో హర్యానాకు ఇది ఆడిన 8 మ్యాచ్‌లలో ఆరో విజయం కాగా తమిళ జట్టుకు 4వ పరాభవం. మరో మ్యాచ్‌లో పాట్నా పైరేట్స్.. 33-30తో దబాంగ్ ఢిల్లీకి షాకిచ్చింది. పాయింట్ల పట్టికలో పుణెరి పల్టన్ 12 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా అన్నే పాయింట్లు కల్గిన ఢిల్లీ, హర్యానా వరుసగా రెండు, మూడు స్థానాల్లో నిలిచాయి.

పోరాడినా..

- భారత మహిళల జట్టుకు ఓటమి
- మంధాన రికార్డు శతకం
- ఆస్ట్రేలియాదే వన్డే సిరీస్





ఢిల్లీ: స్వదేశంలో ఆస్ట్రేలియాపై తొలి వన్డే సిరీస్ నెగ్గాలన్న భారత మహిళల జట్టుకు నిరాశ తప్పలేదు. ప్రత్యర్థి 413 పరుగుల కొండంత లక్ష్యాన్ని తమ ముందుంచినా ఆఖరివరకూ పోరాడిన ఉమెన్ ఇన్ బ్లూ.. 369 రన్స్ వద్ద ఆగిపోయి 43 పరుగుల తేడాతో అపజయం వైపు నిలిచింది. ఆసీస్ మ్యాచ్‌తో పాటు 2-1తో సిరీస్‌నూ కైవసం చేసుకుంది. ఇరుజట్ల బ్యాటర్లు పోటాపోటీగా బంతిని బాదినా.. చివరికి విజయం ఆస్ట్రేలియానే వరించింది. శనివారం ఢిల్లీ వేదికగా హోరాహోరీగా సాగిన మూడో వన్డేలో మొదట బ్యాటింగ్ చేసిన ఆస్ట్రేలియా.. బెత్ మూనీ (75 బంతుల్లో 138, 23 ఫోర్లు, 1 సిక్స్) మెరుపు శతకానికి తోడు జార్జియా వోల్ (68 బంతుల్లో 81, 14 ఫోర్లు), ఎల్లీస్ పెర్రీ (72 బంతుల్లో 68, 7 ఫోర్లు, 2 సిక్సులు) హాఫ్ సెంచరీలతో కదంతొక్కడంతో 47.5 ఓవర్లలో 412 పరుగుల రికార్డు స్కోరు చేసింది. వన్డేల్లో ఆ జట్టుకు ఇదే అత్యుత్తమ స్కోరు. 57 బంతుల్లోనే మూనీ శతకం పూర్తైంది. ఆ జట్టు బ్యాటర్లు ఏకంగా 60 బౌండరీలు బాదడంతో భారత బౌలర్లు తేలిపోయారు. అరుంధతి 3 వికెట్లు తీసినా 8.5 ఓవర్లలో 86 రన్స్ సమర్పించుకోగా ఏస్ పేసర్ రేణుకా సింగ్ (9 ఓవర్లలో 79/2) సైతం నిరాశపరిచింది. భారీ ఛేదనలో భారత్ కూడా తక్కువేమీ తిన్లేదు. ఓపెనర్ స్మృతి మంధాన (63 బంతుల్లో 125, 17 ఫోర్లు, 5 సిక్సులు) వరుసగా రెండో శతకంతో మెరువగా దీప్తి శర్మ (58 బంతుల్లో 72, 5 ఫోర్లు, 2 సిక్సులు), హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 52, 8 ఫోర్లు), స్నేహ్ రాణా (35) పోరాడారు. కానీ కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి 47 ఓవర్లలో 369 రన్స్‌కు భారత్ ఆలౌట్ అయింది. మూడో వన్డేలో ఇరుజట్లూ కలిపి 781 పరుగులు చేయడం గమనార్హం. స్మృతికి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్, మూనీకి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించింది.

1 వన్డేల్లో (మెన్స్, ఉమెన్స్) భారత్ తరపున ఫాస్టెస్ట్ సెంచరీ చేసిన బ్యాటర్ మంధాన. గతంలో ఈ రికార్డు కోహ్లీ (52 బంతుల్లో) పేరిట ఉండేది.

2 అంతర్జాతీయ స్థాయిలో వన్డేల్లో మంధానది రెండో వేగవంతమైన శతకం. మెగ్ లానింగ్ (45 బంతుల్లో) తొలి స్థానంలో ఉంది.

భారత్‌కు ఎదురుందా?

నేడు పాకిస్థాన్‌తో రసవత్తర పోరు • ఫుల్ జోష్‌లో టీమ్ఇండియా • రాత్రి 8 గంటల నుంచి సోనీ స్పోర్ట్స్‌లో




దుబాయ్: ఆసియా కప్‌లో మరో రసవత్తర పోరుకు రంగం సిద్ధమైంది. గ్రూప్ దశలో పాకిస్థాన్‌ను చిత్తుగా ఓడించిన టీమ్ఇండియా.. సూపర్-4 దశను దాయాదితోనే మొదలుపెట్టనుంది. ఆదివారం (సెప్టెంబర్ 21) భారత్, పాకిస్థాన్ మధ్య దుబాయ్ ఇంటర్నేషనల్ స్టేడియం వేదికగా జరుగబోయే మ్యాచ్‌లో సూర్యకుమార్ సేన ఫేవరేట్‌గా బరిలోకి దిగనుంది. గత మ్యాచ్‌లో ఆట కంటే ఆటేతర విషయాలతో వివాదాన్ని సృష్టించిన పాకిస్థాన్ నేటి పోరులో అయినా టీమ్ఇండియాకు కనీస పోటీ నిస్తుందా? అనేది ఆసక్తికరం! నేటి పోరులోనూ భారత్.. గత మ్యాచ్‌లో మాదిరిగానే 'నో షేక్ హ్యాండ్' విధానాన్నే అవలంబించనున్నది.

ఆ ఒక్కటి తప్ప..

బలాబలాల పరంగా చూస్తే పాక్ కంటే టీమ్ఇండియా బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్, ఫీల్డింగ్‌లోనూ ఎంతో మెరుగ్గా ఉంది. టాపార్డర్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ ఫుల్ స్వింగ్‌లో ఉండగా గిల్ ఇంకా పూర్తిస్థాయిలో విజృంభించలేకపోతున్నాడు. ఒమన్‌తో పోరులో మూడో స్థానంలో వచ్చిన సంజూ శాంసన్ అర్ధ శతకంతో జోరుమీదున్నాడు. సారథి సూర్య, తిలక్ వర్మ సైతం మంచి టచ్‌లో ఉన్నారు. మిడిలార్డర్‌లో హార్దిక్, దూబే వంటి హిట్టర్లతో టీమ్ఇండియా బ్యాటింగ్ లైనప్ దుర్భేధ్యంగా ఉంది. బౌలింగ్ విషయానికొస్తే స్పిన్ త్రయం కుల్‌దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్.. స్పిన్‌కు అనుకూలించే యూఏఈ పిచ్‌లపై ప్రత్యర్థులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. మూడు మ్యాచ్‌ల్లో 8 వికెట్లు పడగొట్టిన కుల్‌దీప్ పాక్‌తో గ్రూప్ దశ మ్యాచ్‌లో 3 వికెట్లు తీసి భారత గెలుపులో కీలకపాత్ర పోషించాడు. కానీ ఒమన్‌తో మ్యాచ్‌లో అక్షర్ తలకు గాయమవడం భారత్‌ను ఆందోళనకు గురిచేస్తున్నది. అతడు పాక్‌తో మ్యాచ్‌లో ఆడుతాడా? లేదా? అన్నదానిపై ఇంకా స్పష్టత లేదు. ఒకవేళ అతడికి రెస్ట్ ఇస్తే వాషింగ్టన్ సుందర్‌కు తుది జట్టులో అవకాశం దక్కొచ్చు. బుమ్రా తిరిగి జట్టులోకి రానున్నాడు. హార్దిక్‌తో కలిసి అతడు పేస్ బాధ్యతలను మోయనున్నాడు.

రిఫరీ అతడే..

గ్రూప్ దశలో ఇరుజట్ల మధ్య జరిగిన మ్యాచ్‌కు రిఫరీగా వ్యవహరించిన అండీ పైక్రాఫ్టే ఈ మ్యాచ్‌కూ తన బాధ్యతల్లో కొనసాగనున్నాడు. గత మ్యాచ్ టాస్ సందర్భంగా నెలకొన్న వివాదంతో పాటు టీమ్ఇండియా ఆటగాళ్లు తమకు హ్యాండ్‌షేక్ ఇవ్వకపోవడంతో దానికి పైక్రాఫ్ట్‌ను బాధ్యుడిని చేస్తూ పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అతడిపై ఐసీసీలో ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీనిని ఐసీసీ పట్టించుకోకపోగా పాక్ యూఏఈతో ఆడిన మ్యాచ్‌లోనూ పైక్రాఫ్ట్‌నే రిఫరీగా నియమించింది. తాజాగా దాయాదితో పోరులోనూ మళ్లీ అతడికే బాధ్యతలను అప్పగించడంతో సర్వత్రా ఆసక్తి నెలకొంది. కాగా పైక్రాఫ్ట్‌ను రిఫరీగా నియమించడంతో పాక్.. భారత్‌తో పోరుకు ముందు మీడియా సమావేశాన్ని బహిష్కరించింది.

పసలేని పాక్..

భారత్‌తో పోల్చితే పాక్ పరిస్థితి దారుణంగా ఉంది. టాపార్డర్, మిడిలార్డర్ బ్యాటర్లు చేతులెత్తేస్తున్న వేళ ఆ జట్టును లోయరార్డర్ ఆటగాళ్లు ఆదుకుంటున్నారు. ఓపెనర్ సయిమ్ అయూబ్.. వరుసగా సున్నాలు చుడుతున్నాడు. ఫకర్ జమాన్, వికెట్ కీపర్ మహ్మద్ హరీస్, ఓపెనర్ ఫర్హాన్ ఉన్నంతలో ఫర్వాలేదనిపిస్తున్నారు. అందరికంటే ఎక్కువగా బౌలర్ షాహీన్ షా అఫ్రిది ఆఖర్లో మెరుపులతో ఆ జట్టు గౌరవప్రదమైన స్కోర్లు చేయగలుగుతున్నది. కెప్టెన్ సల్మాన్ అఘా ఈ టోర్నీలో ఇప్పటిదాకా తన మార్కును చూపలేదు. టోర్నీ లో ఆ జట్టు బౌలిం గ్ కూడా నాసిరకంగానే ఉంది. అయూబ్‌తో పాటు అహ్మ ద్, నవాజ్ స్పిన్ త్రయం.. భారత బ్యాటింగ్ లైనప్‌ను ఏ మేరకు అడ్డుకుంటుందో చూడాలి.



సెమీస్‌కు భారత్

కొలంబో: దక్షిణాసియా ఫుట్‌బాల్ సమాఖ్య (సాఫ్) ఆధ్వర్యంలో కొలంబో వేదికగా జరుగుతున్న అండర్-17 చాంపియన్‌షిప్స్‌లో యువ భారత జట్టు సెమీస్‌కు ప్రవేశించింది. ఈ టోర్నీలో భాగంగా శనివారం క్వార్టర్స్‌లో భారత్.. 1-0తో భూటాన్‌పై గెలిచి సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంది. సోమవారం భారత జట్టు సెమీస్‌లో పాక్‌తో తలపడనుంది. భూటాన్‌తో మ్యాచ్‌లో రహాన్ అహ్మద్.. 57వ నిమిషంలో గోల్ చేసి జట్టుకు విజయాన్ని అందించాడు.

ముగిసిన భారత పోరు

జాగ్రెబ్ (క్రొయేషియా): వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్‌లో భారత పోరాటం ముగిసింది. శనివారం జరిగిన గ్రీకో రోమన్ విభాగంలో ముగ్గురు భారత రెజ్లర్లు ఆరంభ రౌండ్లలోనే వెనుదిరిగారు. సన్నీ కుమార్ (63 కిలోలు), అనిల్ (67 కి.), కరణ్ కంబోజ్ (87 కి.) విఫలమయ్యారు. ఈ టోర్నీలో అంతిమ్ పంగాల్ (మహిళల 53 కి.) ఒక్కతే కాంస్యం గెలిచిన విషయం తెలిసిందే.



మలేషియా సదస్సుకు అశోక్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఈనెల 18 నుంచి 20 వరకు మలేషియాలో జరిగిన అంతరర్జాతీయ సదస్సుకు వరంగల్ జిల్లా క్రీడాభివృద్ధి అధికారి గుగులోతు అశోక్ కుమార్ హాజరయ్యారు. 'ఏ కేస్ స్టడీ ఆన్ యాన్ ఎమినెంట్ ఇంటర్నేషనల్ రెజ్లింగ్ స్పోర్ట్స్ పర్సనాలిటీ ఠాకూర్ దేవ్ సింగ్' అనే అంశంపై ఆయన పత్రాన్ని సమర్పించారు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.

● యూరియా కోసం రైతుల రాస్తారోకో



సరిపడా యూరియా అందించాలని కోరుతూ మంచిర్యాల జిల్లా జన్నారం 'మన గ్రోమోర్' షాప్ ఎదుట శనివారం రైతులు రాస్తారోకో చేశారు. గంటపాటు బైఠాయించినా అధికారులు పట్టించుకోలేదు. వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు వచ్చి రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. – జన్నారం

రైతులను నిండా ముంచిన కాంగ్రెస్

ప్రభుత్వ అసమర్థత వల్లే యూరియా కొరత ● మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

పరకాల, సెప్టెంబర్ 20 : మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దేశానికి అన్నంపెట్టే రైతులను నిండా ముంచిందని, సీఎం రేవంత్ అసమర్థ పాలనవల్లే రాష్ట్రంలో యూరియా కొరత ఏర్పడిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజమెత్తారు. హనుమకొండ జిల్లా నడికూడ మండలం పులిగిల్ల గ్రామానికి చెందిన రైతు కల్యాణపు రాజమొగిలి(రవి) శుక్రవారం యూరియా టోకెన్ కోసం మండలంలోని వరికోల్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన రైతు హనుమకొండలోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతుండగా, ఆయనను ధర్మారెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల జీవితాలతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతున్నదని మండిపడ్డారు. ఒక్క యూరియా బస్తా కోసం రైతులు రెండు, మూడు గ్రామాలు తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలను దక్కించుకోవాలనే ఆరాటంతో యూరియా కోసం బయలుదేరిన రైతులు రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రలో ఉందని ధ్వజమెత్తారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏనాడూ ఇలాంటి ఘటనలు జరగలేదన్నారు. రైతులు అధైర్య పడొద్దని, బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.



హనుమకొండలోని ప్రైవేటు దవాఖానలో చికిత్స పొందుతున్న రాజమొగిలిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఆర్టీసీ కార్గోకు వచ్చిన యూరియా బస్తాలు

ఆర్టీసీ కార్గోలో యూరియా

తొర్రూరు, సెప్టెంబర్ 20 : యూరియా బస్తాలు టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ బస్సులో పంపిణీ చేసిన ఘటన మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగింది. హైదరాబాద్ ఘట్‌కేసర్‌కు చెందిన రామావత్ వెంకన్న తన తండ్రి రామావత్ భీమ్లా (సీత్యాతండా, పర్వతగిరి మండలం) కోసం మూడు యూరియా బస్తాలను టీజీఎస్‌ఆర్టీసీ లాజిస్టిక్స్ ద్వారా బస్సులో శనివారం తొర్రూరుకు పంపించాడు. స్థానికంగా యూరియా దొరకకపోవడంతో ఈ పరిస్థితి తలెత్తిందని వెంకన్న తెలిపారు. తన తండ్రి గంటల తరబడి క్యూ లైన్‌లో నిలబడినా యూరియా దొరకలేదు. ఘట్‌కేసర్‌లో తనకు సాగు భూమి ఉండడంతో రైతు సేవ కేంద్రం నుంచి మూడు యూరియా బస్తాలు కొనుగోలు చేసి తన తండ్రికి కార్గో ద్వారా పంపించినట్లు తెలిపారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టీ) మండలం భూపాలపట్నంలో పోలీసులు పట్టుకున్న యూరియా లారీ

దక్కని బస్తాలు..తీరని కష్టాలు

కాంగ్రెస్ పాలనలో అన్నదాతలకు యూరియా కష్టాలు తప్పడం లేదు. సుమారు యాభై రోజులుగా తీవ్ర ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. పొద్దస్తమానం ఎండలో క్యూలో నిలబడినా ఒక్క బస్తా యూరియా దొరకని పరిస్థితి నెలకొన్నది. ఇంత జరుగుతున్నా రేవంత్‌రెడ్డి సర్కారు తనకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నది. దీంతో ప్రభుత్వ తీరుపై రైతులు దుమ్మెత్తిపోస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరి తెచ్చుకుంటే.. ఇదేం ఖర్మరా? అని మదనపడుతున్నారు. కేసీఆర్ ప్రభుత్వం రైతులను ఏ ఇబ్బంది లేకుండా చూసుకున్నదని గుర్తుచేసుకుంటున్నారు. మళ్లీ కేసీఆర్ సారే రావాలని కోరుకుంటున్నారు. – నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

అర్ధరాత్రి యూరియా విక్రయం

లారీని పట్టుకున్న పోలీసులు

సిర్పూర్(టీ), సెప్టెంబర్ 20 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (టీ) మండలం భూపాలపట్నంలో శుక్రవారం అర్ధరాత్రి అక్రమంగా యూరియాను విక్రయిస్తుండగా పోలీసులు పట్టుకుని కాగజ్‌నగర్‌లోని డీఎస్పీ కార్యాలయానికి తరలించారు. సిర్పూర్(టీ) వ్యవసాయశాఖ అధికారి భూక్యా గిరీషన్‌ను వివరణ కోరగా కాగజ్‌నగర్‌లోని కనకదుర్గ ట్రేడింగ్ కంపెనీకి ప్రభుత్వం యూరియా స్టాక్‌ను అలాట్‌మెంట్ చేసిందని తెలిపారు. అక్కడి నుంచి భూపాలపట్నంలోని వెంకటేశ్‌కు చెందిన శ్రీనివాస ఫర్టిలైజర్ షాపునకు తరలించారని చెప్పారు. అధికారులకు సమాచారం ఇవ్వకుండా అక్రమంగా అర్ధరాత్రి షాపు వద్ద యూరియా విక్రయిస్తుండగా సిర్పూర్(టీ) ఎస్‌ఐ సురేశ్ ఆధ్వర్యంలోపోలీసులు పట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఫర్టిలైజర్ షాపులో స్టాక్ సేల్‌ను నిలిపివేస్తున్నట్టు తెలిపారు.



కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం శిర్షా గ్రామంలో ఆంజనేయ ట్రేడర్స్‌లో యూరియాను సీజ్ చేస్తున్న ఏవో ప్రేమలత

రాత్రికి రాత్రే స్టాక్ మాయం

ఒక్కో బస్తా 1200 వరకు అమ్మకం!

అధికారులకు తెలియకుండానే విక్రయాలు ● రెండు ఫర్టిలైజర్ షాపుల్లో 118 బ్యాగులు సీజ్

కౌటాల, సెప్టెంబర్ 20 : కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలో రాత్రికి రాత్రే రెండు లారీల యూరియాను స్టాక్ మాయమైంది. కౌటాల మండలం శిర్షా గ్రామంలోని ఆంజనేయ ట్రేడర్స్, కొండయ్య ట్రేడర్స్ యజమానులు అల్లి తిరుపతి, మల్లేశ్ మంచిర్యాల జాహ్నవి ట్రేడర్స్ నుంచి 266 చొప్పున మొత్తం 532 యూరియా బ్యాగులను రెండు లారీల్లో శుక్రవారం రాత్రి తీసుకువచ్చారు. అధికారులకు సమాచారం ఇవ్వకుండానే ఒక్కో యూరియా బ్యాగుకు రూ.1200 వరకు విక్రయించినట్టు రైతులు ఆరోపించారు. శనివారం ఉదయం మండల వ్యవసాయాధికారిని ప్రేమలత విషయం తెలుసుకొని దుకాణాల యజమానులకు ఫోన్ చేయగా రాత్రే మొత్తం రైతులకు పంపిణీ చేశామని సమాధానం ఇచ్చారు. ఆమె వెంటనే సిబ్బందితో కలిసి దుకాణాల వద్దకు వెళ్లి తనిఖీ చేయగా ఆంజనేయ ట్రేడర్స్‌లో 72, కొండయ్య ట్రేడర్స్‌లో 46 యూరియా బ్యాగులున్నట్టు గుర్తించి ఏడీఏ మనోహర్‌కు సమాచారమిచ్చారు. వాటిని నో సేల్‌కింద రాశారు.



కర్రసాయంతో కట్టల కోసం..

కొణిజర్ల, సెప్టెంబర్ 20 : ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గోపవరం సొసైటీ వద్దకు యూరియా కోసం రైతులతోపాటు 80 ఏళ్ల వృద్ధురాలు సైతం వచ్చింది. శుక్రవారం నుంచి వరుస క్రమంలో పాస్ పుస్తకాలు పెట్టిన రైతులకు శనివారం యూరియా పంపిణీ చేశారు. చేతికర్ర సాయంతో క్యూలో నిల్చున్న వృద్ధురాలు తన సీరియల్ నంబర్ రాకపోవడంతో ఓపిక లేక మెట్లపై కూర్చుంది. తన కొడుకు వరి సాగు చేశారని, యూరియా బస్తా ఒక్కో మనిషికి ఒక్కో కట్టే ఇస్తుండడంతో తాను కూడా రావాల్సి వచ్చిందని వాపోయింది.



నారాయణపేట జిల్లా దామరగిద్ద మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు

వేరుశనగ విత్తనాలకు బారులు

దామరగిద్ద, సెప్టెంబర్ 20: యూరియా బాధలు తీరాయనుకున్న రైతులు విత్తనాల కోసం ఇబ్బంది పడుతున్నారు. శనివారం నారాయణపేట జిల్లా దామరగిద్ద రైతు వేదిక వద్ద వేరుశనగ విత్తనాల కోసం క్యూ కట్టారు. రైతు వేదికకు 1200 బస్తాల విత్తనాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న రైతులు తెల్లవారుజామున 5 గంటలకే చేరుకొని సాయంత్రం 4:30 గంటల వరకు నిరీక్షించారు. అయినా విత్తనాలు పంపిణీ చేయకపోవడంతో చివరకు నిరాశతో వెనుతిరిగారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి: భట్టి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): మహిళల ఆర్థికాభివృద్ధికి కాంగ్రెస్ సర్కారు కృషి చేస్తున్నదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. శనివారం హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, వివేక్‌తో కలిసి స్వయం సహాయక సంఘాలకు రూ.41.51 కోట్ల వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ వడ్డీలేని రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, పార్టీ నేతలు అజారుద్దీన్, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

చికిత్సలో మార్పులు రావాలి: దామోదర

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఒకప్పుడు అంటువ్యాధుల సమస్య ఎక్కువగా ఉండేదని.. ఇప్పుడు జీవనశైలి వ్యాధుల సమస్య ఎక్కువైందని ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహ తెలిపారు. ఆహారపు అలవాట్లు, ఒత్తిడి కారణంగా గ్రామాల్లో సైతం బీపీ, షుగర్, కిడ్నీ, గుండె జబ్బులు, క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని చెప్పారు. ఈ మార్పునకు అనుగుణంగా వైద్య వ్యవస్థలోనూ మార్పులు రావాల్సిన అవసరమున్నదని వెల్లడించారు. రాష్ట్రంలో కొత్త డయాలసిస్ సెంటర్ల ఏర్పాటుపై శనివారం మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవనశైలి వ్యాధుల బారిన పడుతున్న వారికి చికిత్స అందించే విధంగా దవాఖానలు తయారు కావాలని సూచించారు.

నెట్‌వర్క్ దవాఖానలకు అండగా ఉంటాం

ఆరోగ్యశ్రీ సేవలు అందిస్తున్న నెట్‌వర్క్ దవాఖానలకు అండగా ఉంటామని మంత్రి రాజనర్సింహ హామీ ఇచ్చారు. నెట్‌వర్క్ దవాఖానల అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ సమస్యలను వివరించగా సానుకూలంగా స్పందించినట్టు వారు తెలిపారు. ఆరోగ్యశ్రీ సేవలను యథావిధిగా కొనసాగిస్తామని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు.

మెడికల్ కాలేజీల ఫీజు దోపిడీని అరికట్టాలి

రాష్ట్రంలోని ప్రైవేట్ మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఫీజు దోపిడీని కట్టడి చేయాలని తెలంగాణ ఎంబీబీఎస్ 'బీ' క్యాటగిరీ సీట్ల స్థానిక రిజర్వేషన్ సాధన సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం తెలంగాణ ఫీజు రెగ్యులేటరీ కమిటీ చైర్మన్‌కు వినతి పత్రం అందజేసింది. ఈ సందర్భంగా సమితి రాష్ట్ర అధ్యక్షుడు గాదె వెంకట్ మాట్లాడుతూ కాలేజీల యాజమాన్యాలు నాలుగున్నరేండ్ల మెడికల్, డెంటల్ కోర్సులకు ఐదేండ్ల ఫీజును అక్రమంగా వసూలు చేస్తున్నాయని ఆరోపించారు.

నేటి నుంచి బతుకమ్మ వేడుకలు: జూపల్లి

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ వేడుకలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ప్రారంభ వేడుకలను వరంగల్‌లోని వెయ్యి స్తంభాల గుడి వద్ద అధికారికంగా నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో తనతోపాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క పాల్గొంటారని వెల్లడించారు. చారిత్రక ప్రదేశాలు, పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో 9 రోజులపాటు బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసినట్టు మంత్రి పేర్కొన్నారు.

మాన్యాలపై న్యాయపోరాటం సరిగా లేదు

అసంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి సురేఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 20(నమస్తే తెలంగాణ): దేవుడి మాన్యాలపై న్యాయపోరాటం సరైన రీతిలో ఎందుకు జరుగడం లేదని మంత్రి కొండా సురేఖ అధికారులను ప్రశ్నించారు. శనివారం దేవాదాయ భూములపై అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులతో ఆమె సమీక్ష నిర్వహించారు. దేవుడి భూములు అన్యాక్రాంతానికి సంబంధించిన కేసుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవాదాయభూముల కేసుల విషయంలో న్యాయవాదులతో ప్రతీ ఆరునెలలకోసారి సమావేశం పెట్టి స్టేటస్ చెప్పాలని, దేవుడి భూములు కబ్జా చేస్తే పీడీయాక్ట్ పెట్టాలని అధికారులను ఆదేశించారు. దేవుడి భూములు కాపాడడంలో ఎందుకు జాప్యం జరుగుతున్నదని, తన ముందు వాదించినట్లు కోర్టులో ఎందుకు వాదించలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో ఆ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

యూరియా వ్యాగన్లకు ప్లాట్‌ఫాం లేదా?

రైల్వేతో వ్యవసాయశాఖ సమన్వయ లోపం

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): రైళ్ల ద్వారా రాష్ట్రానికి వచ్చిన యూరియాను దించేందుకు ప్లాట్‌ఫామ్‌లు దొరకడం లేదని, అందుకే రైతులకు యూరియాను సరఫరా చేయడంలో ఆలస్యమవుతున్నదని రాష్ట్ర ప్రభుత్వ అధికారులు చెప్తున్నట్టు తెలిసింది. రైల్వే శాఖ బియ్యం వ్యాగన్లకు ఇస్తున్న ప్రాధాన్యం యూరియాకు ఇవ్వడం లేదని కేంద్రంపైనే నింద మోపేందుకు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. కరీంనగర్, వరంగల్, ఆదిలాబాద్‌లో రైల్వే అధికారులు బియ్యంతోపాటు ఇతర వస్తువుల వ్యాగన్లకు ప్లాట్‌ఫామ్‌లు కేటాయించారని చెప్తున్నారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న దుస్థితిని గమనంలో ఉంచుకొని యూరియా అన్‌లోడింగ్ విషయంలో రైల్వే శాఖతో సమన్వయం చేసుకోవాల్సిన ప్రభుత్వ అధికారులు నిష్క్రియాపరులుగా ఉంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నాటి సీఎం కేసీఆర్ యూరియాను సకాలంలో రైతులకు అందించేందుకు ఏకంగా ఒక ఐఏఎస్ అధికారినే కేటాయించారని, ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రానికి చేరిన యూరియాను రైల్వే గోడౌన్ నుంచి తెచ్చుకోవడంలో విఫలమవుతున్నదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

పాత ఫీజు బకాయిలు ఇవ్వం!

- రూ.2వేల కోట్లు రిజెక్ట్ చేసిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం
- ప్రైవేట్ విద్యాసంస్థలను మోసగించిన కాంగ్రెస్ సర్కారు
- లబోదిబోమంటున్న విద్యాసంస్థల యాజమాన్యాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ఒక కాలేజీకి రావాల్సినవి రూ.1.68 లక్షలు.. మరో కాలేజీవి రూ.79 లక్షలు.. ఇంకో కాలేజీవి రూ.44 లక్షలు. ఇలా లక్షల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ఇచ్చేందుకు కాంగ్రెస్ సర్కారు తిరస్కరించింది. ఇలా దాదాపు రూ.2000 కోట్ల బకాయిలను తిరస్కరించింది. దీంతో కాలేజీల యాజమాన్యాలు లబోదిబోమంటున్నాయి. పాత బకాయిలను ఇవ్వబోమని తేల్చిచెప్పింది. వాస్తవానికి ఇవేం కాలేజీలకు ఉచితంగా ఇచ్చేవేం కావు. రాయితీలు అంతకన్నా కావు. విద్యార్థులకు చదువు చెప్పినందుకు కాలేజీలు, విద్యాసంస్థలకు ప్రభుత్వం న్యాయంగా చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు. కానీ పాత ప్రభుత్వానికి చెందిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలన్న ఒకే ఒక్క కారణంగా కాంగ్రెస్ సర్కారు నిర్దాక్షిణ్యంగా తిరస్కరించింది. సర్కారు వ్యవహారం పట్ల కాలేజీ యాజమాన్యాలు ఫైర్ అవుతున్నాయి. టోకెన్లు కూడా విడుదలైన రూ.3,543 కోట్ల బకాయిల వివరాలను వెల్లడించకుండా, కేవలం రూ.1,207 కోట్లే బకాయిలున్నట్టు బుకాయించిన సర్కారు, తాజాగా పాత బకాయిలను ఇవ్వబోమంటూ తిరస్కరించడం పట్ల యాజమాన్యాలు మండిపడుతున్నాయి.

చర్చల సమయంలోనే సంకేతాలు..

ఫీజు రీయింబర్స్ బకాయిల విడుదల కోసం రాష్ట్రంలోని విద్యాసంస్థలన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. ఫెడరేషన్ ఆఫ్ అసోసియేషన్స్ ఆఫ్ తెలంగాణ హయ్యర్ ఎడ్యుకేషన్స్ ఇన్‌స్టిట్యూషన్స్ (ఫతి)గా ఏర్పడ్డాయి. ఈ నెల 15 నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చాయి. దీంతో సర్కారు మూడు దఫాలుగా ఫతి ప్రతినిధులతో చర్చలు జరిపింది. చర్చల సమయంలోనే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి యాజమాన్యాలకు సంకేతాలిచ్చారు. పాత బకాయిలను ఇవ్వము గాక ఇవ్వమని యాజమాన్యాలకు స్పష్టంచేశారు. తాము అధికారం చేపట్టిన 2023–24, 2024–25 ఆర్థిక సంవత్సరాలే ఇస్తామని చెప్పారు. అయితే యాజమాన్యాలు ఈ విషయాన్ని అంత సీరియస్‌గా తీసుకోలేదు. పైకి అలా చెప్తున్నా ప్రభుత్వమన్నాక అన్నింటినీ ఇవ్వాల్సి ఉంటుందని ఊహించాయి. కానీ ఇందుకు పూర్తిభిన్నంగా సర్కారు వ్యవహరించింది. గత బీఆర్‌ఎస్ హయాంలో జారీ అయిన టోకెన్లను తిరస్కరించింది. తాము అధికారంలోకి వచ్చాక ఏర్పడిన బకాయిలను మాత్రమే చెల్లించేందుకు సిద్ధమైంది. ఈ విషయం తెలుసుకుని కాలేజీల యాజమాన్యాలు బోరుమంటున్నాయి.



తిరస్కరించిన బకాయిలలో కొన్ని

- కాగజ్‌నగర్ జిల్లాలోని ఓ విద్యాసంస్థకు పాత బకాయిల కింద రూ. 34,47,280 రావాల్సి ఉంది. ఇదే జిల్లాలో మరో విద్యాసంస్థకు రూ. 31,46,170 రావాలి.
- నారాయణపేట జిల్లాలో ఓ విద్యాసంస్థకు రూ.1,29,55,060 బకాయిలు రావాల్సి ఉండగా, కోటి రూపాయిలను తిరస్కరించారు. ఇదే జిల్లాలో మరో విద్యాసంస్థకు రూ.1,25,26,900కు టోకెన్లు కూడా జారీ అయ్యాయి. కానీ ఈ మొత్తాన్ని తిరస్కరించారు.
- సూర్యాపేట జిల్లాలో ఓ కాలేజీకి రూ. 43 లక్షలు తిరస్కరించారు. మరో కాలేజీకి రూ.33.13లక్షలు తిరస్కరించారు.

తాము ఫతిగా ఏర్పడి, నిరవధిక బంద్‌కు పిలుపునివ్వడాన్ని జీర్ణించుకోలేకే ప్రభుత్వం తమను వేధిస్తున్నదని, ఇవి కక్ష సాధింపు చర్యలేనని మండిపడుతున్నాయి.

ఈ పాపం కాంగ్రెస్‌దే..

గతంలో ఏ ఒక్క సంవత్సరంలో కాంగ్రెస్ సర్కార్లు వందకు వందశాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించిన దాఖలాల్లేవు. తెలంగాణ ఏర్పాటుకు ముందు ఉమ్మడి రాష్ట్రంలోను ఈ బకాయిలు పేరుకుపోయాయి. నాలుగేండ్ల బకాయిలను కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించకపోవడంతో రూ.1,880 కోట్ల బకాయిలను కేసీఆర్ సర్కారు వారసత్వంగా అందుకున్నది. ఈ బకాయిలను కేసీఆర్ ప్రభుత్వం ఏ మాత్రం భేషజాలకు పోకుండా చెల్లించింది. 2014 –17 వరకు కేసీఆర్ సర్కారు పాత బకాయిలు, అప్పటి బకాయిలను కలుపుకుని రూ.4,687.72 కోట్లను చెల్లించింది. ఉమ్మడి రాష్ట్రంలోని నిబంధనలను యధాతథంగా కొనసాగించింది. పాత బకాయిలు వారసత్వంగా వచ్చాయని, వాటిని చెల్లించబోమనడం దారుణమని కాలేజీల యాజమాన్యాలంటున్నాయి. 2017లో అసెంబ్లీలో చర్చ సందర్భంగా ఎమ్మెల్యేగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ 'ఏ పార్టీ అధికారంలో ఉన్నామన్నది ముఖ్యం కాదు. ప్రభుత్వమన్నాక నిరంతర ప్రక్రియ. ఒక ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన వాటిని మరో ప్రభుత్వం కొనసాగించాలి, బకాయిలను చెల్లించాలి' అని చెప్పారు. మళ్లీ ఇప్పుడు అదే కాంగ్రెస్ సర్కారు పాత బకాయిలతో తమకేం సంబంధం. మేమెందుకు చెల్లించాలంటూ మొండికేసింది. ఏకంగా బకాయిలను చెల్లించకుండా తిరస్కరించింది.

150 మీటర్లతోనే తమ్మిడిహట్టి బరాజ్!

- అందుకు అనుగుణంగా ప్రణాళికలు సిద్ధంచేయాలి
- తక్కువ ఖర్చుతో అంచనాలు రూపొందించాలి
- ఇరిగేషన్ శాఖ అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 20 (నమస్తే తెలంగాణ): ప్రాణహితపై తమ్మిడిహట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బరాజ్ నిర్మించేందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధంచేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. తక్కువ ఖర్చుతోనే అంచనాలను సిద్ధంచేయాలని సూచించినట్టు సమాచారం. ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఉన్నతాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి శనివారం ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ప్రధానంగా తమ్మిడిహట్టి బరాజ్ నిర్మాణంపై చర్చించినట్టు తెలిసింది. ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టులో భాగంగా 152 మీటర్ల ఎత్తుతో తమ్మిడిహట్టి వద్ద బరాజ్‌ను నిర్మిస్తామని, మహారాష్ట్రను ఒప్పిస్తామని కాంగ్రెస్ చెప్తున్నది. ఈ నేపథ్యంలో దానిపై చర్చించారు. అయితే, ప్రస్తుతం 152 మీటర్లతో కాకుండా 150 మీటర్ల ఎఫ్‌ఆర్‌ఎల్‌తోనే బరాజ్‌ను నిర్మించేందుకు అనుగుణంగా ప్రణాళికలను సిద్ధంచేయాలని ఇరిగేషన్ శాఖ అధికారులను సీఎం ఆదేశించినట్టు సమాచారం. అదేవిధంగా మోడికుంట, చనాక–కొరాట, చిన్నకాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించి ఇన్వెస్ట్‌మెంట్ క్లియరెన్స్ తీసుకోవాలని ఇరిగేషన్ శాఖ అధికారులకు సీఎం సూచించినట్టు తెలిసింది. సమావేశంలో ఇరిగేషన్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాహుల్‌బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్‌జీవన్ పాటిల్, ప్రభుత్వ సలహాదారు ఆదిత్యానాథ్‌దాస్, ఈఎన్సీలు పాల్గొన్నారు.

డైవర్షన్‌కే స్థానిక పాచిక

మొదటిపేజీ తరువాయి...

స్థానిక ఎన్నికల డ్రామాకు తెరలేపారని చెప్తున్నారు. రాష్ట్రపతికి పంపిన బీసీ బిల్లులు అక్కడే పెండింగ్‌లో ఉన్నాయని, రాష్ట్రపతి నిర్ణయాధికాన్ని సుప్రీం కోర్టు నిర్ణయించగలదా? అనే అంశం మీద సుప్రీం కోర్టు తీర్పు రిజర్వ్‌లో ఉన్నందున తెలంగాణలో స్థానిక సంస్థల నిర్వహణ సాధ్యం కాదని, కోర్టుకు వెళ్లి గడువు కోరుతామని శుక్రవారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా చిట్‌చాట్‌లో ప్రకటించిన సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీ శివధర్‌రెడ్డి కలిసిన వెంటనే తన అభిప్రాయాన్ని మార్చుకున్నట్టు సమాచారం. శనివారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఇంటెలిజెన్స్ డీజీ సర్కారుపై రైతు, మహిళా వ్యతిరేకత గురించి వివరించినట్టు సమాచారం. ఎంగిలి పూల బతకమ్మ పండుగ నుంచి మొదలుపెట్టి సద్దుల బతుకమ్మ వరకు తొమ్మిది రోజుల పాటు మహిళలు ప్రభుత్వం మీద నిరసన పాటలతో బతుకమ్మ ఆడేందుకు సిద్ధమయ్యారని, గణేశ్ నిమజ్జం రోజున ట్యాంక్‌బండ్ మీద యువత కేసీఆర్ డీజే పాటలను మించి ప్రజలు ప్రభుత్వం, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా గొంతు విప్పబోతున్నారని నివేదించినట్టు తెలిసింది. ఆ వ్యతిరేకతను డైవర్ట్ చేయడం మినహా మరో మార్గం లేదని సూచించినట్టు సమాచారం. దీంతో సీఎం రేవంత్‌రెడ్డి హడావుడిగా స్థానిక సంస్థల ఎన్నికలను తెర మీదికి తెచ్చారన్న చర్చ నడుస్తున్నది. శనివారం ఉన్నపళంగా అందుబాటులో ఉన్న మంత్రులతో కలిసి పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు ఉత్తమ్, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, పంచాయతీ రాజ్ శాఖ ముఖ్య అధికారులతో కలిసి స్థానిక సంస్థల ఎన్నికలు, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అంశంపై సమీక్షా సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లాలా? వద్దా? అనే విషయంలోనే చర్చ జరిగినట్టు తెలిసింది.

కోర్టులో నిలబడదని తెలిసీ..

రాష్ట్రపతికి, గవర్నర్‌కు పంపిన బిల్లులు ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉన్నాయని, బిల్లులు వారి వద్ద పెండింగ్‌లో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా బీసీ కోటా ఉత్తర్వులు ఇవ్వడం కుదరదని పంచాయతీరాజ్ శాఖ అధికారులు సీఎంకు సూచించినట్టు తెలిసింది. పైగా 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తే సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితి కోటాకు విరుద్ధమని, సాంకేతికంగా చూసినా 42 శాతం బీసీ రిజర్వేషన్లు పెంచుతూ ప్రభుత్వం ఇచ్చే జీవో చెల్లదని, ఒక్క దఫాలోనే కోర్టు ముందు కొట్టుడుపోతుందని సూచించినట్టు సమాచారం. అయితే ఉత్తర్వులు కోర్టులో చెల్లకపోవడమనేది బీసీలు, ప్రతిపక్షాలు చూసుకుంటాయని, కోర్టు నిర్ణయానికి ముందే మనం బయపడటం ఎందుకని సీఎం అన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. సద్దుల బతుకమ్మకు రెండు రోజుల ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జీవో జారీచేయాలని, దసరాకు ఒక రోజు ముందో లేక, మరుసటి రోజునో ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించినట్టు తెలిసింది.

ఎంగిలిపూల బతుకమ్మ

ప్రపంచమంతా పూలతో పూజిస్తే.. పూలనే పూజించే గొప్ప సంస్కృతి మనది. ప్రకృతిని ఆరాధించే మహోన్నత వారసత్వానికి ప్రతీక మన బతుకమ్మ పండుగ. అమావాస్య మొదలు దుర్గాష్టమి వరకు జరిగే మహోన్నత వేడుక. మొదటి రోజైన అమావాస్య నాడు 'ఎంగిలిపూల' బతుకమ్మను పేరుస్తారు. సాధారణంగా మహాలయ అమావాస్య నాడు ఎంగిలి పూల బతుకమ్మ మొదలవుతుంది. ఆనాడు ఇంటి యజమాని పితృదేవతలకు తర్పణాలు విడుస్తారు. పిండ ప్రదానం చేయలేని వాళ్లు పెద్దల పేరిట బ్రాహ్మణుడికి సాయిత్యం (వంట సామగ్రి) ఇస్తారు. ఈ సందర్భంగా పెద్దలకు ప్రీతిగా పెసరపప్పు గారెలు, పాయసం నైవేద్యంగా సమర్పిస్తారు. సాయంత్రం గుమ్మంలో నీళ్లు చల్లి, ముగ్గులుపెడతారు. ఉదయాన తెచ్చుకున్న తంగేడు పూలు, గుమ్మడి పూలు, గునుగు పూలతో తల్లి బతుకమ్మ, పిల్ల బతుకమ్మ పేర్చుతారు. వీధిలోని వారంతా బతుకమ్మ ఆడతారు. ఉదయం నానబెట్టిన (మిగిలిన వడపప్పు) పెసర పప్పు, దోసకాయ ముక్కలు నైవేద్యంగా పెడతారు. పెద్దలకు పెట్టగా మిగిలింది కనుక ఎంగిలి (వాడిన) పప్పుగా, భోజనాలయ్యాక పేర్చే బతుకమ్మ కనుక దీనిని ఎంగిలి పూల బతుకమ్మ అని పిలుస్తుంటారు. ఇవాళ్టి నుంచి మొదలయ్యే బతుకమ్మ సందడి తెలంగాణ వైభవాన్ని తొమ్మిది రోజులు చాటుతుంది.

● డా॥ ఆర్.కమల

నేటి బతుకమ్మ



నమస్తే తెలంగాణ
జిందగీ
ఆదివారం | 21 సెప్టెంబర్ 2025
హైదరాబాద్ | www.ntnews.com

శ్రీ రామునీ తల్లి ఉయ్యాలో

శ్రీ రామునీ తల్లి ఉయ్యాలో శ్రీమతి కౌసల్య ఉయ్యాలో
ప్రేమతో శాంతను ఉయ్యాలో పిలిచి దగ్గర తీసి ఉయ్యాలో

నా తల్లి శాంతమ్మ ఉయ్యాలో నా ముద్దులపట్టి ఉయ్యాలో
అత్తవారింటికి ఉయ్యాలో ఆనందముగా పొమ్మ ఉయ్యాలో

అత్తమామల సేవ ఉయ్యాలో ఉత్తమంగా చెయ్యి ఉయ్యాలో
భర్తను సేవించ ఉయ్యాలో వైకుంఠంబున ఉయ్యాలో

వారిపైన ప్రేమ ఉయ్యాలో వాసుదేవుని పూజ ఉయ్యాలో
పేదరికము చూసి ఉయ్యాలో ప్రీతి తప్పకు తల్లి ఉయ్యాలో

కలిగి ఉన్నంతల ఉయ్యాలో కనిపెట్టి తిరగాలి ఉయ్యాలో
ఇరుగు పొరుగిండ్లకు ఉయ్యాలో తిరగబోకోయమ్మ ఉయ్యాలో

అందుకే ముందుగా ఉయ్యాలో ఆలోచనుండాలి ఉయ్యాలో
ఏది చూసిన గాని ఉయ్యాలో ఏది చేసినగాని ఉయ్యాలో

చేసే పనులందు ఉయ్యాలో చిత్తంబు నిలపాలి ఉయ్యాలో
పని చెడినంక ఉయ్యాలో చింతించి ఫలమేమి ఉయ్యాలో

మాట జారిన వెనుక ఉయ్యాలో మరితిరిగి రాదమ్మ ఉయ్యాలో
అందుకే ముందుగా ఉయ్యాలో అలోచనుండాలి ఉయ్యాలో

అపకీర్తి తోను ఉయ్యాలో బతికి ఫలమేమి ఉయ్యాలో
సాధు సత్పురుషులు ఉయ్యాలో సమయానికేతెంచు ఉయ్యాలో

అన్నపానాదుల ఉయ్యాలో ఆదరించుము తల్లి ఉయ్యాలో
అత్తవారింటికి ఉయ్యాలో అమ్మవారింటికి ఉయ్యాలో

మంచిపేరు తెమ్ము ఉయ్యాలో మా తల్లి శాంతమ్మ ఉయ్యాలో
కొడుకులు బిడ్డలు ఉయ్యాలో కొమరొప్పకలగని ఉయ్యాలో


నిండు ముత్తైదువై ఉయ్యాలో ఉండవమ్మ తల్లి ఉయ్యాలో
మంచిపేరు తెమ్ము ఉయ్యాలో మా తల్లి శాంతమ్మ ఉయ్యాలో

కొడుకులు బిడ్డలు ఉయ్యాలో కొమరొప్ప కలగని ఉయ్యాలో
నిండు ముత్తైదువై ఉయ్యాలో ఉండవమ్మ తల్లి ఉయ్యాలో



ఆడాలె పాడాలె..

తెలంగాణ జానపదుల నేల. తల్లి బతుకమ్మ వాళ్ల మది నిండిన దైవం. అలాంటి తల్లిని అచ్చంగా తమ రీతిలోనే కొలవాలని అందమైన పాటలు కట్టారు. ముచ్చటైన ఆటలు కట్టారు. గౌరమ్మ చుట్టూ ప్రదక్షిణ చేస్తూనే, మనసు నిండా పూజ చేసుకునే విభిన్నమైన రీతి ఇది. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో... బంగారు గౌరమ్మ ఉయ్యాలో... అంటూ ఆమెను తమ పాటల్లోనే జగమంతా ఊరేగిస్తారు. కలౌ నామ సంకీర్తనం... అంటుంది శాస్త్రం. కలియుగంలో పాట ద్వారానే, నామ స్మరణ ద్వారానే భగవంతుణ్ని చేరుకోగలమట. అలా అర్చించినా యాగం చేసినంత ఫలమట. అందుకే బతుకమ్మ పండుగ నాడు ఒక్క చేయి, గొంతే కాదు తనువంతా ఆడిపాడి అమ్మను అర్చిస్తుంది. అదే గౌరమ్మకు అసలైన పూజ. అందుకే పండుగ వేళ మనమంతా గొంతెత్తి పాడాలె... ఆనందంగా ఆడాలె!



ప్రయోగాల పాఠశాల

సైన్స్ ఊహ కాదు.. నిజం. కానీ, బట్టీ పడితే ఆ వాస్తవాలపై పట్టుచిక్కదు. సరదా ప్రయోగాలతో సాధన చేస్తే.. సైన్స్ కరతలామలకం అవుతుందంటారు డాక్టర్ రత్నా కొల్లూరి. కష్టమైన సైన్స్‌ని ఇష్టంగా మార్చాలన్నది ఆమె కోరిక కాదు. ప్రఖ్యాత శాస్త్రవేత్త డాక్టర్ కేవీ రావు అభిలాష. ఆయన ఆశయం కోసం స్థాపించిన కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ పాతికేండ్ల పండుగ చేసుకుంటున్నది. బడి పిల్లలకు ప్రయోగశాలగా సేవలు అందిస్తున్న ఈ ప్రత్యక్ష ప్రయోగశాల సైంటిఫిక్ జర్నీని జిందగీతో పంచుకున్నారు. ఆ విశేషాలు డా. రత్న మాటల్లోనే..

చిన్నప్పటి నుంచి సోషల్ సర్వీస్ చేయాలనే కోరిక ఉండేది. కానీ, అందరిలా చదువు అయిపోగానే నేను కూడా ఉద్యోగంలో చేరిపోయాను. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియాలో శాస్త్రవేత్తగా పనిచేసిన డాక్టర్ కేవీ రావు గారు మాకు బంధువు. ఆయన జీఎస్ఐలో జియోకెమికల్ ల్యాబరేటరీ ఏర్పాటులో కీలకంగా పనిచేశారు. మానవాభ్యుదయానికి బాటలువేసేది వైజ్ఞానిక ఆవిష్కరణలేనని ఆయన నమ్మేవారు. దేశాభివృద్ధికి కావాల్సిన శాస్త్రవేత్తలు తయారు కాకపోతే మన దేశానికే కాదు ఏ దేశానికీ భవిష్యత్తు లేదని చెప్పేవారు. మన దేశంలో యువ శాస్త్రవేత్తలకు ప్రోత్సాహం అంతగా లేదని, వాళ్లను సపోర్ట్ చేస్తే అద్భుతాలు జరుగుతాయని ఆయన ఎప్పుడూ అంటుండేవారు. అయితే, తాను ప్రభుత్వ ఉద్యోగంలో ఉండటం వల్ల.. ఆ పని పరిమితంగానే చేశానని బాధపడేవారు. ఆ మాటలు ఎప్పుడూ నా చెవుల్లో మార్మోగేవి!



నేను ఐఐటీ ఢిల్లీలో ఎమ్మెస్సీ కెమిస్ట్రీ చదివాను. కెమికల్ టెక్నాలజీలో ఎంటెక్ చేశాను. ఆ తర్వాత అక్కడే పీహెచ్‌డీ కూడా చేశాను. మా ఆయన చార్టర్డ్ అకౌంటెంట్. మా ఇద్దరిలో ఒకరం సోషల్ సర్వీస్‌లో భాగం అవ్వాలనుకున్నాం. మావారి సపోర్ట్‌తో నేను సోషల్ సర్వీస్‌కు సిద్ధమయ్యాను. కేవీ రావు గారి సంకల్పం మేరకు యువ శాస్త్రవేత్తల్ని ప్రోత్సహించేందుకు ఒక సంస్థను ఏర్పాటు చేయాలని అనుకున్నాను. సరే ఏదో ఒకటి కానివ్వండని రావు గారు పచ్చజెండా ఊపారు. 2000 సంవత్సరంలో ఆయన 80వ పుట్టిన రోజు వేడుక జరిగింది. చాలామంది జూనియర్స్ వచ్చి ఆయన్ను సన్మానించారు. ఆ శాస్త్రవేత్తల సపోర్ట్‌తో ఏదో ఒకటి చేయాలనుకున్నాం. అలా 2001లో కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ (కేవీఆర్ఎస్ఎస్)ని స్థాపించాం.



రేపటి సైంటిస్ట్‌ల కోసం..

నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థల్లో రసాయన శాస్త్ర పరిశోధక విద్యార్థులను ప్రోత్సహించేందుకు కేవీఆర్ఎస్ఎస్ తరఫున రీసెర్చ్ అవార్డ్‌ని ఏర్పాటు చేశాం. వైజ్ఞానిక సంస్థలు శాస్త్రవేత్తలకు అవార్డులు ఇస్తున్నాయి. కాబట్టి చదువుకుంటున్న వాళ్లను ప్రోత్సహించాలనే ఈ కార్యక్రమం చేపట్టాం. మొదటి సంవత్సరం కెమిస్ట్రీ రీసెర్చ్ స్కాలర్స్‌కి పోటీలు పెట్టి అవార్డులు ఇచ్చాం. ఆ మరుసటి సంవత్సరమే కేవీ రావు గారు మరణించారు. అప్పటి నుంచి ఆయన స్మారకంగా ఆ పురస్కారాన్ని అందిస్తున్నాం. తర్వాతి కాలంలో జీవశాస్త్ర పరిశోధక విద్యార్థులకు, ఫిజిక్స్, మ్యాథ్స్ విద్యార్థులకు కూడా అవార్డులు ప్రవేశపెట్టాం. ఏటా అనుభవజ్ఞులైన శాస్త్రవేత్తల పర్యవేక్షణలో పరిశోధక విద్యార్థులకు పోటీలు నిర్వహించి, విజేతలను ఎంపిక చేస్తుంటాం. ప్రతిభావంతుల్ని గుర్తించి, ప్రోత్సహించాలనే సదుద్దేశంతో ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం.

బడిబాట

ఈ అవార్డుల ఎంపికకు జడ్జీలుగా వచ్చే శాస్త్రవేత్తలు 'రీసెర్చ్ స్కాలర్స్‌ని ప్రోత్సహిస్తున్నారు.. సరే! పాఠశాలల పిల్లలకు సైన్స్ పట్ల ఆసక్తి కలిగిస్తే ఇంకా బాగుంటుంది' కదా అన్నారు. వాళ్ల సూచనతో జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్‌లో విద్యార్థులకు పోటీలు నిర్వహించి 'స్మార్ట్ ఇన్నోవేషన్ అవార్డ్స్' ఇవ్వడం ప్రారంభించాం. ఈ సంస్థ ఆధ్వర్యంలో క్విజ్, సైన్స్ ఫెయిర్, స్మార్ట్ ఇన్నోవేషన్ (సైన్స్ మీట్ ఆర్ట్) పేరుతో సైన్స్‌ని ఆర్ట్ ఫామ్‌లో వివరించే పిల్లలకు పోటీలు పెడుతున్నాం. తెలుగునాట మొదలైన ఈ కార్యక్రమాన్ని ఇప్పుడు దక్షిణ భారత దేశమంతటికీ విస్తరించాం.



పిల్లలే చేస్తారు..

పాఠశాల స్థాయి విద్యార్థులకు సైన్స్‌ని మరింత చేరువ చేసేందుకు పదేళ్ల క్రితం హైదరాబాద్‌లోని వెంగళరావు నగర్‌లో కేవీ రావు గారి ఇల్లుని సైన్స్ ల్యాబ్‌గా మార్చేశాం. ఇక్కడ ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ పాఠ్యాంశాలను ప్రయోగపూర్వకంగా నేర్చుకునే వీలుంది. వైజ్ఞానిక సిద్ధాంతాలను ప్రయోగపూర్వకంగా తెలుసుకుంటే పిల్లలు ఎప్పటికీ మర్చిపోరు. అలాగే సైన్స్ నేర్చుకోవడాన్ని పిల్లలు కష్టంగా భావించరు. సరదాగా చదువుకోవడం వల్ల వాళ్లకు ఇంకా నేర్చుకోవాలనే తపన పెరుగుతుంది. మన బడుల్లో పాఠాలు చెప్పే టీచర్లున్నారు. కానీ, వాటిని అనుభవపూర్వకంగా చెప్పే ప్రయోగశాలలు లేవు. సైన్స్‌ని కథ చెప్పినట్టు టీచర్లు చెప్పడం, పిల్లలు బట్టీ పట్టడం అందరికీ తెలిసిందే. ఈ బట్టీ చదువుల విద్యార్థుల్లో నుంచి భవిష్యత్ శాస్త్రవేత్తల్ని ఊహించలేం. సైన్స్ సిద్ధాంతాలు ఎప్పటికీ గుర్తుండిపోవాలంటే ఆ ప్రయోగాలు చేసి తీరాల్సిందే. అప్పుడే పిల్లలకు ఆ సబ్జెక్టులో మంచి మార్కులు వస్తాయి, సైన్స్‌పట్ల ఆసక్తీ పెరుగుతుంది. అలా వారిలో ఉత్సుకతను పెంచడానికి ఓ బడిలాంటి సైన్స్ ల్యాబ్‌ని ఏర్పాటు చేశాం. చాలా పాఠశాలల్లో సైన్స్ ల్యాబ్ ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ సరైన సదుపాయాలు ఉండవు. ఆ విద్యార్థులు వచ్చి తమ పాఠ్యాంశాల్లో ఉన్న జీవశాస్త్ర విశేషాలు, భౌతిక రసాయన శాస్త్ర సిద్ధాంతాలను ప్రయోగపూర్వకంగా తెలుసుకునే వసతులు కల్పించాం. మేమేం ప్రయోగాలను చేసి చూపించం. పిల్లలతోనే ప్రత్యక్షంగా చేయిస్తాం. అప్పుడే వాళ్లకు అవి గుర్తుండిపోతాయి.



సైన్స్ బస్

మా సైన్స్ ల్యాబ్‌కి చుట్టుపక్కల చిన్న చిన్న ప్రైవేట్ పాఠశాలల పిల్లలు, ప్రభుత్వ పాఠశాలల పిల్లలు నడుచుకుంటూ వస్తారు. ప్రతి రోజూ ఒక క్లాస్ జరుగుతుంది. రోజుకు నలభై మంది వరకు వస్తారు. వాళ్ల పాఠ్యపుస్తకాల్లో ఏ ప్రయోగాలు ఉంటే అవి చేయిస్తాం. ల్యాబ్ పరికరాలు, ప్రయోగాలకు కావాల్సిన రసాయనాలను ఉచితంగా ఉపయోగించుకోవచ్చు. కొంత దూరంలో ఉన్న పాఠశాలల పిల్లల కోసం మేమే బస్ వేసుకుని వెళ్తాం. బస్సులో ప్రయోగాలకు కావాల్సిన కిట్లు ఉంటాయి. సరదాగా ఆడుకున్నట్టు వీటితో పిల్లలు ప్రయోగాలు చేసి సిద్ధాంతాలను నేర్చుకుంటారు. ఆసక్తి కలిగించిన తర్వాత ఇక అప్పుడప్పుడు మా సైన్స్ ల్యాబ్‌కి రమ్మని చెబుతాం. కొన్ని ప్రైవేట్ పాఠశాలలు బస్సుల్లో పిల్లల్ని తీసుకువస్తాయి. ఏ తరగతి వాళ్లకు ఆ పాఠ్య పుస్తకం ఆధారంగా ప్రయోగాలు చేసుకునే అవకాశం కల్పిస్తాం. అలాగే మా సిబ్బంది కూడా పిల్లలకు సైన్స్ పాఠాలు చెబుతారు. వారంలో నాలుగు రోజులు బోధన ఉంటుంది. వేసవి సెలవుల్లో పిల్లల కోసం సైన్స్ క్యాంప్ నిర్వహిస్తాం. సూక్ష్మమైన కణాన్ని మైక్రోస్కోపులో, అనంతమైన ఖగోళాన్ని టెలిస్కోపులో చూపిస్తాం. సైన్స్‌ని కథలా వినకుండా కళ్లారా చూసే అవకాశం కల్పిస్తున్నాం. సైంటిఫిక్ భావనల్ని ప్రయోగపూర్వకంగా తెలుసుకుని వైజ్ఞానిక భావన పెంపొందిస్తున్నాం.

... నాగవర్ధన్ రాయల
📷 చిన్న యాదగిరిగౌడ్

నగ ధగలు

పంచలోహ సోయగం!

పంచలోహ విగ్రహాలు మనకు సుపరిచితమే! పంచలోహ ఆభరణాల సంగతీ తెలిసిందే! ఒకప్పుడు ట్రెండింగ్‌లో ఉండి మాయమైన ఈ నగలు ఫ్యాషన్ దునియాలో మళ్లీ మెరిసిపోతున్నాయి. తక్కువ ధరలో దొరికే ఈ మన్నికైన ఆభరణాలు కస్టమైజ్డ్ డిజైన్లలో అందుబాటులోకి వచ్చాయి. ఆధునిక వనితల మనసు దోచేస్తున్న పంచలోహ ఆభరణాలపై ఓ లుక్కేద్దాం.



ప్రాచీన కాలం నుంచే పంచలోహ ఆభరణాలు ఉనికిలో ఉన్నాయి. బంగారం, వెండి, రాగి, కంచు, ఇనుము నిర్దేశించిన పాళ్లలో కలిపి పంచలోహాన్ని తయారు చేస్తారు. వీటితో చేసిన ఆభరణాలు అందంతోపాటు ఆరోగ్యాన్నీ అందిస్తాయని ఆయుర్వేదం చెబుతుంది. ఇందులోని బంగారం సూర్య శక్తిని, వెండి చంద్ర శక్తిని, రాగి జీవశక్తిని, కంచు బలాన్ని, ఇనుము రక్షణను కల్పిస్తాయట. పంచలోహ నగలు ధరించడం వల్ల చర్మ సమస్యలు తొలగిపోతాయని, రక్తప్రసరణ మెరుగుపడటంతోపాటు ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు.



పసిడి ధరలకు రెక్కలు రావడంతో ప్రత్యామ్నాయంగా పంచలోహ నగలపై కన్నేస్తున్నారు మగువలు. కస్టమైజ్డ్ డిజైన్లలో రూపుదిద్దుకుంటున్న పంచలోహ నగలు సంప్రదాయ వస్త్రధారణపైకి పర్‌ఫెక్ట్‌గా సెట్ అవుతాయి. టెంపుల్ స్టైల్ ఇయర్ రింగ్స్, సింపుల్ హారాలు, పెండెంట్స్ ఎత్నిక్ వేర్‌పైకీ సూటవుతాయి. ఎనామిల్ వర్క్‌తో ముస్తాబైన నెక్లెస్‌లు, గాజులు కూడా అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా రెడ్ బ్లాక్ ఎనామెల్ యాక్సెంట్స్‌తో తయారుచేసిన డిజైన్లు అతివల మనసు దోచేస్తున్నాయి. ఇవి లైట్‌వెయిట్‌తో ఉండటంతో రోజువారీ అలంకరణకు చక్కగా సరిపోతాయి. ప్రముఖ నగల దుకాణాలు కూడా ఈ పంచలోహ జువెలరీని అందుబాటులోకి తీసుకొస్తున్నాయి. ఆన్‌లైన్‌లో డిఫరెంట్ డిజైన్లు దొరుకుతున్నాయి. మరి ఇంకెందుకు ఆలస్యం.. మీరూ ఓసారి ట్రై చేయండి!

వ్యాయామంలో రకింగ్!

వాకింగ్.. అన్నిటికన్నా సులభమైన, ఎన్నో ప్రయోజనాలు అందించే వ్యాయామం. అంతకుమించిన ఫలితాలు దక్కాలంటే.. 'రకింగ్' చేయాల్సిందే! ఈ నయా ఎక్సర్‌సైజ్.. ప్రస్తుతం ఐరోపా దేశాల్లో విపరీతంగా ట్రెండింగ్ అవుతున్నది. ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తున్నది. మరి.. అసలు 'రకింగ్' అంటే ఏంటి? దాన్ని ఎలా చేయాలి? ఎలాంటి ఫలితాలు దక్కుతాయో తెలుసుకుందాం!

రకింగ్ అంటే.. బరువుగా ఉండే బ్యాక్‌ప్యాక్‌ను ధరించి వాకింగ్ చేయడమే! శిక్షణలో భాగంగా సైనికుల్లో ఓర్పును పెంపొందించడానికి ఈ వ్యాయామాన్ని ఎక్కువగా చేయించేవారు. ఆ తర్వాత పాశ్చాత్య దేశాల్లో సాధారణ వ్యాయామంగా ప్రజాదరణ పొందింది. ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో ఫిట్‌నెస్ ఫ్రీక్‌గా తెగ ట్రెండ్ అవుతున్నది.

అనేక ప్రయోజనాలు

సాధారణ వాకింగ్‌తో పోలిస్తే, రకింగ్ ద్వారా 13 శాతం ఎక్కువ కేలరీలు ఖర్చవుతాయట. అమెరికన్ కౌన్సిల్ నిర్వహించిన ఓ అధ్యయనం.. ఈ విషయాన్ని తేల్చింది. 55 కిలోల వ్యక్తి.. 9 కిలోల బరువుండే బ్యాగుతో రకింగ్ చేస్తే.. గంటకు 420 కేలరీలు బర్న్ అవుతాయని సదరు సర్వేలో వెల్లడైంది. బరువుగా ఉండే బ్యాక్‌ప్యాక్ ధరించి నడవడం వల్ల కాళ్లు, భుజాలు పూర్తిస్థాయిలో పనిచేస్తూ, శరీరం మొత్తానికీ వ్యాయామం లభిస్తుంది. ఇక రన్నింగ్‌తో పోలిస్తే.. రకింగ్‌లో మోకీళ్లపై ప్రభావం తక్కువగా ఉంటుంది. మోకాళ్లు, చీలమండపై ఒత్తిడి తగ్గుతుంది. గుండె ఆరోగ్యానికీ ఇది భరోసా ఇస్తుంది. కండరాలకు బలాన్ని అందిస్తుంది. మానసిక ఒత్తిడిని దూరం చేస్తుంది. అందుకే.. రకింగ్‌ను 'మెంటల్ మారథాన్'గానూ అభివర్ణిస్తున్నారు.

జాగ్రత్తలు

- రకింగ్ చేయాలనుకునే వారు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని వ్యాయామ నిపుణులు సూచిస్తున్నారు. మొదటగా తేలికపాటి బరువుతోనే మొదలుపెట్టాలి. ఆ తర్వాత క్రమంగా బ్యాక్‌ప్యాక్ బరువుతోపాటు దూరాన్ని పెంచుకుంటూ పోవాలి. ఆదిలోనే అధిక బరువుతో ప్రారంభిస్తే.. మోకాళ్లు, తుంటి, చీలమండలు అసౌకర్యానికి గురవుతాయి.
- బ్యాక్‌ప్యాక్‌ను సరిగ్గా ధరించాలి. లేదంటే, వెన్నుపూసతోపాటు భుజాలపైనా అధిక ఒత్తిడి పడుతుంది. దీనిని నివారించడానికి ప్రత్యేకమైన రకింగ్ వెస్ట్స్ అందుబాటులో ఉంటాయి. ఇవి.. బ్యాక్‌ప్యాక్ బరువును శరీరం మొత్తం సమానంగా పంపిణీ చేయడంలో సాయపడతాయి. వెన్నెముక, భుజాలపై ఒత్తిడిని తగ్గిస్తాయి.
- రకింగ్ చేస్తున్నప్పుడు హృదయ స్పందన రేటును పర్యవేక్షించడం తప్పనిసరి. పల్స్‌రేట్‌ను ట్రాక్ చేయడం వల్ల.. మీ వ్యాయామాలు ప్రభావవంతంగానే ఉన్నాయని నిర్ధారించుకోవచ్చు.